thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 263 | కరీంనగర్ ఆదివారం, 30 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మతుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.

# అనంత్, ప్రతాప్ లు జగిత్యాల అన్నలే.!








## -మహారాష్ట్ర లొంగుబాటుతో వెలుగు లోకి వికాస్ @ అనంత్

## - ఛత్తీస్ ఘడ్ లో లొంగిన జిల్లా అగ్రనేత కాశీరామ్

జగిత్యాల ప్రతినిధి -మహారాష్ట్ర,ఛత్తీస్ ఘడ్ లో రెండు చోట్ల లొంగిపోయిన 13 మంది మావోయిస్టుల్లో ఇద్దరు ముఖ్య నేతలలో అనంత్,ప్రతాప్ లు జగిత్యాల జిల్లాకు చెందినవారు కావడంతో సంచలనం నెలకొంది. అనంత్ తల్లితండ్రులు 1980 నాటికి విప్లవ కుటుంబం.జగిత్యాల జిల్లాలోని ఓ మారుమూల కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో నుండి సాయిలు తన కుటుంబం ను విప్లవ కార్యాచరణ కోసం ముంబై లో ఒక ప్రాంతానికి వెళ్లాడు.అక్కడ ఉండే సాయిలు విప్లవ అవసరాల కోసం బస్తర్ లోని అన్నలుండే ప్రాంతంలో వెళ్ళివస్తూ,తిరిగి భార్య పిల్లలతో కలిసి ఉండే వారు.విప్లవ కారుల అవసరాల కోసం పలు చోట్ల కుటుంబాలను పెట్టి వారిని మావోయిస్టు పార్టీ అవసరాల నిమిత్తం ఉపయోగించుకునే వారు.ఆ సమయంలో సాయిలుకు ముగ్గురు పిల్లలు జన్మించారు.తర్వాత సాయిలు అనారోగ్యం పాలయ్యారు మృతి చెందడంతో భార్య తిరిగి ఇంటికి వచ్చింది.కానీ పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సాయిలు కూతురు.కొడుకు అనంత్ తండ్రి ఆశయసాధనలో అడివి బాట పట్టారు.ఆల సాయిలుకు పుట్టిన కొడుకు,కూతురు విప్లవానికి అంకితమయ్యారు.కొంత కాలం క్రితం అనంత్ ఏవికాస్ చెల్లి ఒక యౌవకుడిని వివాహం చేసుకుని అడివినుంచి వెళ్లి సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు .సాయిలు కొడుకు వికాస్ ఏఅనంత్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ఎంఎంసీ కమిటీలో చేరాడు.మహారాష్ట్ర.మధ్యప్రదేశ్.ఛత్తీస్ ఘడ్ మూడు రాష్ట్రాల కార్నర్ ఏరియను ఏర్పాటు చేసి మావోయిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీని ఖరారు చేసారు.కొత్త కమిటీకి అనంత్ను నియమించారు.ఇటీవల పార్టీ రాష్ట్ర వ్యవహారాల పక్షాన తాము మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు మాదిరిగా లొంగుబాటుకు సిద్ధమే అని స్పష్టం చేశారు.అప్పటినుండి ఆయన పేరు వెలుగు చూడటం మొదలైంది.ఎవరి అనంత్ అని ఎదిరి చూస్తున్న సమయంలో పలు లేఖలు రాశారు.జనవరి నెలలో ఆయన లొంగుబాటు గురించి చెప్పారు కానీ తీరా చూస్తే అనుకున్న సమయానికి నెల రోజుల ముందే అంటే శుక్రవారం మహారాష్ట్ర పోలీస్ అధికారుల వద్దకు తన సభ్యులతో వెంట తెచ్చుకున్న ఆయుధాలతో సహా బయటకు వచ్చి లొంగిపోయారు.లొంగిపోయే వరకు వికాస్ ఏఅనంత్ జగిత్యాల జిల్లా వాసిగా పెద్దగా గుర్తింపు లేదు.దీంతో అనంత్ సరెండర్ జిల్లాలో సంచలనాలుగా మారాయి.

అనంత్ మావోయిస్ట్ పార్టీ లో ఉండి రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉన్నట్లు ఇటు రాష్ట్ర పోలీస్ యాంత్రాంగం, ఎస్, ఐ, బి, ఎస్బి విభాగం, జిల్లా పోలీస్ యంత్రాంగం రికార్డులో కూడా అనంత్ పేరు లేదని తెలిసింది. **42 ఏళ్ల తర్వాత తిరిగొచ్చిన కాశీరామ్ .!**జగిత్యాల ప్రాంత విద్యార్థి అయిన బత్తుల కాశీరామ్ 1983 సంవత్సరా ల క్రితం సాయిరెడ్డి అనే ఓ పేరుతో పంజాల నారాయణ కమాండర్ గా అప్పుడు పీపుల్స్ వార్ లో దళం ఏర్పాటు చేశారు. అతను ఆ సమయంలో బత్తుల కాశీరామ్ దళ సభ్యుడిగా ఉన్నారు.

కొద్దికాలం అంటే 1986 లో కాశీరామ్ ను బస్తర్ లోని ఓ ప్రాంతానికి వెళ్లి పోయారు.అప్పటి నుండి ఆయుధాలను తయారు చేసే పనిలో పడ్డారు సుమారు 43 ఏళ్ల పాటు పార్టీ లో ఉన్న కాశీరామ్ పైన మహారాష్ట్ర,ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలలో కాశీరామ్ ఏప్రతాప్ పైన 25 లక్షల రూపాయల రివార్డ్ ను ప్రకటించారు.కగార్ తలపెట్టి మరీ పెద్ద ఎత్తున ఎన్కౌంటర్ చేసి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది.భారీ సంఖ్యలో సహచరులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత దిగులుతో అడవిలో ఉన్న ఒక్కరు ఒక్కరుగా బయటకు వచ్చి లొంగిపోతున్నారు.శుక్రవారం సాయంత్రం చిత్తీస్ఘడ్ లో ప్రతాప్ పది మంది మావోలతో సహా సరెండర్ అయ్యారు. ఈ ఇద్దరి లొంగుబాటు నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో పెను సంచలనాలుగా నమోదయ్యాయి .



## పంచాయతీ పోరు..

### ముగిసిన మొదటి విడత ఎన్నికల నామినేషన్లు

హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలు మొదటి దశకు సంబంధించి నామినేషన్ల గడువు శనివారం సాయంత్రం ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడించనున్నారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, డిసెంబరు 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచి ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. రేపటి నుంచి డిసెంబరు 2 వరకు రెండో విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.


## పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 10 కీలక బిల్లులు... డిసెంబర్ 1 నుంచి ప్రారంభం




న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.

**బిల్లులు ఇవే..** పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి.

# జీహెచ్ఎంసీ హస్తగతమవుతుందా?




## 'పతంగి'తో పొత్తుతో రేవంత్ నయా ప్లాన్!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చాటిన జీహెచ్ఎంసీ ఎన్నికలను విజయం సాధించాలని భావిస్తున్నది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేళ్లు ప్రతిపక్ష పాత్రకే పరిమితమైన కాంగ్రెస్.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండేండ్లు గడిచిపోయాయి. గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొలువుదీరాక మేయర్ విజయలక్ష్మి హస్తం గూటికి చేరారు. ఆమెతో పాటే చాలా మంది ఇతర పార్టీల కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్?తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మేయర్ కుర్చీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ వశమైంది.

**జీహెచ్ఎంసీ ఎన్నికలు కీలకం..** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పూర్తయింది. ఇక్కడ అధికార పార్టీ సత్తా చాటింది. అయితే, కొద్ది నెలల్లోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకంగా మారనున్నాయి. జూబ్లీహిల్స్ బైపోల్‌లో కాంగ్రెస్‌కు ఎంఐఎం పార్టీ మద్దతు ఇచ్చిందని.. ఫలితంగా గెలుపు సునాయాసం అయ్యిందనే చర్చ జరుగుతున్నది. వచ్చే గ్రేటర్ ఎన్నికల్లోనూ మజ్లిస్ మద్దతును కాంగ్రెస్ తీసుకుంటుందా? అనే ఆసక్తికర చర్చ ప్రస్తుత రాజకీయ వర్గాల్లో మొదలైంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మజ్లిస్ పార్టీ అక్కడ ఏకంగా ఐదు అసెంబ్లీ సీట్లను సాధించింది. ఎంఐఎం బరిలో నిలవడంతో ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమికి పడాల్సిన ముస్లిం ఓట్లు కాస్త మజ్లిస్ ఖాతాలో పడ్డాయి. ఇప్పుడు కూడా ఎంఐఎంతో పొత్తు లేకుండా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలోకి దిగితే ముస్లిం ఓట్లు చీలడం ఖాయం. జాతీయ స్థాయిలో మజ్లిస్ పార్టీకి, కాంగ్రెస్‌కు సంబంధాలు అంతగా బాలేవు. కానీ, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్‌తో ఎంఐఎం మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నది.

**ఏఐసీసీ నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం వెయిటింగ్...** రేవంత్‌రెడ్డి సర్కార్ ఎంఐఎం పార్టీతో సఖ్యతగా ఉంటూ వస్తోంది.

జూబ్లీహిల్స్ ఎన్నిక తరహాలో గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలంటే మజ్లిస్ పార్టీ మద్దతు అవసరమని ఆ పార్టీలో చర్చ జరుగుతున్నది. కానీ పొత్తు కోసం ఏఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్?రావాల్సి ఉంది. కాంగ్రెస్ జాతీయ నేతలు రాష్ట్రంలో ఎంఐఎంతో మైత్రి విషయమై ఏ విధంగా స్పందిస్తారన్న చర్చ ఆసక్తికరంగా మారింది. మేయర్ పీఠం కైవసం చేసుకోవాలంటే పొత్తు తప్పనిసరి అనే అభిప్రాయంలో హస్తం నేతలు ఉన్నట్టు టాక్.

**ఎంఐఎం చేతిలో 45 నుంచి 50 డివిజన్లు...** ఎంఐఎం కంచుకోట పాతబస్తీలో ఆ పార్టీ ఏకపక్షంగా 45 నుంచి 50 డివిజన్ల వరకూ సీట్లను గెలుచుకుంటూ వస్తున్నది. ఓల్డ్‌సిటీ కాకుండా ముస్లిం ప్రాబల్యం ఉన్న ఇతర ప్రాంతాల్లోనూ ఎంఐఎం తన సత్తా చాటుతున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ సంఖ్యలో గణనీయంగా సీట్లు సాధిస్తేనే మేయర్ పదవి దక్కే అవకాశం ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అంతంత మాత్రం సీట్లు సాధించిన కాంగ్రెస్.. గ్రేటర్ ఎన్నికల్లో పాగా వేయాలంటే చాలా కష్టపడాల్సి వస్తుంది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ మినహా మిగతా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. తద్వారా మజ్లిస్?పొత్తు ఉంటే మేయర్ పదవిని కైవసం చేసుకోవడం ఈజీ అవుతుందని హస్తం నేతలు భావిస్తున్నారు. కాగా, జాతీయ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది చూడాలని హస్తం నేతలు అంటున్నారు.




## విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 29: గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఎందుకు? అనే చర్చ జరుగుతుందని.. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. రాష్ట్ర GSDP పెరగాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా విద్యుత్‌లో 30 శాతం గ్రోత్ అవసరం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. '2014 నుండి 2018 వరకు 14.2 శాతం గ్రోత్ ఉంది. 2020-21లో 5.44 శాతం ఉంది. 2024-25 లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 10 శాతం గ్రోత్ వచ్చింది' అని భట్టి లెక్కలు చెప్పారు.




## రాష్ట్రంలో పెరిగిన చలి.. కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు..

హైదరాబాద్, నవంబర్ 29: జీహెచ్ఎంసీ సహా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చలిగాలులు తీవ్రంగా విస్తరిస్తున్నాయి. పెరుగుతున్న చలి దృష్ట్యా.. శనివారం నాటికి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో పడిపోయాయి. సంగారెడ్డి ప్రాంతంలో కనిష్ఠంగా 7.8 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పతనమవ్వగా.. జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణం కంటే భిన్నంగా 11.7 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు తగ్గాయి.

**పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయిలా..** సంగారెడ్డి - 7.8లీ సెంటిగ్రేడ్, ఆసిఫాబాద్ - 8.3లీ సెంటిగ్రేడ్, ఆదిలాబాద్ - 9.2లీ సెంటిగ్రేడ్, వికారాబాద్ - 9.5లీ సెంటిగ్రేడ్, కామారెడ్డి - 9.7లీ సెంటిగ్రేడ్, నిజామాబాద్ - 10లీ సెంటిగ్రేడ్, సిరిసిల్ల - 10లీ సెంటిగ్రేడ్, రంగారెడ్డి - 10లీ సెంటిగ్రేడ్, సిద్దిపేట - 10.1లీ సెంటిగ్రేడ్.

**హైదరాబాద్ పరిధిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలివే..** హైదరాబాద్ విశ్వవిద్యాలయం - 11.8లీ సెంటిగ్రేడ్, శివరాంపల్లి - 12.8లీ సెంటిగ్రేడ్, వెస్ట్ మారేడ్‌పల్లి - 13.2లీ సెంటిగ్రేడ్, జీడిమెట్ల - 13.7లీ సెంటిగ్రేడ్, రాజేంద్రనగర్ - 13.9లీ సెంటిగ్రేడ్, కుత్బుల్లాపూర్ - 14.1లీ సెంటిగ్రేడ్, కార్వాన్ - 14.3లీ సెంటిగ్రేడ్

అయితే.. వాయువ్య దిశగా వీస్తున్న గాలులు, దిత్వా తుఫాను ప్రభావంగానే రాష్ట్రంలో చలి తీవ్రత అధికమవుతున్నట్టు తెలుస్తోంది. శనివారంతోపాటు ఆదివారమూ ఇవే పరిస్థితులు కొనసాగేలా ఉన్నాయి. దిత్వా తుఫాన్ ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముండటంతో పిల్లలు, వృద్ధులు ఆరోగ్య సలహాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. అటు ఉదయం పూటా మంచు తీవ్రత ఎక్కువ అవుతుండటంతో వాహనదారులూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ డ్రామాలను ప్రజలు విశ్వసించరు: మంత్రి సీతక్క

హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో BRS నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. "తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమే. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో BRS చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు" అని మంత్రి అన్నారు.



**నాంపల్లి కోర్టుకు హాజరైన సీతక్క..** కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

## నేను ఇలానే మాట్లాడుతా.. ఏం చేసుకుంటారో చేసుకోండి: కేటీఆర్



హైదరాబాద్ : కొందరు మూరులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.




వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం ఉదయం పరిశీలించారు. ఇందుకోసం ఆయన వందేభారత్ రైలులో హైదరాబాద్ నుంచి వరంగల్ చేరుకున్నారు. అనంతరం రైల్వేస్టేషన్ క్యాంటీన్‌లో 'ఛాయ్ పే' చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కేంద్ర మంత్రికి పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.




## తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్: హరీశ్‌రావు

హైదరాబాద్: కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ ఉద్యమగతిని మలుపుతిప్పిందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నాటి ఆమరణ దీక్ష తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందన్నారు. " 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టారు. 'తెలంగాణ వచ్చుడో-కేసీఆర్ సచ్చుడో' నినాదంతో ఉద్యమం చేపట్టారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేశారు.

రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసేందుకూ సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్‌ది. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్" "నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రం లేదు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యం" అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన కేసీఆర్ దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు తన గుండెలో పదిలంగా ఉన్నాయంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

## సర్పంచిగా ఏకగ్రీవ ఎన్నిక.. రూ.51 లక్షల నిధులు సమకూర్చుతానని హామీ




కొండమల్లేపల్లి: నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచిగా వెంకటయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కోసం రూ.51.30 లక్షలు సొంత నిధులు సమకూరుస్తానని ఆయన గ్రామస్థుల ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలని గ్రామపెద్దలు తీర్మానించినట్లు సమాచారం. వాస్తవానికి ఇక్కడ మూడో విడతలో ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదు: సజ్జనార్



గౌతంనగర్: దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు మెమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు.

ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్: ఐబొమ్మ రవి రెండో విడత కస్టడీ ముగిసింది. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్లు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు.

తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో %లా% అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.



## డాక్టర్‌ను ట్రాప్ చేసిన సైబర్ కేటుగాళ్లు.. రూ.14 కోట్లు స్వాహా

హైదరాబాద్, నవంబర్ 29: సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. సైబర్ మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ పని తాము చేసుకుపోతూనే ఉన్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్.. సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ కేటుగాళ్లు ఎంతో ఈజీగా ట్రాప్ చేశారు. పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.14 కోట్లను స్వాహా చేశారు. సదరు నేరగాళ్లు డాక్టర్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించారు. మోనిక మాధవన్ పేరుతో ఫేస్‌బుక్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేశారు. ఆపై నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ లింక్ పంపించారు నేరగాళ్లు. చాలా పెద్ద మొత్తంలో లాభాలు వచ్చాయని డాక్టర్‌ను నమ్మించారు. అయితే డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయంటే ఎవరు ఊరుకుంటారు చెప్పండి. అలాగే డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు దారాదత్తం చేశాడు.

తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.

# నవయుగ వైతాళికుడు గురజాడ

## – నవంబర్ 30.. మహాకవి వర్ధంతి



నవీన యుగపు వైతాళికుడు, మహాకవి, తెలుగు జాతికి భాష, సాహిత్య రంగంలో అత్యాధునిక, అభ్యుదయ మార్గాన్ని చూపించిన మహా మనీషి గురజాడ అప్పా రావు. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్...అన్న అద్భుత గీతం దేశభక్తిని పెంచినా, 'కన్యాశుల్కం"నాటకం ద్వారా సమాజంలో చిన్నతనపు చేష్టలను ప్రజల ముందుంచినా అది గుర జాడకే చెల్లింది. ఆయన అత్యంత ఆధునికునిగా, రచనలు అన్నిం టిలో పాత బూజును దులిపి, కొత్తదనం అందించే యత్నమే జరిగింది. గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ కారులలో ఒకరు, హేతువాది. 19 వ శతాబ్దంలోను, 20 వ శతాబ్ది మొదటి దశకం లోనూ ప్రజలందరికీ అర్ధమయ్యే జీవ భాషలో చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందు తున్నాయి. "అభ్యుదయ కవితా పితామహుడు" అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. అతనుకు "కవి శేఖర" అనే బిరుదు కూడా ఉంది. గుర జాడ అప్పారావు విశాఖ జిల్లా, రాయవరం (ఎలమంచిలి) లో, మేనమామ ఇంట్లో 1862 సెప్టెంబరు 21న, వెంకట రామ దాసు, కౌసల్యమ్మ దంపతులకు జన్మించారు. గురజాడ అప్పారావు కుటుంబం వారి తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి వలస వచ్చింది. అప్పారావు తండ్రి విజయనగరం సంస్థానంలో పేష్కారుగా, రెవిన్యూ సూపర్వైజరు గాను, ఖిలేదారు గానూ పని చేసారు. తన పదవ ఏట వరకు అప్పారావు చీపురుపల్లిలో చదువు కున్నారు. తర్వాత తండ్రి మరణిం చడంతో, విజయ నగరానికి వెళ్ళారు. ఇక్కడ చాల పేదరికంలో వారాలు చేసుకుంటూ చదువు కొన సాగించారు. ఈ సమయంలో అప్పటి ఎమ్.ఆర్.కాలేజి ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రి చేరదీసి ఉండ డానికి చోటిచ్చారు. 1882లో మెట్రిక్యులేషను పూర్తిచేసి, తర్వాత 1884లో ఎఫ్. ఎ చేసారు. ఇదే సంవత్సరంలో ఏం.ఆర్. హైస్కూలులో టీచరుగా చేరారు. విజయ నగరంలో బి.ఏ చదువు తున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయనకు సహాధ్యాయి. వారిద్దరూ ప్రాణ స్నేహితులు. 1885లో అప్పా రావు అప్పల నరసమ్మను వివాహం చేసుకున్నారు. ముగ్గురు సంతానం – ఇద్దరు కుమార్తెలూ, ఒక కుమారుడు కలిగారు. అప్పటి కళింగ రాజ్యంగా పేరుపొందిన విజయ నగరంలోనే అప్పారావు నివసించారు. విజయనగర సంస్థాన పూసపాటి గజపతి రాజులతో అతనుకు మంచి సంబంధాలు ఉండేవి. 1887లో విజయనగరం కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అతను మొదట ప్రసంగించారు. ఇదే సమయంలో సాంఘిక సేవకై విశాఖ వాలంటరీ సర్వీసులో చేరారు. 1889లో ఆనంద గజపతి డిబేటింగ్ క్లబ్బుకు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో తమ్ముడు శ్యామలరావుతో కలిసి ఆంగ్లంలో పద్యాలు రాసారు. వీరు రాసిన ఆంగ్ల పద్యం సారంగధర, ఇండియన్ లీషర్ అవర్లో చదివి నప్పుడు అందరూ మెచ్చు కున్నారు. అప్పుడే కలకత్తాలో ఉన్న రీస్ అండ్ రోయిట్ ప్రచురణకర్త శ్రీ శంభుచంద్ర ముఖర్జీ విని, అప్పా రావును తెలుగులో రచన చేయడానికి ప్రోత్సహించారు. ఆంగ్లంలో యెంత గొప్పగా వ్రాసినా అది పర భాషేనని, తన మాతృ భాషలో ఇంకా గొప్పగా వ్రాయగలరని ప్రోత్సహించాడు. ఇండియన్ లీషర్ అవర్ ఎడిటరు గుండుకుర్తి వెంకట రమణయ్య కూడా ప్రోత్సహించాడు. 1891లో విజయనగర సంస్థానంలో సంస్థాన శాసన పరిశోధకునిగా గురజాడ నియామకం పొందారు. 1897లో మహారాజా ఆనంద గజపతి చిన్న వ్యాధితో కాలం మృతి చెందాక, మహారాణి అప్పల కొండమాంబకు వ్యక్తిగత కార్యదర్శిగా, 1884లో మహారాజా కాలేజి వారి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, 1886లో డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్కుగా, 1887లో కళాశాలలో అధ్యాపకునిగా, 1886లో రాజా వారి ఆస్థానంలో, 1911లో మద్రాసు యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యునిగా విధులు నిర్వర్తించారు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యా శుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుక భాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యా శుల్కము, వేశ్యా వృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. 1892లో నాటకపు తొలి ప్రదర్శన జరిగింది. 1897లో కన్యా శుల్కము తొలి కూర్పును మహారాజా ఆనంద గజపతికి అంకితమిచ్చారు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కము రెండవ కూర్పును 1909లో రచించారు. 1892లో గురజాడ కన్యా శుల్కము నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీనితో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికింది. సాంఘిక ఉపయోగంతో పాటు రసజ్ఞుల ఆనందానికి కూడా వాడుక భాష వాడవచ్చుని ఈ నాటకం నిరూపించింది. దీని విజయంతో, అప్పారావు ఈ ఆలోచన సరళిని అవలంబించి ఇతర సాహిత్య కర్తలను వెదక సాగారు. ఈ సరళికి అతని చిన్ననాటి స్నేహితుడు చీపురు పల్లిలో తన సహాధ్యాయి అయిన గిడుగు రామమూర్తి ముఖ్యుడు. 20వ శతాబ్ది తొలి నాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషోద్యమంలో గురజాడ అప్పారావు గిడుగు రామమూర్తి పంతులుతో కలిసి పోరాటం సలిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వ విద్యాలయంలో గ్రాంథిక భాషా వాదులతో అలసట ఎరగకుండా తల పడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనా శక్తి వ్యావహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి. వాడుక భాష ప్రయోగానికి వ్యతిరేకి అయిన కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి కూడా ఈ నాటకం సాహితీ విలువలను ప్రశంసించడంతో అప్పారావుకు ఎంతో పేరు వచ్చింది. 1896లో "ప్రకాశిక", అన్న పత్రికను మొదలు పెట్టారు. 1897లో కన్యాశుల్కాన్ని వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు వారు ప్రచురించారు. 1909లో కన్యా శుల్కం తిరగ రాసారు. 1910లో రాసిన "దేశమును ప్రేమించు మన్నా", అనే దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందింది. 1911లో మద్రాసు విశ్వ విద్యాలయం బోర్డు అఫ్ స్టడీస్లో నియమించ బడ్డారు. అదే సంవత్సరంలో, స్నేహితులతో కలిసి ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రారంభించారు. 1913లో అప్పారావు పదవీ విరమణ చేసారు. అప్పటి నుండి అనా రోగ్యంతో బాధ పడేవారు. ఇదే సమయంలో మద్రాస్ విశ్వ విద్యాలయం వారు "ఫెలో"తో గౌరవించారు. చివరికి, 53 సంవత్సరాల వయసులో 1915 నవంబర్ 30 న గురజాడ మరణించారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాడు వీధి వీధినా నాటక రూపంలో మారు మ్రోగిపోయింది. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా, స్త్రీల స్థితిపై సహానుభూతిని చూపటం గురజాడకు సహజమైన పరిణామం. అతి బాల్య వివాహలూ, నిర్బంధ వైధవ్యాలూ, అతి కఠినమైన నైతిక చట్రాలూ, ఆర్థిక పరాధీనతలతో నలిగి పోతున్న ఆ స్త్రీలకు మద్దతుగా నిలవటాన్ని తన ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది ఆయన సాహిత్యం ముఖ్యంగా కన్యా శుల్కం.125 ఏళ్ల తర్వాత కూడా నేటికీ రంగ స్థలానికి వన్నెలు తెస్తూనే ఉంది. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' గేయ తరంగం మనుషుల మెదళ్లలో దూరి ఆలోచనలు రేకెత్తించింది. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అంటూ కొత్త నిర్వచనమిచ్చిన తేజోమూర్తి... 'మంచి అన్నది మాల అయితే ఆ మాల నేనవుతా' అని అంటరాని తనంపై కత్తిదూసిన మానవతా మూర్తి గురజాడ! ఆయన రచనల్లోని పాత్రలు ఒక్కొక్కటి ఒక్కో సంచలనం. తెలుగు నాట సాహితీ విప్లవ ప్రకంపనలు సృష్టించిన శ్రీశ్రీ అంతటి వారే... 'నా అడుగుజాడ గురజాడ' అన్నారు. "గురజాడ 1915 లో చనిపోలేదు. అప్పుడే ఆయన జీవించడం ప్రారంభించారు" – దేవులపల్లి "కృష్ణశాస్త్రి... నాదృష్టిలో కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ"! – శ్రీశ్రీ... ప్రాచీన భారతీయ సాహిత్యం నుంచి, పాశ్చాత్య సాహిత్యంతో లోతైన పరిచయం దాకా విస్తరించిన అధ్యయనం గురజాడది. ఫ్రెంచ్ విప్లవాన్నీ, సాహిత్యాన్నీ గురించిన అవగాహన, ఇతర దేశాల్లో జరుగుతున్న ప్రజాస్వామిక రాజకీయోద్యమాల గురించి తెలుసుకోవటమూ ఆయన దృష్టిని విశాలం చేశాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# సాటిలేని డబ్బింగ్ చిత్రాల పాటల మేటి వెన్నెలకంటి

## నవంబర్ 30... వెన్నెలకంటి జయంతి



మాటరాని మౌనమిది... మౌన వీణ గానమిది మహర్షి సినిమాలోని పాట వినగానే వెంటనే వెన్నెలకంటి గుర్తుకు రాక మానరు. వెన్నెలకంటి పూర్తి పేరు వెన్నెల కంటి రాజేశ్వర ప్రసాద్. అయితే వెన్నెలకంటి గానే అయన సుపరి చితులు. వెన్నెలకంటి 1957 నవంబర్ 30న నెల్లూరులో జన్మించారు. హరి కథలు, అత్యాధ్మిక ప్రసంగాలు వినడం అంటే చాలా ఇష్టపడే వారు. కాలేజి రోజుల్లో "రస వినోదిని" రేడియో ప్రసంగాలు వినేవారు. 11 ఏళ్లకే కవితలు, పద్యాలూ రాశారు. 1975లో విజయవాడ రేడియో కేంద్రం కవితల పోటీలలో 9 కవితలు సెలెక్టు అయ్యాయి. జంద్యాల రాసిన ఏక్ దిన్కా సుల్తాన్, ఈ చరిత్ర ఏ సిరాతో, ఎవ్వనిచే జనించు, దర్పణం వంటి నాట కాలలో నటించారు. సీనియర్ నటుడు, నిర్మాత, ప్రభాకర్ రెడ్డి చొరవ, ప్రోత్సాహం కారణంగా శ్రీరామ చంద్రుడు సినిమాలో చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెల జోల పాట రాయడం ద్వారా తెలుగు చిత్ర సీమలో గీత రచయి తగా పరిచయం అయ్యారు. తరువాత అన్నా చెల్లెలులో పాటలు వ్రాసారు. నాయకుడు సినిమాతో అను వాదంలో ప్రవేశించారు. ప్రేమాగ్ని సినిమాకు తెలుగులో మాటలు వ్రాసారు. కమల్ హాసన్ కు సత్యభామ సినిమాకు డబ్బింగు వ్రాసారు. సుమారు 2000 పాటలు వ్రాసారు. నాగార్జున, బాలకృష్ణ, రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి అగ్ర కథానాయకులందరికీ పాటలు రాసారు వెన్నెలకంటి. 100 సినిమాలకు పైగా డబ్బింగ్ సినిమాలకు తెలుగు డైలాగులు రాసారు. రియాని (2013), ఆవారా (2010), ఆకాశమంత (2009), ఒక్క మగాడు (2007), కొంచెం టచ్ లో ఉంటే చెపుతాను (2005), చంద్రముఖి (2005), పల్నాటి బ్రహ్మ నాయుడు (2003), టక్కరి దొంగ (2002), నరసింహా నాయుడు (2001), అన్నయ్య (2000), సమర సింహా రెడ్డి (1999),శీను (1999), దెయ్యం (1996),శ్రీకృష్ణార్జున విజయం (1996), భైరవ ద్వీపం (1994), ముగ్గురు మొనగాళ్ళు (1994), వన్ బై టూ (1993), అల్లరి ప్రియుడు (1993), స్వాతి కిరణం (1992), ఆదిత్య 369 (1991), ఏప్రిల్ 1 విడుదల (1991), తేనెటీగ (1991), భార్గవ్ (1991), శ్రీరామ చంద్రుడు (1989), చెట్టుకింద ప్లీడరు (1989), మహర్షి (1988), చిత్రాలకు పాటలు రాశారు. పంచం (1987) చిత్రాలకు పాటలు రాశారు. సినీ అభిమాన గేయ రచయితగా పేరు తెచ్చుకున్న వెన్నెలకంటి (63) 2021 జనవరి 5న మంగళవారం సాయంత్రం గుండె పోటుకు గురై చెన్నైలో అకాల మృతి చెందారు. వెన్నెలకంటి అకాల మరణం తెలుగు సినిమా పరిశ్రమలో విషాదం నింపింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# రెండేళ్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ సాఫల్య వైఫల్యాలు



తెలంగాణ రాష్ట్ర రాజకీయం 2023 ఎన్నికలతో మరో మలుపు తిరిగింది. దశాబ్దకాలం ఒక్క పార్టీ ఆధిపత్యాన్ని ముగిస్తూ, 'ప్రజల పాలన%–%ప్రజలతోనే' అని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల వేళ వెలువరించిన ఆరు ముఖ్య హామీలు, రాష్ట్ర పరిపాలనపై "పూర్తి పారదర్శకత" వాగ్దానం, పాత అవినీతి వ్యవస్థలను కూల్చి కొత్త పరిపాలనా సంస్కృతి నెలకొల్పుతామన్న సంకల్పంఈ అన్నింటి మధ్య ప్రజల్లో అపారమైన ఆశలు పెరిగాయి. రెండు సంవత్సరాలు గడిచిన ఈ సమయంలో ప్రభుత్వం వాగ్దానాలు ఎంతవరకు నెరవేర్చింది, ప్రజల జీవన ప్రమాణాల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయి, ఆర్థిక వ్యవస్థ ఎంతవరకు నిలబడింది, పరిపాలనా యంత్రాంగం ప్రభుత్వ దిశకు ఎంతవరకు అనుగుణంగా నడిచింది, మంత్రివర్గం%–%అధికార యంత్రాంగం మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి, రాజకీయ వాతావరణం ప్రభుత్వం పనితీరుకు ఎలా ప్రభావం చూపింది అనే ప్రశ్నలు ఇప్పుడు రాష్ట్ర ప్రజా చర్చల కేంద్రంగా మారాయి. వాస్తవానికి 2023 డిసెంబర్‌లో తెలంగాణ ప్రజలు రాజకీయ మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఆశలు%–%ఆకాంక్షల తుఫానులో అధికార బాధ్యతలు చేపట్టింది. పది ఏళ్ల తర్వాత మారిన పాలన తీరు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ, అమలు చేయవలసిన హామీల భారంతో మొదటి రోజే ప్రభుత్వం తన వేగాన్ని ప్రదర్శించాల్సిన అవసరం వచ్చింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సేవలను అమలు చేయడం ప్రజల్లో విస్తృత స్పందనను తెచ్చింది. ఒకేసారి మహిళా భద్రత, ఆర్థిక స్వయం శక్తి, వృత్తి%–%విద్యావకాశాలపై ఈ పథకం ప్రభావం గురించి రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. రాబోయే నెలల్లో ఈ పథకాన్ని మరింత మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టామని ప్రభుత్వం ప్రకటించినా, రవాణా సంస్థలపై పెరిగిన ఆర్థిక భారం బడ్జెట్‌పై ఒత్తిడిని ఉంచింది. ఇదే సమయంలో ఆరోగ్య రంగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడం వలన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని ప్రజా వర్గాలు అనుకున్నా, కార్పొరేట్ హాస్పిటళ్ల వాటా పెరిగి ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి వేగం తగ్గిందని నిపుణులు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కొరత, పరికరాల నిర్వహణ సమస్యలు, దూర ప్రాంతాల్లో వైద్య సేవల లోపం ఇంకా సవాలుగా మిగిలాయి. రైతుల విషయంలో ప్రభుత్వం వ్యవసాయ రుణ మాఫీని అమలు చేస్తామని పునరుద్ఘాటించి, దశలవారీగా చర్యలు ప్రారంభించినా, మొత్తం రుణభారం, వడ్డీ పెరుగుదల, మార్కెట్ ధరల్లో అనిశ్చితి, ఇనుమడించిన వర్షాభావం వంటి అంశాలు రైతు సంక్షోభాన్ని పూర్తిగా తగ్గించలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద గందరగోళం, చెల్లింపుల ఆలస్యం, ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించే విధానాలపై ప్రభుత్వం%–%రైతుల మధ్య పలు సందర్భాల్లో ఉద్రిక్తత ఏర్పడింది. విద్యా రంగంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. పలు పాలనా నిర్ణయాలు ఆలస్యం కావడం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం, ప్రైవేట్ కాలేజీల్లో అకాడమిక్ కార్యకలాపాల నిలుపు, విద్యార్థుల నిరసనలువిద్యా వాతావరణాన్ని అస్థిరం చేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరత, మౌలిక వసతుల ఆలస్యం, ఉన్నత విద్యాసంస్థల్లో ఉద్యోగాల స్తోమత లేకపోవడం వల్ల యువతలో నిరాశ పెరిగింది. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం పలు నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ, గ్రూప్ పరీక్షల పునరావృత సమస్యలు, ప్రశ్నాపత్రాల లీకులు, కోర్టు కేసులు, ఎంపిక ప్రక్రియల ఆలస్యం వల్ల నిరుద్యోగ యువతలో అసంతృప్తి మరింత గాఢమైంది. నిరుద్యోగ భృతిపై ఎన్నికల హామీ ఇప్పటికీ అమలు దిశలో స్పష్టతను సాధించక పోవడం కూడా ప్రభుత్వంపై విమర్శలకు కారణమైంది. ఆర్థిక రంగంలో పూర్వ ప్రభుత్వపు భారీ అప్పులు, పెద్ద ప్రాజెక్టుల నిర్వహణ భారం, కొత్త సంక్షేమ పథకాల ఖర్చులు, కౌలు రైతులకు మద్దతు చర్యలు రాష్ట్రానికి భారంగా మారాయి. ఆదాయ వనరులు పెంచడంలో ప్రభుత్వం కలిగి ఉన్న ప్రణాళికలు స్పష్టంగా ప్రకటించక పోవడం వల్ల ఆర్థిక స్థితిపై ప్రతిపక్ష విమర్శలు ఉధృతమయ్యాయి. పాలనా వ్యవస్థలో అధికారులు%–%మంత్రుల మధ్య సమన్వయం లోపించడం, ఫైళ్ల నిల్వ, అనేక విభాగాల్లో నిర్ణయాల ఆలస్యం, అకస్మాత్తుగా తీసుకునే ప్రకటనలు, అమలులో కనబడే వ్యవస్థ లోపాలు ప్రభుత్వంపై ప్రత్యేక దృష్టి ఆకర్షించాయి. ముఖ్యంగా అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం పదేపదే స్పందించినా, వివిధ శాఖల్లో నియామకాలు%–%టెండర్లపై వస్తున్న విమర్శలు అధికార ప్రతిష్ఠను దెబ్బతీసాయి. భద్రతా వ్యవస్థ, శాంతిభద్రతల నిర్వహణలో పోలీసులు నిష్పక్షపాత ధోరణిని కోల్పోయారని ప్రతిపక్షం తరచూ విమర్శించింది. మత%–%జాతి ఆధారిత ఉద్రిక్తతలు పెరిగాయని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. పట్టణాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, నీటి సరఫరా, మురుగు వ్యవస్థల సంస్కరణలపై దిశా నిర్దేశం లేకపోవడం కూడా హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రజలను ఇబ్బందుల్లో ఉంచింది. అదే సమయంలో ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రశంసలు పొందాయి. పల్లె%–%పట్టణాల్లో అభివృద్ధి పనులకు అనేక నిధులు కేటాయించడం, పాడి%–%పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేసే చర్యలు, డిజిటల్ సేవల విస్తరణ, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక యూనివర్సిటీలు వంటి నిర్ణయాలు ప్రభుత్వానికి పాజిటివ్‌గా మారాయి. ముఖ్యంగా సంక్షేమం%–%అభివృద్ధి అనే ద్వంద్వ ధోరణిలో ప్రభుత్వం తన గుర్తింపును నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నాలు కనిపించాయి. మొత్తంగా రెండు సంవత్సరాల పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టమైన విజయాలు, ప్రాముఖ్యమైన లోపాలు రెండూ కలిసిన మిశ్రమ పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు అమలు దశకు చేరక పోవడం వల్ల ప్రజలలో ఆశావహ భావనతో పాటు ఆందోళన కూడా పెరిగింది. పరిపాలనా శైలి, ఆర్థిక నిర్వహణ, వ్యవసాయ%–%విద్యా%–%ఉద్యోగ వ్యవస్థల సంస్కరణ, నగరాభివృద్ధిఇవన్నీ రాబోయే సంవత్సరంలో ఈ ప్రభుత్వానికి ప్రధాన పరీక్షలు. ప్రజల అంచనాలు మరింత పెరిగిన తరుణంలో ప్రభుత్వం తన పనితీరును బలోపేతం చేసుకోవాల్సిన అవసరం అత్యవసరమైంది. రెండేళ్ల పాలన రాష్ట్రానికి దిశా నిర్దేశం చేసినా, ఆ దిశలో సుస్థిరమైన అడుగులు వేయాల్సిన బాధ్యత మాత్రం ఇప్పుడు మరింత భారంగా అధికారంపై నిలిచింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బసవపున్నయ్యను టీడబ్ల్యూజేఎఫ్ జనరల్ సెక్రటరీగా పరిగణించొద్దు

**- టీడబ్ల్యూజేఎఫ్ నుంచి అతనిని తొలగించాం**

**- ప్రభుత్వానికి,అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ నేతల ఫిర్యాదు**



హైదరాబాద్, నవంబర్ 29:తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నుంచి తొలగించబడిన బసవపున్నయ్యను ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా పరిగణించవద్దని పలువురు టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక సభ్యులు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. బసవపున్నయ్యను ఇటీవల సంఘం నుంచి శాశ్వతంగా తొలగించామని, అయినప్పటికీ అతను ఇంకా తాను ప్రధానకార్యదర్శి నని చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ కన్వీనింగ్ కమిటీ కో–కన్వీనర్లు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్ తదితరులు రాష్ట్ర కార్మిక శాఖ కమీషనర్ కు, సంయుక్త కమీషనర్, రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ లకు, మీడియా అకాడెమీ కార్యదర్శి లకు ఫిర్యాదు పత్రాలను అందజేశారు. తమ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న బసవపున్నయ్య చాలా రోజులుగా పలు అవకతవకలు, అక్రమాలకు సంఘం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈనెల 15న రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ,కౌన్సిల్ సమావేశంలో అతనిని సంఘం నుండి తొలగించడం జరిగిందని చెప్పారు.

సంఘం బైలా ప్రకారం రెండు సంవత్సరాలకు ఒక సారి రాష్ట్ర మహాసభ(జనరల్ బాడీ మీటింగ్), ఎన్నికలు జరగాల్సి ఉండగా, రాష్ట్ర కమిటీ కాలపరిమితి ముగిసిపోయి ఏడాది కావస్తున్నప్పటికి జనరల్ బాడీ మీటింగ్ పెట్టకుండా, ఎన్నికలు జరపకుండా జనరల్ సెక్రటరీ జాప్యం చేశారని, రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఐదారు నెలలుగా జనరల్ సెక్రటరీకి చాలా సార్లు చెప్పినప్పటికీ అతను పట్టించుకో లేదని అన్నారు. చివరికి గత సెప్టెంబర్ 22న జనరల్ సెక్రటరీకి అధ్యక్షుడు లిఖిత పూర్వక నోటీస్ పంపారని, ఆ నోటీసుకి జనరల్ సెక్రటరీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదని, తిరిగి అక్టోబర్ 23న మరో లిఖిత పూర్వక నోటీసు పంపడం జరిగిందని, దానికి కూడా అతని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని, చివరరగా నవంబర్ 6న మూడోసారి లిఖిత పూర్వక నోటీసు పంపానని,అయినా అతను మొండికేయడంతో నవంబర్ 12న లీగల్ నోటీస్ పంపడం జరిగిందని తెలిపారు. పదేళ్లు జనరల్ సెక్రటరీగా కొనసాగిన బసవపున్నయ్య పూర్తిగా సంఘం వ్యతిరేక చర్యలకు పాల్పడడమే కాకుండా గత పదేళ్లుగా సంఘం ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన లెక్కలు చూపకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారని వారు ఆరోపించారు.

అందుకే అతనిపై క్రమశిక్షణ చర్యల కింద అతనిని సంఘం నుంచి శాశ్వతంగా తొలగించడం జరిగిందని, అదే విధంగా రాష్ట్ర కమిటీ కాలపరిమితి ముగిసినందున రాష్ట్ర కమిటీని పూర్తిగా రద్దు చేసి, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. బసవపున్నయ్యకు టీడబ్ల్యూజే ఎఫ్ సంఘంతో ఎటువంటి సంబంధం లేదని, అతనిని ప్రధాన కార్యదర్శిగా గానీ, సంఘం సభ్యుడిగా గానీ పరిగణించవద్దని వారు ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

చురకలు

## సంపాదకీయం

# అన్న కళ్లల్లో బాధ చూడాలనేనా? కవిత, షర్మిల సేమ్ టు సేమ్

రెండు తెలుగు రాష్ట్రాల్లోని రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల్లోని అన్నాచెల్లెళ్ల వివాదం హాట్ టాపిక్ గా మారుతోంది. ఏపీలో మాజీ సీఎం జగన్ ఆయన సోదరి షర్మిల, తెలంగాణలో బీఆర్ఎస్ వర్కింగు ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయన చెల్లెలు కవిత మధ్య వ్యక్తిగత, రాజకీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. చిత్రంగా మాజీ సీఎం జగన్, బీఆర్ఎస్ నేత కేటీఆర్ మధ్య స్నేహం ఇటీవల కాలంలో ప్రత్యేక చర్చకు దారితీయగా, ఆ ఇద్దరూ ఒకే విధమైన సమస్యలు సొంత చెల్లెళ్ల నుంచి ఎదుర్కోవడం కూడా చర్చకు తావిస్తోంది. ఇదే సమయంలో చెల్లెళ్లు ఇద్దరూ తమ అన్నలను ఇబ్బంది పెట్టేలా రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలుపుతున్నారా? అన్న అనుమానాలు కూడా ఉత్కంఠ రేపుతున్నాయి. మాజీ సీఎం జగన్, ఆయన సోదరి షర్మిల మధ్య ఒకప్పుడు మంచి అనుబంధం ఉండేది. జగన్ అక్రమాస్తుల కేసులో జైలులో ఉండగా, ఆయన తరపున సుమారు 3 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి, ఆయన పార్టీ వైసీపీకి కొత్త ఊపిరి పోశారు షర్మిల. అయితే తన త్యాగం, పోరాటాన్ని జగన్ గుర్తించక పోవడమే కాకుండా తండ్రి నుంచి వంశపారపర్యంగా వస్తున్న ఆస్తుల్లో వాటాలు ఇచ్చేందుకు నిరాకరించడంపై షర్మిల వివాదానికి దిగారు. ఆస్తులపై న్యాయపోరాటం చేయడంతోపాటు ఆయనను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు అనేక అడుగులు వేశారని అంటున్నారు. ఇక ఇదే క్రమంలో ఇప్పుడు బీఆర్ఎస్ బహిష్కృత నాయకురాలు కవిత పావులు కదుపుతున్నారు. తన తండ్రి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వంగా పార్టీపై తనకు సమాన అధికారం కావాలని కోరుకున్న కవిత.. అనూహ్యంగా పార్టీకి దూరమయ్యారు. ఇలా తాను బయటకు రావడానికి అన్న కేటీఆర్ కారణమని కవిత కారాలు మిరియాలు దువ్వుతున్నారు. అయితే ఏపీలో షర్మిల చేస్తున్నట్లు తీవ్రమైన విమర్శలు ఏవీ కేటీఆర్ పై చేయకపోయినా, ఆయనను కార్నర్ చేసేలా పలు కార్యక్రమాలకు దిగుతున్నారు కవిత. దీంతో షర్మిల-కవిత పొలిటికల్ స్ట్రాటజీ చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఈ ఇద్దరు తమ అన్నలకు రాజకీయ ప్రత్యర్థులు అయిన ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డికి సహకరించేలా నడుచుకుంటున్నారనే తాజా ప్రచారం హీట్ పెంచుతోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కుమారుడి వివాహ నిశ్చితార్థ వేడుకకు వెళ్లిన కవిత.. కాంగ్రెస్ జెండాను పోలిన రంగుల అంచున్న తెల్ల చీరను ధరించడంపై అనేక ఊహాగానాలకు కారణమయ్యారు. సాధారణంగా కవిత మంచి రంగుల చీరలు, డిజైనర్ శారీలలో ఎక్కువగా కనిపిస్తారు. ఆమె రాజకీయ జీవితంలో ఎప్పుడు కూడా కాంగ్రెస్ జెండాను పోలిన వస్త్రాలు ధరించలేదు. అయితే అధికార పార్టీ నేతలు అందరూ చేరే చోట తాను కొత్త ఆరంభాన్ని కోరుకుంటున్నట్లు సంకేతాలిచ్చే వస్త్రధారణలో ఆమె కనిపించడమే చర్చనీయాంశం అవుతోంది. ఇదే సమయంలో గతంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సమయంలో షర్మిల పసుపు రంగు చీర ధరించారు. అప్పట్లో చంద్రబాబు సీఎం కాకపోయినా, ఆయనను కలిసే సమయంలో టీడీపీ రంగు అయిన పసుపు రంగు చీరతో షర్మిల వెళ్లడం వైరల్ అయింది. షర్మిల చీరపై ఆయన అన్న జగన్ కూడా అప్పట్లో విమర్శలు గుప్పించారు అంటే అది ఎంత తీవ్రమైన వేదనకు గురిచేస్తుందో చెప్పొచ్చని అంటున్నారు. ఇప్పుడు కవిత సైతం షర్మిల మాదిరిగా కలర్ కోడ్ తో తన అన్నకు ఇండికేషన్ ఇస్తున్నారని అంటున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించి ఆ స్థానం దక్కించుకోవాలని కేటీఆర్ ఉవ్విళ్లూరుతున్నారు. ఆయన ఆశలపై నీళ్లు జల్లుతూ కవిత సీఎం రేవంత్ రెడ్డికి దన్నుగా నిలిచేలా అడుగులు వేస్తున్నారని తాజా ఎపిసోడ్ తర్వాత పొలిటకల్ సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది. దీంతో ఇద్దరు మహిళా నేతలు తమ అన్నల కళ్లల్లో బాధ చూడటానికి వారి రాజకీయ ప్రత్యర్థులతో కలిసి రాజకీయం చేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

# పండితుల పామరులను అలరించిన విశిష్ట శైలి "సిరి వెన్నెలది" - నవంబర్ 30... సిరివెన్నెల సీతారామశాస్త్రి వర్ధంతి



తెలుగు సంగీత సినీ వినీలాకాశంలో మూడున్నర దశాబ్దాల పైగా వేలాది పాటలు రాసిన చేయి తిరిగిన కలం శాశ్వతంగా ఆగిపోయి మూడేళ్లు అయింది. నిమో నియా ( ఊపిరితిత్తుల క్యాన్సర్) కారణంగా హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ లో నవంబర్ 202124న చేరిన సిరివెన్నెల సీతారామ శాస్త్రి నవంబర్ 30 సాయంత్రం ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించి ఈ లోకాన్ని వదిలి వెళ్ళిన నేపథ్యం విదితమే. సిరివెన్నెల సీతారామశాస్త్రి అసలు పేరు చంబోలు సీతారామ శాస్త్రి. విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి మండలంలో మే 20, 1955 వ తేదీన వేద పండితుడు, డా.సి.వి.యోగి, అమ్మాజి (సుబ్బలక్ష్మి)కి జన్మించారు. అనకాపల్లి లోని మున్సిపల్ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్లో చేరి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేశారు. అనంతరం అనకాపల్లిలోని బీఎస్ఎన్ఎల్ శాఖలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్లో చురు కైన పాత్ర పోషించారు. చిన్నతనం నుంచి సందేశాత్మక, దేశభక్తి గీతాలు రాయడం సీతారామశాస్త్రికి అలవాటు. అనేక కార్యక్రమాల్లో సైతం సొంతంగా పాటలు రాసి అలపించేవారు. 1983లో కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ ను కలిసే అవకాశం కలుగగా, సీతారామ శాస్త్రి ప్రతిభను కె.విశ్వనాథ్ గుర్తించారు. ఆయన చిత్రంలో పాటలు రాసే అవకాశం ఇచ్చారు. సిరివెన్నెల సినిమాలో ఆయన రాసిన పాటలు ఎంతగానో జనాదరణ పొందాయి. అలా ఆ సినిమా పేరే సీతారామశాస్త్రి ఇంటి పేరుగా మారింది. రాసిన తొలి పాట 'విధాత తలపున'కే నంది అవార్డు దక్కించుకున్న ఘనత సీతారామ శాస్త్రికే దక్కిన అరుదైన గౌరవం. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో 800కు పైగా చిత్రాలలో, సిరివెన్నెల మూడు వేలకు పైగా పాటలు రాశారు. విరించినై = బ్రహ్మను నేనై, విర చించితిని = రచించితిని, ఈ కవనం = ఈ కవిత్వం, విపంచినై = వీణనై, వినిపించితిని = వినిపిస్తున్నా, ఈ గీతం =ఈ పాటను అంటూ బ్రహ్మగా కొంగ్రొత్త రచనల పరంపర సృష్టించి, చదువుల తల్లి వీణ సాయంతో వినిపించడం ప్రారంభించిన సిరివెన్నెల సినీ లోకానికి, తెలుగు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే సుమధుర గీతాలెన్నింటినో రాశారు. తెలుగులో ప్రజానీకానికి తెలిసిన, తెలియని సాహిత్య ప్రక్రియలన్నింటినీ పలకరించారు, ప్రజల హృదయాలకు చేర్చారు సిరివెన్నెల. విధాత తలంపున ప్రభవించినది... అంటూ ఆయన రాసిన మొదటి పాటే తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో ఆయనకు స్థానం సంపాదించి పెట్టింది. విధాత తలపున ప్రభవించినది.. సిరివెన్నెల రాసిన తొలి పాట. చివరిసారిగా.. అఖిల్ నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్ చిత్రంలో చిట్టి అడుగు అనే పాట రాశారు. చాలా రకాల పాటలను రాసారు. సంప్రదాయ కవిత్వం దగ్గర నుండి జానపద గీతాల వరకు అన్నింటి లోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. తన ఉత్తమ విమర్శకు రాలిగా తన భార్య 'పద్మావతి'ని పేర్కొనే సీతారామశాస్త్రి తన గురువుగా శ్రీ వై. సత్యారావు అని చెప్పేవారు. ప్రముఖ తెలుగు, హిందీ చలనచిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన గాయం తెలుగు సినిమాలో నిగ్గదీసి అడుగు ఈ సిగ్గు లేని జనాన్ని... అని పాట పాడే ప్రభావ శీలమయిన పాత్రలో తను వ్రాసి నటించగా, తను వ్రాసిన పాటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం లభించటం విశేషం. సినీ సాహిత్య రంగంలో చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం సిరివెన్నెల సీతారామశాస్త్రిని పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన సినీ కెరీర్లో మొత్తం 11 నంది అవార్డులు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందు కున్నారు. ఉత్తమ గేయ రచయితగా :1986 సిరివెన్నెల, 1987 – శ్రుతిలయలు, 1988 – స్వర్ణకమలం, 1993 – గాయం, 1994 – శుభలగ్నం, 1995 – శ్రీకారం, 1997 – సింధూరం, 1999 – ప్రేమకథ, 2005 – చక్రం, 2008 – గమ్యం, 2013 – సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రాలలో ఆయన రాసిన పాటలకు , ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాలు, ఆయనకు లభించాయి. 2005 – నువ్వొస్తా నంటే నేనొద్దంటానా, 2008 – గమ్యం – ఎంతవరకు, 2009 – మహాత్మ – ఇందిరమ్మ, 2015 – కంచె దక్షిణాది ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# భారతీయ ఒక రూపాయి నోటు చరిత్ర - నవంబర్ 30న తొలి నోటు విడుదల


భారత దేశంలో ఒక్క రూపాయి నోటు ముద్రణ ఎప్పుడు జరిగిందో తెలుసా? వందేళ్ల క్రితం బ్రిటిష్ ఇండియాలో మొదటిసారి రూపాయి నోటును ప్రవేశపెట్టారు. నవంబర్ 30, 1917న తొలి రూపాయి నోటును బ్రిటిష్ పాలకులు విడుదల చేశారని రికార్డులు చెబుతున్నాయి. 1917 నుంచి 2017 మధ్య 125 రకాల విభిన్న నోట్లను ప్రాచుర్యంలోకి వచ్చాయి. దీని డిజైన్ను కూడా 28సార్లు మార్చారు. సంస్కృత పదమైన రూప్యకం నుండి రూపాయి వచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూపాయిని రూపాయి, రూపీ, రుపయ్యా అని పలుకుతారు. అస్సామీ, బెంగాలీ భాషల్లో మాత్రం రూపాయిని టాకా అని పిలుస్తారు. రూపాయికి వంద పైసలు. బ్రిటిషు వారి కాలంలో రూపాయికి 16 అణాలు. 1957లో రూపాయికి 100 పైసలుగా నిర్ధారించి, ఈ పైసలను నయా (హిందీలో "కొత్త") పైసలుగా పిలిచారు. భారతీయ కరెన్సీలో తొలిసారిగా వచ్చిన నోటు ఇదే. ఇంగ్లాండ్లో ఈ నోటును తొలిసారిగా ముద్రించారు. వాస్తవానికి1877లో షిర్కార్ పేరిట కశ్మీర్లో రూపాయి నోటు జారీ చేశారు. తొట్ట తొలి రూపాయి నోటును 30 /11 / 1917న మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. దానిపై "I PROMISE TO PAY" అని రాశారు. అప్పటి బ్రిటిష్ పాలకుడు ఐదో కింగ్ జార్జ్ ఫొటో నోటుపై ఒక వైపున ఉండేది. తొలి రూపాయి నోటుపై ఎంఎంఎస్ గుబ్బే, ఏసీ మాక్‌వాట్టర్స్, హెచ్ డెన్నింగ్ అనే ముగ్గురు బ్రిటన్ ఆర్థిక కార్యదర్శుల సంతకాలు ఉండేవి. తెలుగు, ఉర్దూ సహా మొత్తం 8 భాషల్లో 'ఒక రూపాయి' అని నోటుకు మరోవైపు ముద్రించేవారు. నిజాం రాజ్యంలో 1919లో రూపాయి నోటును విడుదల చేశారు. తర్వాత 1943, 1946 లోనూ వీటిని నైజాం మార్కెట్లో ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి రూపాయి నోటును 1948లో జారీ చేశారు. దానిపై మలయాళం మినహా 8 భారతీయ భాషల్లో వన్ రూపీ అని రాశారు. ఈ నోటు పరిమాణం, రంగు కూడా అంతకు ముందు నోట్ల కంటే విభిన్నంగా ఉండేవి. 1956లో కేరళ రాష్ట్రం ఏర్పాటయ్యాక రూపాయి నోటు మీద మలయాళం భాషను కూడా చేర్చారు. 1948 నుంచి 60 రకాల రూపాయి నోట్లు, వేర్వేరు సీరియల్ నంబర్లతో దర్శనం ఇచ్చాయి. 1949 వరకూ పాకిస్థాన్లోనూ రూపాయి నోటు చలామణిలో ఉండేది. నాటి ఆర్థిక కార్యదర్శి కేఆర్కే మీనన్ సంతకం చేసిన ఈ నోటు మీద బ్లాక్ ప్రింట్ వేసి పాక్లో చలామణి చేసేవారు. తర్వాత 1949లో వీటిని రద్దు చేశారు. 1949లో కొత్త డిజైన్ ప్రవేశపెట్టారు. దీనిపై అశోకుడి సార్‌నాథ్ స్తూపంపై ఉన్న నాలుగు సింహాల గుర్తును ముద్రించారు. దీన్నే మరుసటి ఏడాది భారత అధికారిక చిహ్నంగా ప్రకటించారు. 1969లో గాంధీ స్మారకంగా రూపాయి నోటు మీద ఆయన చిత్రాన్ని ఉంచారు. 1970 వరకూ భారత కరెన్సీని దుబాయ్, బహ్రెయిన్, మస్కట్, ఒమన్ లాంటి పర్షియన్, గల్ఫ్ దేశాల్లో ఉపయోగించేవారు. భారతదేశంలో అధికారక మారక ద్రవ్యంగా ఉపయోగించే వివిధ ద్రవ్య నోట్లలో ఒక రూపాయి నోటుకి ఒక ప్రత్యేకత ఉంది. భారతదేశంలో ఉపయోగించే ఒక రూపాయి నోటు మీద తప్ప, మిగతా అన్ని ద్రవ్య మారక నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించబడి ఉంటే ఒక రూపాయి నోటుపై మాత్రం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అని ముద్రించబడి ఉంటుంది. అలాగే రూపాయి నోటు మీద తప్ప, మిగతా నోట్లపై రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంతకం ఉంటే ఒక రూపాయి నోటు పై సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ సంతకం ఉంటుంది. రెండు రూపాయలు లేదా అంతకన్నా ఎక్కువ విలువగల కరెన్సీ నోట్లు భారత రిజర్వ్ బ్యాంక్ ఆధీనంలోకి రాగా ఒక రూపాయి నోట్లు భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉంటాయి. రూపాయి నోటుపై ఒక రూపాయి అని తెలియజేసేలా రూపాయి నోటుకు ఒక వైపున (వెనుకవైపున) ఒక లేబుల్ గా భారతీయ భాషలలోని ముఖ్యమైన భాషలలో "ఒక రూపాయ" అని ముద్రించబడి ఉంటుంది. రూపాయి నోటు ముద్రితమైన తొలినాళ్ళలో "ఒక రూపాయ" అని వివిధ భాషలలో తెలియజేసే ఈ లేబుల్ పై తక్కువ భాషలలో ముద్రితమవగా, 1994 లో ముద్రణ నిలిపి వేసే





నాటికి 13 భాషలకు చేరుకుంది. రూపాయి నోట్ పై 1994 నాటికి ప్రత్యేక లేబుల్ పై ఒక రూపాయ అని చూపించే భాషలు 13, అయితే ఈ లేబుల్ లో అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీషు కనిపించదు, దీనిలో భారతీయ భాషలు మాత్రమే ఉంటాయి. కానీ మొత్తం మీద చూస్తే ఇంగ్లీషు అక్షరాలలో వ్రాసిన "%ాచీజు =ఖ్రాజుజు%" అనే అక్షరాలే హైలెట్ గా ఉంటాయి. రూపాయి నోటు యొక్క భాషల పలక మీద "ఒక రూపాయ" అని వ్రాయబడిన (వ్రాయబడుతున్న) భారతీయ భాషలు – 1.అస్సామీ, 2.బెంగాలీ, 3.గుజరాతీ, 4.కన్నడ, 5.కాశ్మీరీ, 6.కొంకణి, 7.మలయాళం, 8.మరాఠీ, 9.నేపాలీ, 10.ఒరియా, 11.పంజాబీ, 12.సంస్కృతం, 13.తమిళం, 14.తెలుగు, 15.ఉర్దూ (ఈ భాషలు ఇంగ్లీషు అక్షరమాల అనుసరించి అక్షర క్రమంలో కూర్చబడినవి, వీటిలో కొంకణి, నేపాలీ భాషలు కొత్తగా చేర్చ బడ్డాయి. కేంద్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ లో ఉంటే వెంటనే రూపాయి నోట్లను ముద్రించి లోటు బడ్జెట్ నుంచి గట్టెక్కడానికి అధికారాన్ని కల్పించారు. ఈ నోట్ల ముద్రణ వ్యయం రోజురోజుకు పెరిగి పోవడంతో 1994 నుంచి నోట్ల ముద్రణ నిలిచిపోయింది. దాదాపు 20 ఏళ్ళ తరువాత 2015 లో భారత ప్రభుత్వం మళ్లీ రూపాయి నోటును ముద్రించి చెలామణిలోకి తీసుకొచ్చింది. 2015లో ముద్రించ బడిన ఈ కొత్త నోటుపై కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి రాజీవ్ మెహ్రిషి సంతకం ఉంటుంది. ఈ నోటును 2015 మార్చి 6 న రాజస్థాన్ లోని నాథ్ ద్వారా వద్ద గల శ్రీనాథ్‌జీ ఆలయంలో విడుదల చేశారు. ఈ నోటుకు వాటర్ మార్క్ సంకేతంగా "సత్యమేవ జయతే" అనే అక్షరాలు లేని అశోక స్తంభాన్ని ఉపయోగించారు. నోటు మధ్యలో అంతరంగా అంకెతో పాటు కుడి వైపున దేవనాగరి లిపిలో ముద్రించబడిన "భారత్" అనే అక్షరాలు పైకి కనిపించవు. ఈ నోటును ప్రధానంగా గులాబి, ఆకుపచ్చ రంగులతో రూపొందించారు. ఈ కొత్త రూపాయి నోటు 110 మైక్రాన్ల మందంతో ఉంటుంది. చాలా మందికి పాతనోట్లను దాచుకునే అలవాటు ఉంటుంది. 1985లో వచ్చిన ఒక రూపాయి నోటును రూ.2.75 లక్షలకు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. మరికొందరైతే ఒక రూపాయి నోట్లు ఉన్న వందకట్ట కోసం రూ. 15వేలు కూడా చెల్లించారు. 2017 జనవరి 21న ఒక రూపాయి నోటును వేలం వేయగా రూ. 2.27 లక్షలు పలికింది. 2017, ఏప్రిల్ ఒకటిన రూ.1.5 లక్షలకు, 2009 అక్టోబరులో రూ.1.3 లక్షలకు సొంతం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 945058549**

# ఖండాంతర ఖ్యాతిని ఆర్జించిన ఏల్చూరి - నవంబర్ 30... ఏల్చూరి విజయరాఘవ రావు వర్ధంతి

ఏల్చూరి విజయరాఘవ రావు (నవంబర్ 3, 1925 – నవంబర్ 30, 2011) ఖండాంతర ప్రఖ్యాత భారతీయ సంగీత కారుడు, వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు, సంగీత బాణీలు సమకూర్పులో నిష్ణాతుడు, నర్తకుడు, బహుభాషా కోవిదుడు, ప్రయోక్త, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత, "పద్మశ్రీ" విజేతయైన అత్యంత ప్రతిభా వంతుడు. "రఘుపతి రాఘవ రాజారాం" పాట స్వరకర్త. మహాత్మా గాంధీనే తన రామధున్ కార్యక్రమం ద్వారా మెప్పించాడు. సర్దార్ పటేల్ కు స్వస్థత చేకూర్పు కోసం, కొంత కాలం సంగీతం వినిపించాడు. ఖండాంతర ఖ్యాతి నార్జించాడు. ప్రపంచంలో మూడు ఖండాలలో ఒకసారి కాదు, ఎన్నోసార్లు ఆయన సంగీత కచేరీలు నిర్వహించాడు. ఆయన వేణునాద రికార్డులు ఇంగ్లండు, పారిస్‌లోనూ లభిస్తాయి. ప్రాచుర్యం పొందాయి. బహు భాషావేత్త గా, వాద్య కారునిగా, నర్తకునిగా, స్వరకర్తగా, రచయితగా, ప్రాసంగికునిగా, ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. విజయ రాఘవరావు ఏల్చూరి రామయ్య, సుబ్బాయమ్మ దంపతుల ద్వితీయ సంతానంగా 1925, నవంబర్ 3 న జన్మించాడు. ఆయన పసి బిడ్డగా ఉండగానె తండ్రి మృతి చెందారు. అయన సోదరుడు నయాగరా కవుల్లో ఒకరైన శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యం. తండ్రి నుంచి ఆయనకు సంగీతాభిమానం సంక్రమించింది. ఆయన తెలుగు, ఇంగ్లీష్, హిందీలతో బాటుగా బెంగాలీ వంటి ఇతర భాషలు కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. విజయ రాఘవరావు తన కళాజీవితాన్ని భరత నాట్యంతో మొదలు పెట్టినప్పటికీ, ఆయన వేణువునే కాక, వాద్యబృంద నిర్వహణనూ, మెళుకువలనూ, స్వరరచననూ, సంగీత ప్రసంగాలనూ అద్భుతంగా నిర్వహించాడు. తెలుగులో కవితలు అకాడమే కాదు, ఇంగ్లీషులో రచనలూ చేశాడు. నరసరావుపేటలో చెరువు కట్ట మీద యాదవుల పిల్లలతో కూడి వారి వద్దనే వేణువు వాయించడం నేర్చుకున్న విజయ రాఘవరావుకు ప్రాథమికంగా గురువు ఎవరూ లేరు. మద్రాసు వెళ్ళి కళా క్షేత్రంలో సంగీతం, రుక్మిణీదేవి అరండేల్ వద్ద భరత నాట్యం అభ్యసించాడు. అక్కడికి వచ్చిన ప్రఖ్యాత నర్తకులు ఉదయ శంకర్ దృష్టిని ఆకర్షించి వారి నృత్య బృందంలో నర్తకుడిగా చేరి, దేశ విదేశాలూ తిరిగాడు. ఆ ప్రదర్శనలు ఇస్తున్నపుడే ఒకసారి రష్యాలో నాట్య ప్రదర్శన అనంతరం వేణు గానంతో అక్కడి శ్రోతల్ని అబ్బుర పరిచగా, ఆ సందర్భంలోనే ఉదయ శంకర్ సోదరుడు పండిట్ రవి శంకర్ తన శిష్యుడిగా స్వీకరించి హిందూస్తానీ సంగీత ప్రపంచం లోకి ఆయన్ని ఆహ్వానించాడు. అలా ఆయన ప్రతిభ మరింతగా విస్తరించింది. సితార్ విద్వాంసుడైన రవిశంకర్‌వద్ద సంగీతం నేర్చుకున్న విజయ రాఘవరావు ఆయనకు నికరమైన శిష్యుడు. రవిశంకర్ స్వయంగా సంగీతరచన చేసిన అనూరాధా, గోదాన్, మీరా మొదలైన హిందీ చిత్రాల రికార్డింగ్ లన్నిటిలోనూ రావు ప్రధానపాత్ర నిర్వహించాడు. ఫిల్మ్ డివిజన్‌వారి అసంఖ్యాకమైన డాక్యుమెంటరీల సంగీతంలో ఆయన రేడియో శబ్దాల దగ్గర్నుంచీ, రకరకాల ప్రపంచ వాద్యాల దాకా అనేకం వాడి విజయ వంతమైన ప్రయోగాలు చేశాడు. 1955 నుండి 1958 వరకు ఢిల్లీ ఆకాశవాణి కేంద్రంలో విజయ రాఘవరావు సంగీత ప్రయోక్తగా, వాద్యబృంద కార్యక్రమ సంవిధాన కర్తగా పనిచేశాడు. గాంధీజీ హత్య జరిగినపుడు 'రఘుపతి రాఘవ రాజారాం' అనే గీతాన్ని శృతిలయ బద్ధంగా ఎడతెగకుండా వాద్యసంగీత రూపంగా ప్రసారం చేయించాడు. 24 గంటలు ఈ ప్రార్థన సందేశ గీతిక ప్రసార మవుతూనే ఉంది. దీనిని స్వరపరచినది రాఘవరావే. ఆ తరువాత మహాత్మాగాంధీ సంస్మరణ నివాళిగా ఇది సంప్రదాయ నిబద్ధమైంది. 1950 ప్రాంతాలలో సర్దార్ పటేల్ కొద్ది రోజులు తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండేవారు. అప్పుడు వరసగా కొన్ని రోజులు తనను సంగీతంతో సేదదీర్చ వలసిందని పటేల్ విజయ రాఘవరావును కోరారు. సాయంకాలం ఒక గంట విజయ రాఘవరావు, ఉస్తాద్ అల్లారాఖా తబలా వాద్య సహకారంతో పటేల్ మనస్సును స్వస్థ పరచేవారు, రంజింప జేసేవారు.



అమెరికాలో వాషింగ్టన్, డి.సి.లో 'కార్నెజీ హాల్' అని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సభా భవనం ఉంది. ప్రపంచ ప్రసిద్ధులైన కళాకారుల గాన సభలు అక్కడ సంగీత కచేరీ నిర్వహించడం జీవిత సాఫల్యంగా భావిస్తారు. విజయ రాఘవరావు కార్నెజీ హాల్‌లో వారి ఆహ్వానంపై వేణునాదం విన్పించారు. అమెరికాలో జార్జియా రాష్ట్రంలో భారతీయ సంగీతం, సంస్కృతి, జ్ఞాన సాధన, చింతన ధారలను ప్రచారం చేసే ఒక పత్రిక వెలువడుతున్నది. ముఖ్యంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి కార్యక్రమ నిర్వహణ విశేషాలను ప్రకటిస్తుంది ఈ పత్రిక. పన్నెండేళ్ళ కిందట 'అట్లాంటా' నగరంలో 'ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ సొసైటీ ఆఫ్ గ్రేటర్ అట్లాంటా అనే సాంస్కృతిక సంస్థ విజయ రాఘవరావు సంగీత కచేరీ ఏర్పాటు చేసింది. ఆయన గొప్ప నర్తకుడు కూడా. దేశవిదేశాలలో అనేక నృత్యప్రదర్శన లిచ్చాడు. పసిపిల్లల వంటి పరమ ఉల్లాస ప్రవృత్తి ఆయనది. సోనీ కంపెనీ వాళ్ళు విజయ రాఘవరావు హంసధ్వని గంటన్నరసేపు ఆలపించగా రికార్డు చేశారు. 'భువన్ షోమ్' కూడా నాకు వారు ప్రదర్శించి చూపారు. ఏల్చూరి విజయ రాఘవరావు ఇంగ్లీషులో, తెలుగులో కవిత్వం రాశారు, కథలు రాశారు. 1991 జనవరి– ఫిబ్రవరి ఇండియన్ లిటరేచర్ (సాహిత్య అకాడమి)లో ఆయన సాహిత్య ప్రస్థాన వ్యాసం ప్రచురితం. అందులో సంగీత సాహిత్యాలలో ఆయన ప్రజ్ఞ, హృదయ వైశాల్యం ఎంతో గొప్పగా ఆవిష్కృతమైనాయి. ఆయనకు 1970 లో భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు అయిన పద్మశ్రీ వచ్చింది. 1982 లో సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. జాతీయ అంతర్జాతీయ స్వర్ణ పతక సమ్మానితుడు గా సంగీత ప్రపంచంలో నిలిచి పోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

చురకలు



## 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16-18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.
వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

## టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గానూ 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ఫారం ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు.
టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.
కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

## నిర్మించారు.. వదిలేశారు



గోదావరిఖని : రామగుండం నగరపాలక అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణాల పేరిట ప్రజాధనం వృథా అవుతోంది. అనాలోచిత నిర్ణయాలతో పాటు పూర్తయిన నిర్మాణాలను వినియోగంలోకి తేవడంలో నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా నిలుస్తోంది. కియాస్కీల(దుకాణాలు) కోసం దరఖాస్తులు స్వీకరించిన నగరపాలక అధికారులు కేటాయించడం మరిచారు. మరీ చిన్నగా ఉండటంతో పాటు విద్యుత్తు తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉండగా గదుల సైజును పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

**వినియోగంలోకి రాకుండానే శిథిలం**

కరోనా లాక్‌డౌన్ సమయంలో నిరాశ్రయులైన వీధి వ్యాపారుల్లో మనోధైర్యం నింపడంతో పాటు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సుమారు రూ.70 లక్షల వ్యయంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో కియాస్కీలు నిర్మించారు. శివాజీనగర్ ప్రాంతంలో నగరపాలక వాణిజ్య భవన సముదాయం నిర్మాణం కోసం అక్కడ నుంచి ఖాళీ చేయించిన చిరువ్యాపారుల కోసం నగరపాలక కూరగాయల మార్కెట్కు ఇరువైపులా రేకుల షెడ్లు నిర్మించారు. వ్యాపారాలకు అనుగుణంగా లేవంటూ చిరువ్యాపారులు నిరాకరించడంతో వినియోగంలో లేక శిథిలమయ్యాయి. సుమారు అయిదేళ్ల కిందట వాటిని కూల్చివేశారు. సుమారు అయిదేళ్ల కిందట వీధి వ్యాపారుల కోసమంటూ మార్కెట్ ఆవరణలో నిర్మించిన కియాస్కీలు సైతం వినియోగంలో లేకపోవడంతో శిథిలమవుతున్నాయి. గోదావరి ఒడ్డున, గౌతమినగర్, ఎఫ్.సి.ఐ. అడ్డరోడ్డులో నిర్మాణాలు వినియోగంలోకి రాకుండానే శిథిలమవుతున్నాయి.

**ఆధునికీకరణకు ప్రణాళికలు**

నగరపాలక ప్రాంతంలో నిర్మించిన కియాస్కీలు వ్యాపారాలకు సరిపడేలా లేవని, కిల్లీ కొట్టు సైజులో ఉండటంతో వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. వీటిని పరిశీలించిన ఎమ్మెల్యే గదుల వెడల్పు పెంచుతూ వ్యాపారులకు అనుగుణంగా విద్యుత్తు సరఫరాతో పాటు వివిధ సదుపాయాలు కల్పించాలని నగరపాలక అధికారులను కోరారు. ఎమ్మెల్యే సూచనలు, వ్యాపారుల వినతుల మేరకు కియాస్కీల సైజులు పెంచుతూ సదుపాయాలు కల్పించి కేటాయించేలా నగరపాలిక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## భరోసా ఇవ్వని భవిత కేంద్రాలు



పెద్దపల్లి : మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులను అక్కున చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పే భవిత కేంద్రాల్లో అరకొర వసతులు ఆందోళన కలిగిస్తున్నాయి. వారిలో వ్యక్తిత్వ వికాసం నింపి.. అవయవాల ఎదుగుదలకు అవసరమైన సేవలు అందించటంలో నిర్లక్ష్యం నెలకొంది. ఫిజియోథెరపిస్ట్ పోస్టులు భర్తీ చేయటంలో విద్యాశాఖ తాత్సారం చేస్తోంది. ఫలితంగా దివ్యాంగ విద్యార్థులకు శాపంగా మారింది. ఏడు నెలలు గడుస్తున్న ఖాళీగా ఉండటంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.

**మూడు కేంద్రాల్లో మాత్రమే**

దివ్యాంగ పిల్లల ఆలన పాలన చూసుకుని వారిలో మార్పు తీసుకొచ్చేందుకు విద్యాశాఖ మండలానికి ఒక భవిత కేంద్రాన్ని నెలకొల్పింది. జిల్లాలో పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గ కేంద్రాల్లో తప్ప మిగిలిన మండలాల్లో సొంత భవనాలు లేవు. దీంతో సమీప పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నారు. పెద్దపల్లి భవిత కేంద్రం ఆవరణలో బస్ డిపో నిర్మిస్తుండటంతో వేరే చోట కేంద్రం కొనసాగుతోంది. మాటలు అర్థం చేసుకునే వారిని భవిత కేంద్రాలు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దనే ఫిజియోథెరపీ, ఆటపాటలతో విజ్ఞానం నేర్పిస్తున్నారు.

**ఏడు నెలలు దాటినా..**

భవిత కేంద్రాలతో పాటు పాఠశాలల్లో గుర్తించిన దివ్యాంగులకు విద్యతో పాటు సాధారణ స్థితిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వారానికి ఒకసారి పిల్లల వైకల్యం బట్టి అవయవాలు పనిచేసేందుకు ఫిజియోథెరపీ చేయాలి. ఇందుకు ప్రతి ఒక్క కేంద్రంలో ఒక ఫిజియోథెరపిస్ట్ ఉండాలి. పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత వారిని నియమించాలి. ఏడు నెలలు దాటిన నియామకంలో జాప్యం నెలకొంది. మూడు భవిత కేంద్రాల్లో 42, ప్రభుత్వ బడుల్లో 134 మంది దివ్యాంగులు చదువుకుంటున్నారు. చాలా మండలాల్లో సొంత భవనాలు లేకపోవడంతో పిల్లలను పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకాడుతున్నారు.

**వారానికి అయిదు రోజులు**

భవిత కేంద్రాలు వారానికి అయిదు రోజులు పని చేస్తాయి. కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.700, బాలురకు రూ.540 రవాణా భత్యం చెల్లిస్తున్నారు. విద్యార్థుల ఖాతాలో జమకానున్నాయి. ఇంటికే పరిమితమైన వారికి రవాణా భత్యం రాదు. దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహిస్తారు. వీరిలో వైకల్యం అధికంగా ఉన్న వారికి ఉపకరణాలు పంపిణీ చేస్తారు.

## ఖతం.. పదిశాతం..!



సూర్యాపేట : గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసే స్థిరాస్తి వెంచర్లలో పదిశాతం భూములు నిబంధనల ప్రకారం ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అలా కేటాయించిన పదిశాతం స్థలాలు కొన్నింటిలో పార్కులు ఏర్పాటు చేయగా.. మరికొన్ని చోట్ల కబ్జాలకు..ఇంకొన్ని చోట్ల దర్జాగా అమ్మేసుకున్నారు.

జాతీయ రహదారులకు అనుకుని ఉన్న పట్టణాల్లో, గ్రామాల్లో భూముల ధరలు పెరగడంతో పెద్ద ఎత్తున ఏర్పాటైన వెంచర్లలోని చాలా వరకు ఈ స్థలాలు కనిపించని దుస్థితి. ఇందుకు పలువురు రాజకీయ నాయకులు, పేరున్న పెద్ద వ్యక్తుల అండదండలున్నాయి. నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు, 1,782 గ్రామపంచాయతీలున్నాయి. ప్రధానంగా మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట, కోదాడ, చౌటుప్పల్, భువనగిరి తదితర ప్రధాన ప్రాంతాలు జాతీయ రహదారులకు సమీపంలో ఉండటంతో అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో దాదాపు 15 సంవత్సరాల క్రితం స్థిరాస్తి వ్యాపారులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వందలాది వెంచర్లకు డీటీసీపీ, పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతుల కోసం కాగితాల్లో చూపిస్తున్న పదిశాతం భూములు చాలా చోట్ల మాయమవుతున్నాయి. కొందరు వ్యాపారులు ఆ నిబంధనను ఉల్లంఘించి అక్కడి అధికారుల అండతో అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం.

**మచ్చుకు కొన్ని ఘటనలు ఇలా..**

కోదాడ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 144 వెంచర్లు ఉన్నాయి. ఇందులో 35 వెంచర్లలోని పదిశాతం స్థలాల్లో పుర అధికారులు పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. మిగిలిన వాటిలో దాదాపు 40 ఎకరాల వరకు ఉండాల్సిన స్థలంలో సగానికిపైగా ఆక్రమణకు గురైనట్లు సమాచారం.

మిర్యాలగూడ పట్టణంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పలు వెంచర్ల నిర్వాహకులు తమకు డీటీసీపీ అనుమతి ఉన్నట్లు.. పదిశాతం భూములు పురపాలికకు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తూ ప్లాట్ల అమ్మకాలు చేపట్టారు. పదిశాతం స్థలాన్ని కాగితాలకే పరిమితం చేసి డబ్బులకు ఆశపడి ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. భువనగిరి పట్టణంలోని మీనానగర్ ప్రాంతంలో ఈ స్థలం ఆక్రమణకు గురైనట్లు సమాచారం. గ్రామపంచాయతీల్లోని వెంచర్ల నుంచి వచ్చేది చాలా తక్కువే.

ఆక్రమణలు లేవుహన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట
పట్టణంలో 72 లేఅవుట్లు ఉన్నాయి. 70 వెంచర్లలోని పదిశాతం భూములు మున్సిపాలిటీ ఆధీనంలో ఉండగా.. మిగిలిన రెండింటికి సంబంధించి కోర్టు కేసుల్లో ఉన్నాయి.

## విత్తన పంట.. కన్నీరే రైతు ఇంట!

మెదక్ :విత్తనోత్పత్తి పంటలు సాగుచేసిన రైతులు ఆర్థికంగా నష్టపోయిన ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభం అవుతుండడంతో ఏజెంట్లు మండలాల్లో పర్యటిస్తూ వివిధ కంపెనీల పేర్లు చెప్పి మొక్కజొన్న, వరి విత్తనాలు అంటగట్టి సాగు చేయించేలా రైతులతో అనధికార ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే ఉత్పత్తులు చేతికి వచ్చాక, పలు కంపెనీలు వాటిని తీసుకునే సమయంలో ధర తగ్గించి రైతులను ముంచుతున్నాయి.

**నిబంధనలు ఇలా**

కంపెనీల మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం 2017లో ప్రత్యేక జీవో జారీచేసింది. ఆ ప్రకారం ప్రభుత్వ మద్దతు ధరకన్నా కంపెనీలు తక్కువకు కొనకూడదు. ఉత్పత్తులు తరలించిన మరుసటి రోజే రైతుల ఖాతాలో డబ్బులు జమచేయాలి.

విత్తనోత్పత్తి సాగుచేసే రైతులు వ్యవసాయాధికారుల సమక్షంలో కంపెనీలతో నిబంధనలకు అనుగుణంగా బాండ్‌పేపర్‌పై ఒప్పందం రాసుకోవాలని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ 'ఈనాడు'తో



చెప్పారు.**కొన్ని ఘటనలు**మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లిలో ఏటా 500 ఎకరాల నుంచి 800 ఎకరాల మేర వివిధ కంపెనీలకు చెందిన విత్తనోత్పత్తి వరి సాగు చేస్తున్నారు. గత యాసంగిలో సాగుచేసిన రైతులకు విత్తన కంపెనీలు డబ్బులు చెల్లించకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలయ్యారు.ప్రస్తుత వానాకాలంలో రుక్మాపూర్‌లో పేరొందిన కంపెనీకి చెందిన బ్రీడర్ మగ విత్తనాలను ఆర్గనైజర్ సాగు చేయించారు. దిగుబడులు రాకపోవడంతో, ఎకరాకు రూ.40 వేల పరిహారం చెల్లిస్తానని రైతులతో ఒప్పందం చేసుకున్నా, దిగుబడి తగ్గడంతో ఆర్గనైజర్ చేతులెత్తేశారు.కొల్చారం మండలం చిన్నఘనపూ ర్‌లో 300 ఎకరాల్లో ఓ కంపెనీ విత్తనోత్పత్తి వరి సాగు చేయించింది. ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మించారు. ఎనిమిదికి మించి రాలేదు.జిల్లాలో పదివేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

## పంచాయతీ బరిలో ఉంటున్నారా..

సిద్దిపేట : పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే అర్హతలు, నిబంధనలు తెలియక కొన్నిసార్లు ఇబ్బందులు ఎదుర్కోవడం సహజం. ఈ నేపథ్యంలో ఆయా వాటిపై అవగాహన కలిగి ఉంటే.. సులువుగా నామపత్రాలు సమర్పించవచ్చు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం - 2018ని అనుసరించి నిబంధనలు ఇలా..

**తెలుసుకోవాలి..**

21 సంవత్సరాలు నిండాలి.
సంబంధిత ఓటరు జాబితాలో ఓటరుగా నమోదై ఉండాలి.
ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారైతే కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.
నేర చరిత్ర, స్థిరాస్తులు, అప్పులు, కుటుంబీకుల ఆస్తులు, విద్యార్హత, ఇతరత్రా వివరాలతో కూడిన స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్)పై ఇద్దరు సాక్షుల సంతకం ఉండాలి.
వార్డు సభ్యుడిగా నిలబడే అభ్యర్థి.. తనకు సంబంధించిన వార్డు కాకుండా మరో వార్డు నుంచి పోటీ చేయాలనుకుంటే ప్రతిపాదకుడు సంబంధిత వార్డు ఓటరు అయి ఉండాలి.
రిజర్వేషన్లను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి.
అలా చేస్తే అనర్హులే.. ఒక అభ్యర్థి ఒక స్థానానికి నాలుగు నామినేషన్ పత్రాల వరకు దాఖలు చేయొచ్చు. ఒకటి కంటే ఎక్కువ స్థానాలకు పోటీ చేస్తే.. నిర్దేశిత గడువులోపు ఒకటి మినహా తక్కిన వాటిని ఉపసంహరించుకోవాలి. లేదంటే అన్నీ తిరస్కరణకు గురవుతాయి. పంచాయతీకి సంబంధించి కుళాయి, ఆస్తి, ఇతరత్రా బకాయిలు ఉండకూడదు. ప్రభుత్వ, పంచాయతీ ఉద్యోగులు, రుణాల ఎగవేతదారు అనర్హులే.కావాల్సినవి: ఫామ్-3 (నామినేషన్ పత్రం), స్వీయ ప్రకటన (అఫిడవిట్), ఎన్నికల వ్యయానికి సంబంధించిన డిక్లరేషన్ సహా డిపాజిట్ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను కొత్తగా తెరిచి వివరాలు సమర్పించాలి. ఓటరు, ఆధార్, కుల ధ్రువీకరణ ప్రతులు అవశ్యం.
డిపాజిట్ సొమ్ము: జనరల్ విభాగంలో సర్పంచి అభ్యర్థి అయితే రూ.2 వేలు, వార్డు సభ్యుడు - రూ.500 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులైతే.. ఆయా వాటిల్లో 50 శాతం రాయితీ ఉంటుంది. కులధ్రువీకరణ పత్రం తప్పనిసరి.
**నామపత్రంలో..**మొత్తం ఆరు భాగాలు ఉంటాయి. ప్రధానంగా పార్ట్-1లో ప్రతిపాదకుడి వివరాలు, సంతకం, పార్ట్-2 అభ్యర్థి డిక్లరేషన్, సంతకం, పార్ట్-3 అభ్యర్థి కుల ధ్రువీక్రరణ (గెజిటెడ్ అధికారి), సంతకం. పార్ట్ - 4, 5, 6 సంబంధించి ఆర్వో పూరించి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు.

## పైసలిచ్చుకో.. పట్టా చేసుకో!

మెదక్ : ప్రభుత్వం ధరణి స్థానంలో భూ-భారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చేసే విధానంలో స్వల్పమార్పులు తీసుకొచ్చింది. ముఖ్యంగా ప్రభుత్వ భూముల వివరాలను 22(ఎ)లో నమోదు చేసింది. ఇదే విధంగా పౌతీ(విరాసత్)లో మ్యుటేషన్ చేసే సమయంలో క్షేత్రస్థాయి పరిశీలనకు అవకాశం కల్పించింది. దీంతో పాటు ఇటీవల ప్రభుత్వ భూములను నమోదు చేసే నిషేధిత భూముల జాబితాను మరోసారి నవీకరించింది. వీటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని.. రిజిస్ట్రేషన్లు చేయరాదని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.అక్రమాలకు ఇవిగో సాక్ష్యాలుఈ ఏడాది జూన్‌లో చిలప్‌చెడ్‌లో కొన్ని సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను సీసీఎల్‌ఏ స్థాయిలో పైరవీలు చేసి నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీంతో భూ-భారతి పోర్టల్ ద్వారా స్లాట్ బుక్‌చేసి రిజిస్ట్రేషన్ చేశారని, పెద్దఎత్తున నగదు సైతం చేతులు మారిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారుల విచారణలో అక్రమాలు జరిగాయని నిర్ధారించినా రిజిస్ట్రేషన్లు మాత్రం రద్దు చేయకపోవడంపై విమర్శలొస్తున్నాయి.గతేడాది డిసెంబరులో మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి(పీటీ)లో సీలింగ్ భూములను రాజకీయాలకు అతీతంగా మూడు ప్రధాన పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు అధికారులను మచ్చిక చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీటిని నిషేధిత భూముల జాబితాలో నమోదు కాకుండా అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో నమోదు చేయలేదనే ఆరోపణలున్నాయి. తూప్రాన్‌లో ఉన్న సీలింగ్ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా పైరవీకారులు రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

# వారంలో విలీనం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీన వేగం పుంజుకుంది. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించిన ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ పాలకమండలి ఇప్పటికే ఆమోదించగా..ఇక 27 పట్టణ స్థానిక సంస్థ (యూఎల్ బీ)లను జీహెచ్ఎంసీలో విలీనానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు సర్కారు సిద్ధమవుతోంది. ఆ వెంటనే విలీనానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సమాంతరంగా.. బృహత్ నగరానికి హద్దుల నిర్ధారణ, విశాల నగరం ఎలా ఉండాలి, ఎన్ని డివిజన్లు, సర్కిళ్లు, జోన్లు, వాటి పరిధిలో అధికారాల విభజన వంటి అంశాలపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం సీజీజీ(సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కి అప్పగించింది.

**జనవరికి పూర్తవ్వాల్సిందే:** 2026 జనవరి 1 నుంచి 2027 జనాభా లెక్కలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతున్నందున.. ఆ లోపే విలీన ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. జనాభా





లెక్కల సర్వే మొదలయ్యాక.. నగర హద్దులను మార్చడం చట్టపరంగా కుదరదని, ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు అదే ప్రధాన కారణమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. డివిజన్ల పునర్విభజన కొంత ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

**శాస్త్రీయ అధ్యయనం..** బృహత్ నగరం పరిధి మొత్తాన్ని అధ్యయనం చేసి.. జనాభా, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల ఆధారంగా.. మార్గదర్శకాల రూపకల్పనకు సీజీజీ నివేదిక ఇవ్వనుందని చెబుతున్నారు.మరో 27 సర్కిళ్లు కలుస్తాయి.. ఆర్డినెన్స్ రాగానే జీహెచ్ఎంసీలో శివారు ప్రాంతాల విలీనం పూర్తవుతుంది. అప్పుడు.. కొత్తగా బల్దియాలో చేరిన 27 యూఎల్‌బీలను సర్కిళ్లుగా పేర్కొంటూ.. సమీపంలోని జీహెచ్ఎంసీ జోన్లలో భాగం చేస్తారు. అంటే.. ప్రస్తుతం ఉన్న 30 సర్కిళ్లకు మరో 27 సర్కిళ్లు కలుస్తాయి. అప్పుడు వాటి సంఖ్య 57కు పెరుగుతుంది. కొంత కాలం పాటు పరిపాలన అదే మాదిరి జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# పల్లె'పట్టు'కు.. జట్టుగా..!

నల్గొండ: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. పార్టీలపరంగా గుర్తులు లేకపోయినా సంస్థాగతంగా కీలకమైన ఎన్నికల్లో పట్టు సాధించాలంటే పంచాయతీ పాలకవర్గాలే ముఖ్యం కావడంతో ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బాధ్యులు, తమ పార్టీ బలపరిచిన వారితో నిలిపి గెలిపించుకునేందుకు సిద్ధం చేశారు. నేడు నామపత్రాల దాఖలు ప్రారంభం కానుండటంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంది. బీ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నేతలతో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహించి సమాలోచనలు చేశారు. సీఎం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచేలా



కార్యాచరణ రూపొందించారు. సాధ్యమైనంత వరకు ఏ ఒక్క పంచాయతీలోనూ పట్టు కోల్పోవద్దనే ఉద్దేశంతో అధికార పార్టీ అనుచరగణాలను రంగంలోకి దించింది. భారాస ప్రత్యేక వ్యూహంతో మేజర్ పంచాయతీల్లో తటస్థులను బరిలో దింపేందుకు సన్నాహాలు చేస్తుంది. మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, ఉద్యమకారులను కలిసి పల్లెల్లో బరిలో దిగాలని కోరుతుంది. భాజపా అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పల్లె సమరంలో గతంలో ఓడిపోయిన సర్పంచి అభ్యర్థులు, బలమైన నాయకులను కలిసి పోటీలో ఉండాలని సూచిస్తోంది.

ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న నేతలను సర్పంచి ఎన్నికల్లో బరిలో దింపేందుకు అన్నీ పార్టీలు పావులు కదుపుతున్నాయి.

# బోరు..జోరు


ఆలేరు : వానాకాలంలో వర్షాలు కాస్త ఆలస్యమైనప్పటికీ.. అనంతర కాలంలో సమృద్ధిగా కురవడంతో జిల్లా పరిధిలోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. భూగర్భ జలమట్టం పెరిగింది. దీంతో వట్టిపోయిన బావులు, బోరుబావులు జలకళను సంతరించుకున్నాయి. ఆలేరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆలేరు, గుండాల, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు మండలాల్లో 33 ఐబీ చెరువులు, 229 వరకు కుంటలున్నాయి. వీటిలో 75 శాతం చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. ఆయా చెరువులు, కుంటల కింద సుమారు ఎనిమిది వేల ఎకరాలు ఆయకట్టుగా ఉంది. ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణ సాగుకు మించి వరి సాగుచేయగా.. ఈ సారి ఆశాజనకంగా కురిసిన వర్షాలతో యాసింగిలోనూ సాధారణ విస్తీర్ణానికి మించి వరిపంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

**సాగు విస్తీర్ణం పెరుగుతుంది**

ఎస్.శ్రీనివాస్, ఏవో, ఆలేరు

ఈ సారి వర్షాలు ఆలస్యంగా మొదలైనప్పటికీ సమృద్ధిగా కురిశాయి. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరుచేరింది. వాగులు, వంకలు ప్రవహించడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. బోరుబావులు జీవం పోసుకుంటున్నాయి. యాసంగిలో సాధారణానికి మించి వరిపంట సాగయ్యే అవకాశముంది.

# ఫోన్ పోయినా.. సొమ్ము భద్రంగా



హైదరాబాద్: తారామతిపేటకు చెందిన రైతు ఇటీవల మార్కెట్‌కు వెళ్లాడు. అతని జేబులోని ఫోన్ కొట్టేసిన దొంగలు యూపీఐ యాప్ ద్వారా ఖాతాలోని రూ.4.26 లక్షలను బదిలీ చేసుకున్నారు. రైతు కొత్త ఫోన్ కొని సిమ్ కార్డు యాక్టివేట్ చేయించుకుని బ్యాంకు ఖాతాల్ని తనిఖీ చేయగా విషయం బయటపడింది.

సోమాజిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బస్సులో వెళ్తుండగా ఫోన్ చోరీకి గురైంది. సిమ్ బ్లాక్ చేయించేలోపు.. రూ.34 వేలు కొట్టేశారు. బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయించడంతో ఖాతాలోని మిగతా డబ్బును కాపాడుకోగలిగాడు.

ఈ రెండు ఉదంతాల్లో ఫోన్ పోగొట్టుకోవడం కంటే.. బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కొట్టేయడం బాధితుల్ని ఎక్కువ కలవరపెట్టింది. ఫోన్ పోయిన తర్వాత యజమానులు వాటి ఆచూకీ కోసం గంటల తరబడి వెతుకుతుంటే.. దొంగలు మాత్రం క్షణం ఆలస్యం చేయకుండా డబ్బంతా బదిలీ చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా రాజధానిలో ఈ తరహా కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాఫ్ట్‌వేర్ రాకతో కొట్టేసిన ఫోన్లను పోలీసులు రికవరీ చేస్తున్నా.. డబ్బు తిరిగిరావడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ఫోన్లు పోయినా, చోరీ అయినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా యూపీఐ యాప్‌లు, బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలని పోలీసులు సూచిస్తున్నారు.

**దొంగలు ఏం చేస్తున్నారు..?**

చాలామంది యూపీఐ పిన్/పాస్‌వర్డ్ తేలిగ్గా ఉండేవి.. ఫోన్ నంబరులోని తొలి అంకెల్ని పెట్టుకుంటున్నారు. ఇలాంటివి తేలిగ్గా గుర్తిస్తున్న దొంగలు డబ్బు బదిలీ చేసుకుంటున్నారు.

కొట్టేసిన ఫోన్‌లో బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైన సిమ్ ఉంటుంది. దీనిద్వారా కొత్త పిన్ క్రియేట్ చేస్తున్నారు. ఇదంతా గంట, అరగంటలోనే జరుగుతోంది.

**మనమేం చేయాలంటే..?**

ఫోన్ పోగొట్టుకుంటే ఆలస్యం చేయకుండా మొదట సిమ్‌కార్డు, యూపీఐ ఖాతాలకు లింకైనా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలి. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ చోరీ గురించి ఫిర్యాదు చేయాలి. దీనివల్ల సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుక్కోవచ్చు.

# డిగ్రీ విద్య.. అంతా మిథ్య!




హైదరాబాద్ : మహేశ్వరంలో ప్రభుత్వం నిర్మించిన డిగ్రీ కళాశాల ఇది. విద్యార్థులకు తరగతి గదులు, ప్రయోగశాలలు, అధ్యాపకులకు కలిపి కనీసం 20 గదులుండాలి. ఇక్కడ కేవలం నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. 280మంది విద్యార్థులకు అధ్యాపకులు ఇక్కడే చదువు చెబుతున్నారు. స్థలం సరిపోనప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గదుల్లో బోధిస్తున్నారు. నిధులు విడుదల లేకపోవడంతో.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. మూడు జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూకట్‌పల్లిలో కొత్త డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో జూనియర్ కళాశాలల్లో షిఫ్టు పద్ధతిలో డిగ్రీ, ఇంటర్ తరగతులు చెబుతున్నారు.

**వందల మంది విద్యార్థులు..**

ఎప్‌సెట్, నీట్ ప్రవేశ పరీక్షల్లో అనుకున్న ర్యాంకులు రాని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. ఏటా వందల మంది అడ్మిషన్లు తీసుకుంటున్నా సరిపడా అచార్యులు, అధ్యాపకులను ప్రభుత్వం నియమించడం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కళాశాలల్లో 38వేల మంది విద్యార్థులు ఉండగా, పాతబస్తీ సిటీ కళాశాలలో అత్యధికంగా 4500 మంది చదువుతున్నారు. రెండు, మూడేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన కళాశాలల్లో 200–400 మంది విద్యనభ్యసిస్తున్నారు.

**కొత్త కోర్సులున్నా.. ప్రయోగ పరికరాలు సున్నా**

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా డిగ్రీలోని సైన్స్ సబ్జెక్టుల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. భౌతిక, జీవ, రసాయన, గణితశాస్త్రాల్లో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలు చేర్చారు. తరగతులతో పాటు ప్రయోగశాలల్లో ఎక్కువగా విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు వీలుగా మూల్యాంకనాన్ని రూపొందించారు. పాఠాలు ఆచార్యులు, అధ్యాపకులు ఎలాగోలా చెప్పినా, ప్రయోగశాలల్లో సరైన పరికరాలు లేవు. న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రేటర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 24

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నవి 18

విద్యార్థుల సంఖ్య : 38,052

# ఆలయాల పరిహారం ఫలహారం



సిరిసిల్ల: వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణం ఇది. దీనికి 2017లో రూ.32.91 లక్షల పరిహారం మంజూరైంది. సంఘానికి నిధులు అందక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. జిల్లాలో మధ్యమానేరు జలాశయంలో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లించినా చాలా గ్రామాల్లోని ఆలయాల పరిహారం మాత్రం ఇప్పటికీ అందలేదు. కొన్నిచోట్ల పరిహారం లెక్కించి రెవెన్యూ డిపాజిట్ చేశారు. గ్రామ దేవతల విగ్రహాల తరలింపు, తాత్కాలిక ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో ఉత్సవాల నిర్వహణ పేరిట ఒక్కో గ్రామంలో ఫలహారంలా రూ.లక్షలు ఖర్చు చేశారు. నిర్మాణాలకు వచ్చే సరికి మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. జాయింట్ బ్యాంకు ఖాతాలోని నిధులను గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు కలిసి నిర్మాణాల ప్రారంభం పేరుతో డ్రా చేసుకున్నా లెక్కా పత్రం లేదు.


**ఖాళీ ప్లాట్లు కనుమరుగు**బోయినపల్లి, వేములవాడ అర్బన్, గ్రామీణం, తంగళ్లపల్లి మండలాల్లో తొమ్మిది ప్రాంతాల్లో ఆర్అండ్ఆర్ కాలనీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల వంటి సామాజిక భవనాలను మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వమే నిర్మించింది. ముంపు గ్రామాల్లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు ఉన్నాయి. ఇప్పటికీ చాలా వరకు వాటి పరిహారం లెక్కించ లేదు. గ్రామస్థులు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కనీసం స్థలాలైనా కేటాయించాలని కోరారు. ఆలయాలకు కేటాయించిన స్థలాలు సైతం ఆక్రమణకు గురయ్యాయి.

ప్రభుత్వం 2023లో ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకొనేలా ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇక అప్పటి నుంచి కాలనీలో ఖాళీ స్థలాల్లో అక్రమ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. దీనికి రెవెన్యూ అధికారుల సహకారం ఉందనే విమర్శలు ఉన్నాయి. అగ్రహారం పక్కనే ఉన్న చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఇతరులు పట్టాలు పొందారు. దీంతో వారు రూ.60 లక్షలు సొంత ఖర్చులు వెచ్చించి కాలనీ శివారులోని గుట్టపై ఆలయాన్ని ర్మించుకుంటున్నారు.

ఆలయాల కోసం కేటాయించిన స్థలాలను సైతం హద్దులు చెరిపేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీర్లవంచ, చింతల్‌ఠాణాల్లో గ్రామాల్లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు ఉన్నాయి. వాటికి ఇప్పటికీ అంచనాలు లేవు. పరిహారం అందించిన నిర్మాణాలు సైతం అసంపూర్తిగా ఉన్నాయి.

# గోస పడిన అమ్మను.. ధ్యాస పెడితే పట్టగొమ్మను


కరీంనగర్ :'ఏం జెప్పాలె.. ఎట్ల మొదలుపెట్టాలే'.. ప్రగతికి పట్టుగొమ్మ అన్న ఖ్యాతి నుంచి.. అధ్వానమనే దుస్థితికి కొన్ని నెలలుగా దిగజారిపోయా! 'ఊరూ.. పల్లెటూరు.. దీని తీరే అమ్మ తీరు' అని పాటలు పాడే ప్రజలే.. ఇదేం ఊరని బాధ పడుతుండటం చూసి నిత్యం చలించపోయా! నన్ను చూస్తేనే ఇది నేనేనా? అనే విధంగా నా రూపురేఖలు దయనీయంగా మారాయి. మురుగు కాలువలను సకాలంలో శుభ్రపర్చక.. పోగైన చెత్తాచెదారాన్ని తొలగించక.. దుర్వాసన అనుభవించా. 2024 జనవరి నెలాఖరుతో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో 22 నెలలుగా అనాథనయ్యాను. పేరకు ప్రత్యేక పాలన పెట్టినా.. నా ఆలనా పాలన చూసే నాథుడే కరవయ్యాడు. పాపం.. వాళ్లనని ఏం లాభం? ఒక్కో సారు.. మూడు, నాలుగు ఊళ్లను తిరగవట్టే! ఇగ మా బాగుకు వచ్చే నిధుల గోస.. కటకట మీకు తెలియంది కాదు! జనాభా ఆధారంగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయినయ్. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోత నా ప్రగతికి అవరోధంగానే మారింది. పైసా పైసాకు చాలా కష్టమొచ్చింది. కనీసం ఊడవడానికి చీపుర్లను కొనలేని కష్టకాలం కొన్నిసార్లు కనిపించింది. ఇగ త్వరలో ఎన్నికలన్న మాట విన్న ప్రతిసారీ నాకు ప్రాణమొచ్చినంత సంబురమయ్యేది. రిజర్వేషన్ల గోల.. కోర్టుల ముచ్చట్లు.. జనంలో ఎన్నికలనే మాటలు వినంగానే ఆశలు చిగురించేవి. మళ్లీ నన్ను పట్టించుకునేందుకు.. నా బాగు కోరుకునేందుకు



ఓ సర్పంచి వస్తాడనే భరోసా కలిగేది.. ఇలా ఎన్నాళ్లో వేచిన ఉదయమిదే అన్నట్లుగా మదన పడుతుండగా నా లోగిళ్లలో మళ్లీ ఓట్ల పండుగొచ్చింది. ఉమ్మడి జిల్లాలో కొత్త సర్పంచులు 1224 మంది, వార్డు సభ్యులు 11,195 మంది ఎన్నికవబోతున్నారు. ఈ సందర్భంగా నా బాగు కోసం పరితపించే నా బిడ్డలైన ప్రజలందరికీ ఒకే విన్నపం చేస్తున్నా. నాకు.. మీకు సేవ చేసే మంచి నాయకుడికి పట్టం కట్టండి.. పాలనలో మిమ్మల్ని మురిపించాలి. అభివృద్ధి విషయంలో నన్ను మెప్పించాలి. నా ఖ్యాతిని మరింతగా పెంచాలి. నా ఊరు.. నా ప్రజలు అని పరితపించే మంచి సేవకులను గెలిపిస్తారని ఆశిస్తున్నా . ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తయి.. వచ్చే అయిదేళ్ల పాటు నా బాగు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు మరింతగా కృషి చేస్తారని నమ్ముతూ..

# రిజర్వేషన్ టిక్కెట్‌లో తప్పుడు సమయం

కాచిగూడ: రిజర్వేషన్ టిక్కెట్‌లో బయలుదేరే సమయం తప్పుగా రావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వారు కాచిగూడ స్టేషన్‌కు వచ్చే లోపే రైలు వెళ్లిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పశ్చిమ రైల్వే రాజ్‌కోట్ డివిజన్ వారు ఓఖా–మధురై మధ్యన ప్రత్యేక రైలు నడుపుతున్నారు. వారంలో బుధవారం రోజు ఓఖా నుంచి మధురై వెళ్లే క్రమంలో ఉదయం 9.10 గంటలకు కాచిగూడకు వస్తుంది. 9.20 గంటలకు బయలుదేరి వెళుతుంది. ఈ రైలులో అరుణాచలం (తిరువణ్ణామలై), మధురైకి వెళ్లడానికి నగరానికి చెందిన 29 మంది ప్రయాణికులు ఈ నెల 1, 2, 3 తేదీల్లో




టిక్కెట్లను రిజర్వేషన్ చేయించుకున్నారు. టిక్కెట్‌లో రైలు బయలుదేరే సమయం మధ్యాహ్నం 12.10 అని తప్పుగా పడింది. ఈ సమయానికి ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చారు. ఈ రైలు 10.24 గంటలకు కాచిగూడకు వచ్చి 10.49 గంటలకు బయలుదేరి వెళ్లిపోయింది. ప్రయాణికులు నిరసన తెలపడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వారిని సాయంత్రం ప్రత్యేక ఆర్టీసీ బస్సులో నాంపల్లి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు (07230)లో 22 మందిని అరుణాచలం, మధురైకి పంపించారు. మిగిలిన ఏడుగురు తమ డబ్బులను తిరిగి తీసుకున్నారు.

# తెరపైకి తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు

మల్యాల: తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలను సమీపంలోని బడిలో విలీనం చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఆదర్శ పాఠశాలల మాదిరిగా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' పేరిట కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా విద్యాధికారుల అభిప్రాయం తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**1 నుంచి 12వ తరగతి వరకు..**విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలలను సమీప బడుల్లో విలీనం చేస్తే బోధన సులభతరమవుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఉపాధ్యాయుల కొరత కూడా తీరనుంది.

పది మంది లోపు ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులను సమీపంలోని పెద్ద పాఠశాలలో చేర్పిస్తారు. ఆ పాఠశాలను 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'గా మారుస్తారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో 1 నుంచి 12 వ తరగతి వరకు నిర్వహిస్తారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ సమకూరుస్తారు.యూడైస్ నివేదిక ప్రకారం జిల్లాలోని 53 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేరు. 60 బడుల్లో 10 మందిలోపు ఉన్నారు. 7 పాఠశాలల్లో 10 మంది చొప్పున ఉన్నారు.

సర్కారుపై తగ్గనున్న భారంప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 10లోపు ఉన్నా ప్రభుత్వం ఓ ఉపాధ్యాయుడిని, మధ్యాహ్న భోజన ఏజెన్సీని, ఏటా రూ.10 వేల పాఠశాల గ్రాంటును సమకూరుస్తోంది. ఒక స్కావెంజర్‌ను నియమించాల్సి ఉంటుంది. తక్కువ మంది ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులను సమీప బడిలో విలీనం చేస్తే ఈ ఖర్చులన్నీ తప్పుతాయి. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ముగ్గురు నుంచి అయిదుగురు విద్యార్థులే ఉన్నారు. వీరిని సమీపంలోని పెద్ద పాఠశాలకు పంపించడానికి రవాణా వసతి కల్పించేలా యోచిస్తున్నట్లు సమాచారం.**ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నారు. దీంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందనుంది. అమలులోకి వచ్చే అవకాశం ఉంది.

## నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850
ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20
యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు
చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీక్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# 'గెల'గలలా.. విలవిలలా!

అశ్వారావుపేట : ఆయిల్ ఫెడ్ ముందస్తు ప్రణాళిక లోపంతో వచ్చే ఏడాది మొక్కలకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. రాష్ట్రంలో 3 లక్షల పైచిలుకు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సగం తోటలు విస్తరించాయి. అగ్రభాగం భద్రాద్రి జిల్లాది. అందులోనూ అశ్వారావుపేట నియోజకవర్గం ముందు వరుసలో ఉంది. ఈ ఏడాది అత్యధికంగా అశ్వారావుపేటలో తోటల విస్తీర్ణం పెరగగా అంతేస్థాయిలో దమ్మపేట, ములకలపల్లి మండలాలున్నాయి. అశ్వారావుపేట కేంద్రీయ నర్సరీలో మొక్కలు నిండుకున్నాయి. రెండు నెలలుగా సిద్దిపేట, జనగాం, తొర్రూరు, మహబూబాబాద్, రంగనాయకసాగర్ నర్సరీల నుంచి తెప్పిస్తున్నారు. వచ్చే ఏడాది మరో లక్ష ఎకరాల్లో తోటలు విస్తరించాలని ఉద్యానశాఖ భావిస్తోంది. రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో 17 లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా, మరో 5 లక్షలు ప్రైవేటు కంపెనీల నర్సరీల్లో ఉన్నాయి. అవి చాలా వరకు ఏపీలోని రాయలసీమ జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో సుమారు 10 లక్షల మొక్కలు 40 నెలల పైబడి ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలినవి 2024లో విత్తినవి ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 17 లక్షల మొక్కలతో 29,825 ఎకరాల్లో తోటలు వేయొచ్చు. సిద్దిపేట, జనగాం నుంచి వచ్చినవి వచ్చినట్లే రైతులకు సరఫరా చేస్తున్నారు.

**ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో పెరిగిన డిమాండ్**

అటవీ హక్కుల పత్రాలు పొందిన పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు డిమాండు పెరిగింది. వీటిలో ఇందిర సౌరగిరి జల వికాస్ ఆధ్వర్యంలో బోర్లు, విద్యుత్తు మోటార్లు, విద్యుత్తు సౌకర్యం లేనిచోట సోలార్ విద్యుత్తుతో ఆయిల్‌పామ్ సాగు జోరందుకుంది. ఇప్పటికే



పోడు భూముల్లో బోర్లు విస్తృతంగా వేశారు. వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడంతో కొరత ఏర్పడింది. విత్తనాల కోసం కోస్టారికా, మలేషియా లాంటి దేశాలకు ఇండెంట్ పెట్టలేదని తెలిసింది.

**15 లక్షల మొక్కలకు ఇండెంట్ పెడతాం**

**జంగా రాఘవరెడ్డి, ఛైర్మన్, సుధాకరరెడ్డి, జీఎం**

రాష్ట్రంలో వచ్చే ఏడాది మొక్కల కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో 15 లక్షలకు విదేశాల నుంచి ఆర్డర్ పెట్టనున్నాం. పొట్టి రకాల మొక్కలకు పెట్టాలనుకోవడంతో కొంత ఆలస్యం అయింది. వచ్చే ఏడాది మొక్క అడిగిన ప్రతి రైతుకూ అందించేందుకు క్వారంటైన్ పరిశీలన అనంతరం ఆర్డర్ పెట్టనున్నాం. ముందుగా 15 లక్షలు, ఆ తరువాత మరో 10 లక్షల మొలకల కోసం ఆర్డర్ పెట్టనున్నాం.

# బతుకులు 'తారు'మారు



హైదరాబాద్ : నగరంలో గుంతలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. విపత్తులతో సమానంగా నష్టం మిగుల్చుతున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం.. ఆర్థిక, సామాజిక, పర్యావరణం పరంగా హైదరాబాద్ ఏడాదికి రూ.10వేల కోట్లు నష్టపోతోంది. ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు కూడళ్లలోనూ గోతులు ఏర్పడి ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. వాతావరణ, ధ్వని కాలుష్యం పెరుగుతోంది.

**గొయ్యి తీసి పాతేస్తున్నట్లుగా..**

గుంత పొడవు 2.5మీటర్లు, వెడల్పు 1.33మీటర్లు, లోతు 0.3మీటర్లు అనుకుంటే.. దాని విస్తీర్ణం క్యూబిక్ మీటరు. అలాంటి గుంతను పూడ్చేందుకు జీహెచ్ఎంసీ రూ.12,500 బిల్లు చెల్లిస్తుంది.

గుంతలో 140డిగ్రీల వేడితో ఉన్న తారు మిశ్రమంతో నింపాలి. దాన్ని గట్టిపరిచేందుకు రోలర్ తిప్పాలి.

రోడ్డు పొడవున, రెండు వైపులా 'సాసర్ డ్రెయిన్' నిర్మించాలి. కురిసిన ప్రతి చినుకూ ఎక్కడికక్కడ అంచులకు చేరి, సాసర్ డ్రెయిన్ ద్వారా దిగువకు వెళ్లాలి. రోడ్డుపై ప్రవహిస్తే నాణ్యత దెబ్బతిని గుంతలు ఏర్పడతాయి.నగరంలో తారు మిశ్రమం తయారు చేసే కేంద్రాలు రెండే ఉన్నాయి. అవి కూడా ఓపెన్ ఎయిర్ కేంద్రాలు. వర్షం వస్తే తారు మిశ్రమం తయారీ నిలిచిపోతుంది. ఇంజినీర్లు చల్లని తారుతో గుంతలు పూడ్చుతున్నారు. సహాయ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించట్లేదు.


**అపార నష్టాలు..**

ఒక్క గుంత పూడ్చడానికి బల్దియా చేసే ఖర్చు రూ.12,500
వర్షాకాలంలో ఏర్పడ్డ గుంతలు (అధికారికంగా) 20 వేలు
పూడ్చివేత ఖర్చు రూ.25 కోట్లు
గతేడాదిలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ ఖర్చు రూ.500 కోట్లు
నగరంలో తిరిగే వాహనాలు 60 లక్షలు
దెబ్బతిన్న వాహనాల మరమ్మతుల ఖర్చు రూ.50 కోట్లు
ట్రాఫిక్ సమస్యలతో అదనంగా ఖర్చయ్యే ఇంధనం రూ.100 కోట్లు
బాధితుల వైద్య ఖర్చు రూ.50 కోట్లు
ఐటీ, సరకు రవాణా నష్టం రూ.2 వేల కోట్లు

**రహదారులను తిరిగి నిర్మించాలి**

నగరాభివృద్ధిలో రోడ్ల పాత్ర ప్రధానమైనది. సర్కారు ఆ విషయంలో శ్రద్ధ చూపట్లేదు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి. నగరంలోని రోడ్ల కిందనున్న పొరలు బూడిదలా మారాయి. ఒక్కో రోడ్డును పూర్తిగా తవ్వేసి తారు, రసాయనాలు, కంకరతో తయారైన మిశ్రమాన్ని పునాదిగా మార్చాలి. సమాంతరంగా పైపులైన్లు, భూగర్భ మురుగునీరు, వరదనీటి వ్యవస్థను పటిష్టం చేయాలి. పైన నాణ్యమైన తారు మిశ్రమంతో రోడ్లను నిర్మించాలి.ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణుడు

# ఆధార్ పీవీసీ.. భద్రతలో మేటి




రాయికల్ : భారత విశిష్ట గుర్తింపు సంస్థ(యూఐడీఏఐ) జారీ చేసే ఆధార్ కార్డు ఇప్పుడు పీవీసీ రూపంలోనూ అందుబాటులో ఉంది. నామమాత్రం రుసుముతో లభించే దీన్ని అధికారిక వెబ్‌సైట్ లేదా ఎంఆధార్ యాప్ ద్వారా సులభంగా పొందవచ్చు.

**లాగిన్ విధానం**

మొదట అధికారిక వెబ్‌సైట్ %https:///myaadhaar.uidai.gov.in%/ / హోమ్‌పేజీలో మై ఆధార్ విభాగంపై క్లిక్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీతో లాగిన్ కావాలి. అనంతరం 'ఆర్డర్ పీవీసీ కార్డు' ఐచ్ఛికం ఎంచుకొని రూ.50 చెల్లిస్తే (యూపీఐ యాప్స్, నెట్ బ్యాంకింగ్, డెబిట్/ క్రెడిట్) 10-15 రోజుల్లో పోస్టు ద్వారా ఆధార్‌లోని చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టులో వస్తుంది.

**చరవాణికి అనుసంధానం కాకుంటే**

%https:///myaadhaar.uidai.gov.in%// అధికారిక వెబ్‌సైట్ హోమ్‌పేజీలో 'మై ఆధార్' విభాగం కింద ఉన్న ఆర్డర్ ఆధార్ పీవీసీ కార్డు ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి.

12 అంకెల ఆధార్ సంఖ్య లేదా 28 అంకెల ఎన్‌రోల్‌మెంట్ ఐడీ/ సర్వీస్ ఐడీని ఎంటర్ చేసి, సెక్యూరిటీ కోడ్/క్యాప్చా కోడ్ నమోదు చేయాలి.

'మై మొబైల్ నంబర్ నాట్ రిజిస్టర్డ్' ఐచ్ఛికం ఎంచుకొని ఇతర ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేసి, ఓటీపీని నమోదు చేయాలి. టర్మ్స్ అండ్ కండీషన్స్ అంగీకరించి 'సబ్మిట్' ఎంచుకొని రూ.50 చెల్లిస్తే పోస్టు ద్వారా ఆధార్‌లోని చిరునామాకు వస్తుంది.

యాప్ ద్వారా..యాప్‌లో ఆధార్ నంబర్‌తో లాగిన్ అనంతరం 'ఆర్డర్ పీవీసీ కార్డు' ఎంచుకొని టర్మ్స్ అండ్ కండీషన్స్ అంగీకరించి సబ్‌మిట్ చేయాలి. 12 అంకెల ఆధార్ సంఖ్య లేదా 28 అంకెల ఎన్‌రోల్‌మెంట్ ఐడీ/సర్వీస్ ఐడీని ఎంటర్ చేసి సెక్యూరిటీ కోడ్/క్యాప్చా కోడ్ నమోదు చేయాలి. అనంతరం మొబైల్ నంబర్(రిజిస్టర్డ్ లేదా అన్‌రిజిస్టర్డ్) నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. నమోదు చేసిన అనంతరం మేక్ పేమెంట్‌ను ఎంచుకొని రూ.50 చెల్లిస్తే ఆధార్‌లోని చిరునామాకు వస్తుంది.ఈ మూడు విధానాల్లో చెల్లింపు విజయవంతమైన అనంతరం ఎస్ఆర్ఎన్(సర్వీస్ రిక్వెస్ట్ నంబర్)తో కూడిన రసీదు వస్తుంది. దాన్ని కార్డు డెలివరీ స్థితిని ట్రాక్ చేయడానికి ఉపయోగించవచ్చు.

**ఇవీ ప్రయోజనాలు**

ఆధార్ పీవీసీ పేపర్ కార్డు కంటే ఎక్కువ కాలం మన్నుతుంది. నీరు, దుమ్ము వల్ల పాడవదు. మడతలు పడదు.ఏటీఎం కార్డు పరిమాణంలో ఉండటంతో పర్సులో పెట్టుకునే వీలుంటుంది.దీనిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఫొటో, డేటా, సెక్యూర్ ఎలిమెంట్స్ కనిపిస్తాయి. బ్యాంకులు, విమానాశ్రయం, ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తింపు కార్డులా వినియోగించవచ్చు. హోలోగ్రామ్, ఘోస్ట్ ఇమేజ్, మైక్రో టెక్స్ట్ వంటి భద్రతా అంశాలున్నాయి.

## తేమ తగ్గితే బంగారమే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 78.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు 41 జిన్నింగు మిల్లులను ఎంపిక చేశారు. నుంచి తెల్ల బంగారం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులే సీసీఐకి విక్రయించాలి. యాప్ గురించి పత్తి రైతులకు రైతువేదికల్లో ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

తేమను బట్టి ధర: 8శాతం కాకుండా 9, 10, 11, 12శాతం తేమ ఉంటే సీసీఐ నిర్ణయించిన పింజ రకాలు, పొడవునుబట్టి ధర తగ్గుతూ వస్తుంది.పింజపొడవు (గింజ నుంచి పత్తిని వేరు చేసినప్పుడు వచ్చే



దూది పొడవు)

మైక్రోనీర్ (గింజ నుంచి లాగినప్పుడు కనిపించే పత్తి సాంద్రత)

ప్రభుత్వం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. సందేహాలున్న రైతులు 1800 599 5779 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

జిల్లాలో 9 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీ, చండూరు బాలాజీ కాటన్ ఇండస్ట్రీ, చిట్యాల వరలక్ష్మి కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్-ఏ శ్రీలక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీ, మాల్-బి శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-ఏ శివ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-బి తిరుమల కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్, నకిరేకల్ శ్రీనాథ్ కాటన్ ఫైబర్, శాలిగౌరారం టీఆర్ఆర్ కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుపుతారు.

**నాణ్యమైన సరకుకే 'మద్దతు'**

ఈ ఏడాది పత్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ప్రకటించింది. ఈ ధరను దక్కించుకోవాలంటే రైతులు నిబంధనలకు లోబడి సరకు తీసుకురావాలి. తేమశాతం 8 నుంచి 12 మధ్య ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఆపైన ఉంటే తిరస్కరిస్తారు. ఇప్పటికే వర్షాలతో నష్టాలు ఎదుర్కొని, అధిక పెట్టుబడి పెట్టిన పత్తి రైతులు దళారులను ఆశ్రయించకుండా నిబంధనల ప్రకారం తేమ ఉండేలా చూసుకుని స్లాట్ బుకింగ్ చేసుకుని విక్రయించాలి. అప్పుడే కోరుకున్న మద్దతు ధర దక్కుతుంది.

## పోషకాల డబ్బా.. అదిరిందబ్బా

మిర్యాలగూడ : నాలుగైదు రకాల పండ్ల ముక్కలు, గుప్పెడు ఉడికించిన శనగలు, నాలుగు జీడి పప్పులు, ఖర్జూర, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటివి ఉదయం, సాయంత్రం వేళలో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నిత్యం వాటిని సమకూర్చుకోవడం అందరికీ కుదరకపోవచ్చు. అయితే ఇటీవల పలువురు యువత పండ్ల ముక్కల డబ్బాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఆరోగ్యం.. యువతకు ఉపాధి లభిస్తున్నాయి. గతంలో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడిప్పుడే నల్గొండ, మిర్యాలగూడ వంటి పట్టణాలకు సైతం విస్తరిస్తుంది.

డబ్బాల్లో దానిమ్మ, జామ, యాపిల్, పైనాపిల్, బొప్పాయి, పుచ్చ వంటి పండ్ల ముక్కలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, కీర దోస ముక్కలు, రాజ్మా, శనగలు వంటి ఉడికించిన గింజలు, పెసర్లు, అలసందలు వంటి మొలకెత్తిన గింజలు, ఖర్జూర, జీడిపప్పు, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు.

**సామాజిక మాధ్యమాల్లో ప్రచారం**

పండ్ల ముక్కల డబ్బాల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాలు, వాట్సప్ గ్రూపులతో పాటు.. ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ట్విటర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగిస్తున్నారు. కొందరు పండ్లను కడగడం నుంచి కోయడం, ప్యాకింగ్ చేయడం వంటి అన్ని పనులను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు.

**బాక్సులు ఇలా..**ప్రస్తుతం జిల్లాలో లభిస్తున్న బాక్సుల్లో నాలుగు రకాల పండ్ల ముక్కలు, రెండు రకాల కూరగాయల ముక్కలు, ఒక రకం మొలకలు కలిపి రూ.2వేలకు విక్రయిస్తుండగా.. కపుల్ బాక్సును రూ.3,500కు విక్రయిస్తున్నారు. వీటితో పాటు మరో మూడు రకాల డ్రైఫ్రూట్స్ కూడా కలిపి గోల్డ్ బాక్స్ పేరుతో రూ.2,400, దీంట్లోనే కపుల్ బాక్స్‌ను రూ.4వేలకు విక్రయిస్తున్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం డిన్నర్ లాగా సరఫరా చేస్తుండగా..ఎక్కువ మంది ఉదయమే వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**20తో మొదలు...**

నేను తొలుత ఈ ఏడాది జనవరిలో ఫ్రెష్ బైట్స్ ఫ్రూట్ బాక్స్ పేరిట పండ్ల ముక్కల పంపిణీని ప్రారంభించాను. అంతకు ముందు నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల తొలి రోజు 20 బాక్సుల ఆర్డర్‌తో మొదలు పెట్టాను. మధ్యలో వందకు పైగా చేరినప్పటికీ..ప్రస్తుతం 85 వరకు అందిస్తున్నాం.పగిళ్ల కల్యాణ్, మిర్యాలగూడ

## ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు..!

నల్గొండ : పురపాలికల్లో పాలిథిన్ నిషేధం ప్రచారానికే పరిమితం అయింది. అటవీ, పర్యావరణ పరిరక్షణ చట్టం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వుల ప్రకారం 50 మైక్రాన్లు మందం కంటే తక్కువ ఉన్న పాలిథిన్ సంచులను వాడకూడదు. తెలుపు రంగు తప్ప నలుపు, నీలం, ఇతర రంగులను వాడేందుకు వీలు లేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పురపాలికల్లో కమిషనర్లు పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే నిల్వలను సీజ్ చేయాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్‌ను తగ్గించాలని చెబుతున్నా ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలిథిన్ వస్తువుల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికలు, మండల కేంద్రాల్లో నిర్దిష్ట ప్రమాణాలు లేని ప్లాస్టిక్ నిషేధం కథ మొదటికొచ్చింది. 19 పురపాలిక పరిధిలో నిత్యం 320 టన్నులకు పైగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 30 శాతానికి పైగా పాలిథిన్ సంచులు, గ్లాసులు, బాటిల్స్ పోగవుతున్నాయి. గత ఏడాది నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ పట్టణాల్లో పాలిథిన్ సంచులు వాడే దుకాణాలను సీజ్ చేసి రూ.3 లక్షలకు పైగా జరిమానా విధించారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నియంత్రణ కరవైంది. తనిఖీలు, జరిమానా విధించే అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సూర్యాపేట, నల్గొండ పురపాలికల్లో నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. మిగతా 17 చోట్ల తనిఖీల జోలికి అధికారులు వెళ్లడం లేదు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాల నుంచి ప్రధాన పట్టణాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు.అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం

పాలిథిన్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. వ్యాపారులుపై ఇటీవల రూ.50వేలకు పైగా జరిమానాలు విధించి వసూలు చేశాం. మరిన్ని దాడులు చేస్తూ పాలిథిన్ వాడకం, విక్రయాలపై నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

చురకలు




# ‘హద్దు’ల్లేని అతిక్రమణ!!

విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఎన్‌హెచ్(జాతీయ రహదారి)ని ఆనుకుని ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతున్నాయి. జాతీయ రహదారిలో భవిష్యత్ అవసరాలకు గుర్తించిన స్థలాల్లో ఏకంగా ప్లాన్ అనుమతులు ఇచ్చేస్తున్నారు. కాసులకు కక్కుర్తితో అధికారులు కుమ్మక్కయ్యారు. భవిష్యత్‌లో స్థలంతోపాటు, భవనాలకు పరిహారం అదనంగా చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భవిష్యత్తులో విస్తరణకు**

నగరంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్–16)కి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉన్నాయి. వీటిని ఆనుకుని ప్రధాన కాల్వలున్నాయి. ఈ కాల్వ పక్కనే ఎన్‌హెచ్‌కు చెందిన స్థలాల వద్ద హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. వీటి తర్వాత సుమారు 50 అడుగుల మేర భవిష్యత్‌లో రహదారి విస్తరణ కోసం గుర్తించారు. ఆ స్థలాలు జిరాయితీ, పట్టా అయినా భవన నిర్మాణాలకు జీవీఎంసీ ప్లాన్ అనుమతులు ఇవ్వకూడదు. తాత్కాలిక షెడ్లు సైతం ఏర్పాటు చేయకూడదు. ఇలాంటి పరిస్థితి పీఎంపాలెం, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది.

**అంతా ఇష్టారాజ్యమే:** నిబంధనలను కొందరు అపార్ట్‌మెంట్ల బిల్డర్లు, భవన యజమానులు పాటించడం లేదు. ఎన్‌హెచ్ భవిష్యత్ విస్తరణకు గుర్తించిన స్థలం వదిలి నిర్మాణాలు సాగించాల్సి ఉన్నా పట్టించుకోవడం



లేదు. 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో జాతీయ రహదారి విస్తరణకు గుర్తించిన స్థలంలో ఓ వ్యక్తి ఏకంగా మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. కారుషెడ్డు నుంచి శిల్పారామం మధ్యలో భారీ షెడ్లు వేసి వాణిజ్య సముదాయాలు అనుమతుల్లేకుండా నిర్మించి అద్దెలకిస్తున్నారు. **వారే కీలకంగా వ్యవహరిస్తూ:** పట్టణప్రణాళిక కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా భవన నిర్మాణాలకు ఆన్‌లైన్లో ప్లాన్ దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇక్కడే జీవీఎంసీ నుంచి లైసెన్సు పొందిన లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీలు) కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఎల్‌టీపీలు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కుమ్మక్కై చక్రం తిప్పుతున్నారు. ఆన్‌లైన్లో ఎల్‌టీపీ ఇచ్చిన అఫిడవిట్ ఆధారంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ‘ఎన్‌హెచ్‌ని ఆనుకుని జరుగుతున్న నిర్మాణాలపై కొన్ని ఫిర్యాదులొచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం’ అని జోన్–2 పట్టణ ప్రణాళికావిభాగం డీసీపీ హరిదాస్ పేర్కొన్నారు.

# జలకాలాటలో జరభద్రం

నక్కపల్లి : అలల హోరు, జలపాతాల సవ్వడులు, నదీ ప్రవాహాలు ఇవన్నీ యువతను ఆకర్షించేవే. ఈ సందడిలో యువత అత్యుత్సాహం చూపుతూ ప్రమాదాలను గుర్తించలేక మృత్యువును కొని తెచ్చుకుంటున్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లో తీరని వేదన మిగుల్చుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే వివిధ నీటి ప్రమాదాల్లో 11 మంది మృత్యువాత పడ్డారు. వీరంతా యువకులే. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన ప్రమాదాల్లోనే అయిదుగురు ఉన్నారు. జిల్లాలోని నదీ, సముద్రతీర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఏటా పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. నిన్నటి వరకు కార్తికమాసం సందడి, ఇప్పుడు శీతాకాలం విహారం పేరిట నదులు, జలాశయాలు, సముద్రతీర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో స్నానాలు చేస్తున్నప్పుడో.. సెల్ఫీలు దిగుతున్నప్పుడో నీట మునిగిపోతున్నారు. ఆనందాన్ని తీయని జ్ఞాపకంగా మిగుల్చుకోడానికి బదులు తీరని విషాదంగా మార్చుకుంటున్నారు.

ఏడాది కాలంలో దాదాపు 30 మంది వరకు బీచ్ ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. వరహా, శారదా తదితర నదుల్లో మునిగి మరో 20 మంది వరకు మరణించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సముద్ర తీరాల్లో పోలీసులు గస్తీ ఉంటున్నా, మత్స్యకారులు హెచ్చరిస్తున్నా వాటిని యువత పట్టించుకోవడం లేదు.

ప్రధానంగా తీరంలో అలలు తిరిగి వెళ్లే క్రమంలో అలల ఉద్ధృతి పెరిగి రిప్ కరెంట్ ఏర్పడుతుంది. ఇందులో చిక్కుకుంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే నదుల్లో ఇసుక తవ్వకాలు జరిగి గుంతలు ఉంటాయి. జలాశయాల్లో ఒడ్డు నాచు పట్టి ఉంటుంది. ఇలాంటి చోట్ల లోనికి దిగకపోవడమే మంచిది.

**ప్రమాదమని తెలిసీ...**

జిల్లాలో రేవుపోలవరం, తంతడి, వాడపాలెం, సీతపాలెం, తిక్కవానిపాలెం, పెంటకోట, పాల్మన్‌పేట, రాజానగరం సముద్రతీరాలు ఆహ్లాదంగా ఉండటంతో ఎక్కువ పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడి ప్రమాదకర ప్రాంతాలున్నాయని విషయం తెలిసినా పెడచెవిన పెట్టి నిర్లక్ష్యంగా ఉంటూ ప్రాణాలను కోల్పోతున్నారు.

ఇక్కడి తీరాల్లో రాళ్లు ఉండటంతో కొందరు గాయపడి మరణిస్తుండగా, ఒడ్డునే లోతుగా ఉండటంతో అలల తాకిడిలో చిక్కుకుని మరికొందరు మృతి చెందుతున్నారు.

**శాశ్వత హెచ్చరిక బోర్డులు**

పిక్నిక్‌కు వెళ్లినచోట స్నానం చేయాలనుకోవడం సహజం. అక్కడి పరిస్థితులను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకుని ముందుకు వెళ్లడం మంచిది. ప్రధానంగా యువత ఇలాంటి చోట్ల మద్యం తాగి స్నానానికి దిగుతారు. ఇద్దే ముప్పు అని గుర్తించాలి. వీరు ఇంట్లో వారికోసం ఓ క్షణం ఆలోచించాలి. తమ పిల్లలు బయటకు వెళుతుంటే తల్లిదండ్రులు మంచి, చెడు చెప్పాలి. ప్రమాదకర ప్రాంతాల్లో శాశ్వత హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నాం. వారాంతాల్లో మా సిబ్బందితోపాటు మెరైన్ ఉద్యోగులు పహారా ఉంటున్నారు. దీంతోపాటు మైకు ద్వారా హెచ్చరికలు, డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేయిస్తాం.

పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

# సిరులొలికించే.. చిరుధాన్యాలు



తిరుపతి: కరోనా తర్వాత కాలంలో ఎక్కువ మంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. దీంతో జిల్లాలో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. రాగి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, సామలు మొదలైన వాటితో తయారయ్యే ఉత్పత్తులను తింటున్నారు. పోషక విలువలు ఎక్కువ, ఖర్చు తక్కువ కావడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు. కానీ అధిక ఆదాయం ఇచ్చే కొర్ర సాగుపై అవగాహన లేక పూర్తిస్థాయిలో పండించలేకపోతున్నారు.

**తక్కువ ఖర్చుతో సాగు..**

వరి, గోధుమలతో పోలిస్తే కొర్రలకు నీటి అవసరం చాలా తక్కువ. తెగుళ్లు, చీడపీడలను సహజంగా తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో రసాయన మందుల వినియోగాన్ని విస్మరించొచ్చు.

3, 4 వర్షాలకు మూడు నెలల్లోనే పంట కాలం పూర్తవుతుంది. జీవామృతం వినియోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చు.

వరితో పోలిస్తే కొర్రలు, ఇతర చిరుధాన్యాల్లో మాంసకృత్తులు, పీచు పదార్థాలు, కాల్షియం, ఇనుము, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి.

సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

కొర్ర: 1.9

సామ: 0.3

సజ్జ: 2251.2

మొక్కజొన్న: 68.4

జొన్న: 1.2

రాగులు: 1.6

జిల్లాలో వివరాలు..

పంటలు:చిరుధాన్యాలు

సాగు చేస్తున్నది: 2,500 మంది

విస్తీర్ణం: 3,200 హెక్టార్లకు పైగా

విక్రయశాలలు: 25 పైగా

రూ.12కే ప్రాసెసింగ్

తిరుపతిలోని ఎస్వీ ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానంలో రైతులు తీసుకొచ్చిన ముడి సరకును ప్రాసెస్ చేస్తారు. కిలోకు కేవలం రూ.12 మాత్రమే తీసుకుంటున్నారు. నాలుగు రకాల యంత్రాలతో వడపట్టి అందజేస్తారు. ఏటా ఇక్కడ మూడు నుంచి 5 వేల కిలోల పంట ప్రాసెస్ జరుగుతుంది.

**ప్రభుత్వం నుంచి సహకారం..: ఎస్.ప్రసాదరావు, జేడీ, తిరుపతి**

మిల్లెట్లను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఇవి ఆరోగ్యానికి మంచివి. వీటిని తక్కువ నీటితో పండించొచ్చు. సాగుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుంది. నూతనంగా సాగు చేయాలనుకునే రైతులు ఆయా మండలాల్లోని వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

# చేసే‘దంత’ మొక్కుబడి వైద్యం



నంద్యాల : పంటి నొప్పితో బాధపడుతూ కోడుమూరుకు చెందిన వెంకటేష్ స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడ సేవలందించే వారు లేకపోవడంతో కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. ఎక్స్‌రే తీసి పన్ను తొలగించినందుకు రూ.1,200 తీసుకున్నారు. మరోటి దెబ్బతిందని.. దానికి రూట్ కెనాల్ చేసేందుకు రూ.3 వేలు ఖర్చవుతుందన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసే‘దంత’ మొక్కుబడి వైద్యమే. చాలాచోట్ల డెంటల్ ఛైర్లు లేవు.. పుచ్చువంటి సమస్యలు, సిమెంట్ వేయడం, స్కేలింగ్ లాంటి సేవలు అందించాల్సి ఉన్నా రకరకాల కారణాలు చెప్పి బాధితులను వెనక్కి పంపిస్తున్నారు. దీనికితోడు డా.ఎన్టీఆర్ వైద్యసేవల కింద పంటి వైద్యం లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రాథమికస్థాయిలో వదిలేశారు

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) ఉంటున్న దంత వైద్యులు వారంలో మూడు రోజులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) వెళ్లి సేవలందించాలని ఉత్తర్వులున్నాయి. అక్కడ యంత్రాలు లేకపోవడాన్ని సాకుగా చెప్పి వెళ్లడం లేదు.

సీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు మూడు రోజులు పీహెచ్‌సీలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి, పాఠశాల స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలకు హాజరవ్వాలి. ఇవి సరిగా కొనసాగడం లేదు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందించాలి. ఒప్పంద ప్రాతిపదికన దంత వైద్యులను నియమించుకోవాలని ఉత్తర్వులు ఉన్నాయి. ఇందుకు కేంద్రమే నిధులు అందిస్తున్నా అదనపు సిబ్బందిని నియమించడం లేదు. ఉన్నవారినే అటూఇటూ తిప్పుతున్నారు.

**సర్వజన.. మెరుగైన సేవలు కలేనా**

కర్నూలు సర్వజన వైద్యశాలలోని దంతవైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు టెక్నీషియన్లు పనిచేస్తున్నారు.

ఓపీకి నిత్యం 40 మంది వరకు వస్తారు. నెలకు సగటున 1,200 మందికిపైగా వస్తున్నారు. ఇక్కడ పుచ్చిన పళ్లను తొలగించడం.. ఇన్‌ఫెక్షన్ వస్తే మందులివ్వడం.. దెబ్బతిన్న పంటికి సిమెంట్ పెట్టడం వరకే పరిమితమవుతున్నారు.

రూట్ కెనాల్, పళ్లు కట్టడం, పంటికి సంబంధించిన శస్త్రచికిత్సలు చేయడం లేదు. ఇక్కడ ఎక్స్‌రే మాత్రమే ఉంది. ప్రత్యేకంగా ల్యాబ్ లేకపోవడంతో వైద్యులున్నా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేని పరిస్థితి.

**సీహెచ్‌సీలు నామమాత్రమే**

ఉమ్మడి జిల్లాలో 18 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అక్కడ దంత వైద్యులున్నా.. పరికరాల కొరత వేధిస్తోంది. శస్త్రచికిత్స చేయాలన్నా, రోగిని పరీక్షించాలన్నా ఎక్స్–రే ప్రధానం. చాలాచోట్ల డెంటల్ ఎక్స్–రే యంత్రం, సహాయకులు లేక సేవలు అందడం లేదు. పంటి సమస్యలతో వచ్చిన వారికి మందులు రాసిచ్చి సర్వజన వైద్యశాలకు పంపిస్తున్నారు. రూట్ కెనాల్ వంటి సేవలు అందించాలంటే పది రకాల వైద్య పరికరాలు కావాలి. వీటికి సంబంధించి ప్రతిపాదన పంపితే సగమే ఇస్తున్నారు. మిగిలిన వాటికి టెండర్ పిలవాలంటే మూడు నెలలు పడుతోంది. పూర్తి సామగ్రి వచ్చే లోపు మొదట్లో వచ్చిన వైద్య సామగ్రి గడువు తీరిపోతుంది. కొత్తగా పళ్లు బిగించడానికి జిల్లా వ్యాప్తంగా ఒక ఏజెన్సీ మాట్లాడుకుని తెప్పించుకొనే వెసులుబాటు ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు.

# ఖాతాకు చేరని ఖనిజ నిధి

నంద్యాల: ఉమ్మడి జిల్లాలో గనులు, క్వారీల సీనరేజీ రుసుము ప్రభుత్వ ఖాతాకు చేరడం లేదు. నంద్యాల జిల్లాలో 250, కర్నూలులో 150 వరకు లీజులున్నాయి. వీటి నుంచి పన్ను వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఆగస్టులో ఒప్పందం కుదరగా గత రెండు నెలలుగా వసూళ్లు ప్రారంభించింది. నిబంధనల మేరకు సీనరేజీ ఛార్జీల్లో 30 శాతం డీఎంఎఫ్‌గా చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని గనుల శాఖ కార్యాలయానికి నేరుగా పంపాల్సి ఉండగా.. గుత్తేదారు సంస్థ జమ చేయడం లేదు.

**గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యం**

డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లి డివిజన్ పరిధిలోని బనగానపల్లి, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, పాణ్యం, గడివేముల, ఆళ్లగడ్డ, మహానంది, కృష్ణగిరి, ఓర్వకల్లు, వెల్దుర్తి, దేవనకొండ, సి.బెళగల్, గూడూరు మండలాల్లో గనులు, క్వారీలు ఉన్నాయి.

ఒప్పందం ప్రకారం గుత్తేదారు సంస్థ ప్రతి నెలా రూ.14 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇందులో రూ.10.50 కోట్ల రుసుము, రూ.3 కోట్లు డీఎంఎఫ్ (జిల్లా మైనింగ్ ఫండ్), రూ.50 లక్షల వరకు ఆదాయపు పన్ను కట్టాల్సి ఉంది.

డీఎంఎఫ్ కింద ఉమ్మడి జిల్లాకు ప్రతి నెలా వసూలయ్యే రూ.3 కోట్లలో అధిక భాగం నంద్యాల జిల్లా నుంచే వస్తోంది. ప్రభుత్వ ఖాతాకు ప్రతి నెలా తప్పనిసరిగా డీఎంఎఫ్ జమ కావాల్సి ఉంది. ఒప్పందం చేసుకుని రెండు నెలలు దాటినా ఈ నిధులు జమవడం లేదు.

**పల్లె ప్రగతిపై ప్రభావం**

నంద్యాల జిల్లాలో 19 సిమెంట్ గ్రేడ్ మైనింగ్ లీజులు, 66 నాపరాయి లీజులు, ఆరు రోడ్ మెటల్ క్వారీ లీజులు ఉన్నాయి. ఒక్క బనగానపల్లి డివిజన్ కార్యాలయ పరిధిలోనే పెద్ద తరహా ఖనిజాలకు సంబంధించిన 82 మైనింగ్ లీజులు, చిన్న తరహా ఖనిజాలకు సంబంధించిన 199 క్వారీ లీజులున్నాయి.



ఏటా డీఎంఎఫ్ రూపంలో లభించే రూ.36 కోట్లను గనుల ప్రభావిత గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు మౌలిక వసతుల కల్పనకు వెచ్చించాల్సి ఉంది.

బనగానపల్లి నియోజకవర్గంలోని పలుకూరు, రామకృష్ణాపురం, చెర్వుపల్లి, బీరవోలు, రామతీర్థం, అవుకు మండలం రామాపురం, చెర్లోపల్లి, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె, బెలుం తదితర గ్రామాల నుంచి గతంలో పెద్దఎత్తున డీఎంఎఫ్ ఖాతాల్లో నిధులు జమయ్యేవి. ప్రస్తుతం ప్రైవేటు ఏజెన్సీకి వసూళ్ల బాధ్యత అప్పగించడంతో వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

# కొండ తవ్వేయ్.. అడిగరు అమ్మేయ్!

అనకాపల్లి : అచ్యుతాపురం మండలంలోని మల్లవరం పరిసర ప్రాంతాలపై పట్టున్ననేత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని సద్వినియోగం చేసుకుని రెండుచేతులా సంపాదించాడు. కూటమి ప్రభుత్వంలో తన ఆగడాలు సాగకపోవడంతో కొన్నాళ్ల క్రితం జనసేనలో చేరిపోయాడు. ఇప్పుడు తన అనుచరులతో మునగపాక మండలంలోని ఓ కొండపోరంబోకు లేఅవుట్‌గా మార్చేశాడు.

మునగపాక మండలంలోని సర్వే నం. 19లో దాదాపు ఎకరా వరకు కొండపోరంబోకు స్థలం ఉంది. ఇదంతా వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూమి. ఇక్కడ సెంటు స్థలం రూ. 1.8 లక్షల వరకు పలుకుతుంది. కొండవాలు ప్రాంతం అధికంగా ఉండటంతో కొందరి అక్రమార్కుల కన్ను ఈ భూమిపై పడింది. ఈ స్థలానికి ఆనుకుని సర్వే నం. 17లో కొంత మంది రైతులకు జిరాయితీ భూములున్నాయి. వీటిలో కొండపోరంబోకు స్థలాన్ని కలిపి అమ్మేస్తున్నారు. ఇటీవల



ప్రభుత్వ స్థలంలో చెట్లు కొట్టించి.. చిన్నచిన్న ప్లాట్లుగా మార్చి రాళ్లతో హద్దులు నిర్ణయించి బేరానికి పెట్టేశారు.

**భూములకు పెరిగిన విలువ**

అచ్యుతాపురం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వలసొచ్చిన వారు అధికశాతం మంది మునగపాక పరిసర గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ భూములను కూడా కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని నిర్వాసితులకు గ్రామ పరిసర ప్రాంతంలోనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద స్థలాలు కూడా ఇవ్వాలన్న ఆలోచన ఉంది. దీంతో ఈ ప్రాంతంలో స్థలాల విలువ పెరగడంతో అక్రమార్కుల కన్ను కొండ పోరంబోకు స్థలంపై పడింది. సెంటు రూ. 1.5 లక్షలకు ఇచ్చేస్తామంటూ బేరాలాడుతున్నారు. ఇందులో దాదాపు 15 సెంట్ల వరకు అమ్మేశారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరం. నరేంద్రపురం సమీపంలో ఇటీవల చెట్టుకొట్టిన స్థలాన్ని వెళ్లి పరిశీలించాం. రైతుల జిరాయితీ భూమిలో కలపాలని యత్నిస్తున్న వారిని హెచ్చరించాం. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. సత్యనారాయణ, తహసీల్దారు, మునగపాక

# కార్గో సంచిలో నేరాల డెలివరీ!!

విజయనగరం : ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 1000 వరకు చిన్న పాటి నాటుబాంబులు పేలాయి. వీటిని బస్సు ద్వారానే తీసుకొచ్చారు. దించే క్రమంలో పేలుడు ఘటన సంభవించి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.’

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడంతో పాటు పార్శిల్ సేవలను ఆర్టీసీ విస్తరించింది. 2017లో కార్గోను ప్రారంభించింది. రోజురోజుకూ రెట్టింపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. వస్తువులను తీసుకెళ్లేందుకు నామమాత్రపు రుసుము తీసుకుంటుండడంతో ఆదరణ లభిస్తోంది. దీనిని కొందరు ఆసరాగా చేసుకుంటున్నారు. నిషేధిత వస్తువులను తరలిస్తున్నారు. ఇటీవల పార్వతీపురంలో జరిగిన ఘటన ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

**250 బుకింగ్‌లు..**

విజయనగరం జోన్ పరిధిలో కార్గో ద్వారా రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. ఈమేరకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తోంది. నెలకు 7500 బుకింగ్‌ల ద్వారా రూ.12 లక్షలు సమకూరుతోంది. నిత్యం ఆశ్రయించేవారు 40 మంది వరకు ఉన్నారు.

**తనిఖీలేవీ?**

బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకే అప్పగించడంతో తనిఖీలు సరిగ్గా జరగడం లేదు. పార్శిల పైన ఒక పేరు రాసి ఉంటే.. లోపల మరో వస్తువు దర్శనమిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు స్కానర్ పరికరాలను వినియోగించాలి. అవి లేకపోవడంతో నచ్చిన సరకును తరలిస్తున్నారు. ఈక్రమంలోనే నిషేధిత వస్తువులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి.

**తక్కువ ధరలని..**

మిగతా ట్రాన్స్‌పోర్టు, కొరియర్ సేవలతో పోల్చుకుంటే ఆర్టీసీలో తక్కువ ధరలతో రవాణా చేసుకోవచ్చు. ఏజెన్సీ సిబ్బంది తమవారైతే వారికి మరీ ఉపయోగకరం. ప్రైవేటు వారే ఒక మూట రూపంలో కట్టి కేవలం బరువునే ప్రామాణికంగా చేసుకుని బుకింగ్ చేసుకుంటున్నారు. అంతే కాకుండా ఇక్కడ తనిఖీ కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

కార్గో విభాగానికి ఒక్కరే అధికారి ఉన్నారు. మూడు జిల్లాల పరిధిలో ఒక్కరే సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. డిపోల పరిధిలో డీఎంలు పర్యవేక్షించాలి. అయితే రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా నిఘా కొరవడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ ప్రబంధకురాలు హెచ్.దివ్య తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామన్నారు. రూ.5 వేలు దాటితే తప్పనిసరిగా బిల్ ఉండాల్సిందేనన్నారు.

# కొల్లగొట్టేయ్.. కొండా.. గుట్టా!

విజయనగరం : జిల్లాలో గ్రావెల్, కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొండలు, గుట్టలు కనిపిస్తే చాలు అక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారు. రాత్రిపగలూ తేడాలేకుండా తవ్వి ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు.. కళ్లముందే జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు పట్టనట్లు మొద్దునిద్ర వీడడం లేదు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, జామి, ఎస్.కోట, భోగాపురం, డెంకాడ, విజయనగరం శివారు ప్రాంతాల్లో తవ్వకాలే ఇందుకు నిదర్శనం.

తరుగుతున్న ప్రకృతి వనరులుఅక్రమ తవ్వకాలతో పచ్చని ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి. రాత్రయితే చాలు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో పెద్దఎత్తున్న తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చిన సమయంలో సొంత పనులకు వినియోగిస్తుననట్లు చెప్పి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. వీటిని పట్టణ ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్మకాలు చేపడుతున్నారు. ఇదీ పరిస్థితి..నెల్లిమర్ల మండలంలోని గరికిపేట సర్వే నంబరు–91లో చినకొండ వద్ద, గొర్లెపేట, బొప్పడాం, పారసాం, పూతికపేట చినకొండ వద్ద జోరుగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. భోగాపురం మండలంలో లింగాలవలస, చెరుకుపల్లి ప్రాంతాల్లో కొండలు, చెరువు గర్భాల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. జామిలో విసినిగిరి, భీమసింగి, చిల్లపాలెం శివారులోని కొండల వద్ద రాత్రి వేళల్లో యంత్రాలతో రాతిపిక్క తరలించేస్తున్నారు. ఎస్.కోటలో పట్టణ సమీపంలో కొండలు, గ్రామీణ ప్రాంతంలో వెంకటరమణపేట, బొడ్డవర, పుణ్యగిరి గుట్టల వద్ద జోరుగా తవ్వేస్తున్నారు.

చురకలు



## రండి.. వేడివేడిగా భోంచేయండి

చిత్తూరు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మరింత నాణ్యంగా అందనుంది.. వేడివేడిగా ఆహారాన్ని అందించి కడుపు నిండాభోంచేసేలా రంగం సిద్ధం చేస్తోంది.. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన ఆహారం అందించాలనే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్లు(కేంద్రీకృత వంటశాలలు) ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో, మరికొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకుల ఇళ్ల వద్ద భోజనాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్కడి నుంచి తెచ్చి పిల్లలకు అందించేసరికి ఆహారం అంతగా రుచించడం లేదు. ఈ నేపథ్యంలో



సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి లోకేశ్ ఆదేశించడంతో నివేదించారు.

చిత్తూరు జిల్లాలో పాఠశాలలు: 2,575

మొత్తం విద్యార్థులు: 1,62,343 మంది

**ఉమ్మడి జిల్లాలో ఇలా..** నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 నియోజకవర్గాల్లో 14 ఏర్పాటవుతాయి. మండలానికి ఒకటి చొప్పున అయితే 65 ఏర్పాటు కానున్నాయి. మూడునాలుగు మండలాలకు ఒకటి చొప్పున అనుకుంటే.. 20 వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**ప్రయోజనాలు ఇవీ..**

నాణ్యమైన, శుచిగా ఉండే ఆహారం

సత్వరమే పిల్లలకు అందజేత

తయారీలో పారదర్శకత

## వసతి గృహాల్లో అక్రమాలకు చెక్

చిత్తూరు : సంక్షేమ వసతిగృహాల్లో అక్రమాలకు అవకాశం లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాంకేతికతతో కూడిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై చేసే పనుల వివరాలు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఇటీవల జిల్లాలోని అన్ని వసతిగృహాల సంక్షేమ అధికారుల చరవాణుల్లో యాప్ డౌన్‌లోడ్ చేసి పనితీరును వివరించారు.

**పొరపాటైతే వార్డెన్లకు హెచ్చరికలు..**

ః వసతి గృహాల్లో పారదర్శకత పెంచేలా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టమ్ (హెచ్‌పీటీఎస్) పేరుతో యాప్ రూపొందించారు. ః రోజు, వారాంతం, నెలవారీ కార్యక్రమాలను నమోదు చేయాలి. ః కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు,



ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదుల శుభ్రత వివరాలు నిక్షిప్తం చేస్తారు. ః ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా వార్డెన్లకు యాప్ ద్వారా తక్షణమే హెచ్చరికలు జారీ చేస్తారు.

**వసతి గృహాల వివరాలు..**

సాంఘిక సంక్షేమం: 57

విద్యార్థులు: 3,500 మంది

బీసీ సంక్షేమం: 47

విద్యార్థులు: 2,382 మంది

గిరిజన సంక్షేమం: 2

విద్యార్థులు: 120 మంది

**భోజనాల నాణ్యతపై నిఘా..**

వసతి గృహాల్లో జరిగే అక్రమాలకు ఇకపై అడ్డుకట్ట పడనుందని అధికారులు భావిస్తున్నారు. భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే విద్యార్థుల సంఖ్యకు ఆహారం సరిపోతుందా..? లేదా..? నాణ్యతను ఏఐ ద్వారా తెలుసుకోవచ్చు. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## విలీనం.. ఎటో?

గూడూరు : జిల్లాల పునర్విభజన అంశాన్ని కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. వెంకటగిరి నియోజకవర్గం మొత్తాన్ని ఒకే డివిజన్ కిందికి తెచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే రెండు జిల్లాల్లో ఉన్న నియోజకవర్గం ఒకే జిల్లా పరిధిలోకి వస్తుంది.

**వైకాపా నిర్వాకంతో..** వైకాపా ప్రభుత్వం జిల్లాల విస్తరణలో భాగంగా రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరులోనే ఉంచి



వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలను తిరుపతిలో చేర్చింది. అప్పటి నుంచి డివిజన్ల పరంగా ఆత్మకూరులో కలువాయి.. నెల్లూరులో రాపూరు, సైదాపురం.. తిరుపతి జిల్లా గూడూరులో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలు ఉన్నాయి. మరోవైపు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపాలన్న ఆశలు మిణుకుమిణుకుమంటు న్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన పాశిం సునీల్‌కుమార్ రెండుసార్లు అసెంబ్లీ సమా వేశాల్లో ప్రజల తరఫున గళం వినిపిస్తూ వచ్చారు. తాజాగా వెంకటగి రిలోని అన్ని మండలాలను తిరుపతి జిల్లాలోకి చేర్చుతూ వాటన్నింటినీ గూడూరు రెవెన్యూ డివిజన్ కిందికి తెచ్చే ప్రతిపాదన ఉంది. మంత్రివర్గం ఆమోదంతో పూర్తి స్పష్టత రానుంది. నెల్లూరులో కలపాలని మెయిల్ : గూడూరు నియోజక వర్గాన్ని నెల్లూరులో కలపాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బుధవారం మెయిల్ ద్వారా విన్నవించారు. హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వానికి ప్రజల కోరికను తెలియజేశారు.

## చెత్తకొండ తరగదేంటప్పా!



పుట్టపర్తి: పురపాలికల్లో అత్యధికంగా వేధించే సమస్య చెత్త. డంపింగ్ యార్డుల్లో పేరుకుపోవడం, చుట్టూ జనావాసాలు ఏర్పడటంతో దుర్వాసన, అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త నిల్వలను శుభ్రం చేయించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం టెండర్లు పిలిచింది. శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురంతోపాటు కదిరి, పుట్టపర్తి, మడకశిర, ధర్మవరం, పెనుకొండ మున్సిపాలిటీల్లోని చెత్త నిల్వలను శుభ్రం చేసే టెండరును గుంటూరుకు చెందిన గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. శుద్ధి చేసి మట్టి, ఎరువు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడానికి టన్నుకు రూ.856 ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఏప్రిల్‌లో పనులు ప్రారంభం కాగా.. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

**కాసులు ఖర్చవుతున్నా..**

వాస్తవానికి 2023లో అప్పటి వైకాపా హయాంలో పనులు చేపట్టగా.. ఇదే అదనుగా కొందరు పనులు చేయకనే బిల్లులు చేసుకున్నారు. ఫిర్యాదులు వెల్లడంతో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం రావడంతో పనులు చేపట్టారు. అన్నిచోట్ల పనులు పూర్తికాగా.. హిందూపురంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ మొదట డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేసి 49 వేల టన్నులు ఉన్నట్లు నిర్ణయించారు. జులైలో పనులు చేపట్టి అక్టోబరు2 నాటికి 49 వేల టన్నుల మేరకు శుద్ధి చేశారు. నిల్వలు ఇంకా మిగిలే ఉండటంతో మరో 12 వేల టన్నులను కంపోస్టు చేశారు. ఇందుకోసం రూ.5.22 కోట్లు ఖర్చవుతుంది. అయినా నిల్వలుంటున్నాయి. దీంతో మరో 20 వేల టన్నులకు ప్రతిపాదనలు పెంచి కొనసాగిస్తున్నారు. పూర్తయితే సదరు గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం రూ.6.93 కోట్లు చెల్లించుకోవాల్సి ఉంటుంది. 20 వేల టన్నులు కరిగించినా.. 60 టన్నులకు పైగా పాతచెత్త మిగిలే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిల్వను అంచనా వేయడంలో అధికారులు విఫలమవుతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో కరుగుతోంది చెత్తా? లేక నిధులా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విషయంపై ప్రజారోగ్య విభాగం అధికారులను వివరణ కోరగా.. స్వచ్ఛాంధ్ర కార్పొరేషనే టెండర్లు పిలిచిందని, పనులను మున్సిపాలిటీకి అప్పగించింది. ఆ తర్వాత తమకు అప్పగించారు. ఇప్పటివరకు పురం పనులకు ఒక్క రూపాయి బిల్లు చేయలేదు. జీపీఎస్ విధానంలో లెక్కించి తగిన ఆధారాలు ఇస్తేనే బిల్లులు ఇస్తామని చెబుతున్నారు.

## కళాశాల ప్రాంగణం.. అన్యాక్రాంతం



ఉరవకొండ: జాతీయ రహదారి ఆనుకుని 12 ఎకరాల విస్తీర్ణంలోని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం ఉంది. అందులోని ఖాళీ స్థలం క్రమంగా అన్యాక్రాంతం అవుతోంది. ఇప్పటికే నాలుగు ఎకరాల్లో నిర్మాణాలు వెలిశాయి. మిగతా ప్రాంగణం ఖాళీగా ఉంది. కళాశాల ముందు భాగంలో కొంతవరకు ప్రహరీ ఉండగా.. మూడు వైపులా లేకపోవడం గమనార్హం. గతంలోనే సుమారు ఎకరా స్థలం కబ్జాకు గురైంది. కళాశాల వెనుక భాగంలో పలు కాలనీలు క్రమంగా అభివృద్ధి చెందుతుండటంతో ఈ ప్రాంతంలోని స్థలాలకు గిరాకీ పెరిగింది. ఎకరా కనీసం రూ.2 కోట్లు పలుకుతోంది. ప్రస్తుతం విద్యాలయం స్థలంలో ఆక్రమణలు పోను 8 ఎకరాలు మిగిలాయి. ప్రహరీ లేకపోవడంతో ఇప్పటికే ఆక్రమణకు గురైన స్థలాల అంచున మరికొందరు కబ్జాపర్వానికి తెర లేపారు. మరోవైపు కళాశాల ఎదుటి భాగంలో ఇప్పటికే పలువురు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటివల్ల కూడా విద్యాలయం నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

**రక్షణ ఏదీ?**

సదరు కళాశాలకు గతంలోని తెదేపా ప్రభుత్వం భూమిని సమకూర్చింది. ప్రస్తుతం దీనిని పరిరక్షించుకోకపోతే భవిష్యత్తు అవసరాలకు కష్టంగా మారుతుంది. ఉన్నత విద్యామండలి అధికార యంత్రాంగం స్పందించి... స్థలానికి కొలతలు వేయించి ప్రహరీని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో రెండు దశాబ్దాలకుపైగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే రూ.కోట్లు విలువైన స్థలానికి రక్షణ ఉండదు. తక్షణం ప్రాంగణంలోని కంప చెట్లను తొలగించి హద్దులు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తే మేలు. ఈ విషయంపై ప్రిన్సిపల్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల చేస్తే ప్రహరీ నిర్మించి.. రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు

## సైన్స్ సెంటర్ చూసొద్దామా..!

తిరుపతి : పిల్లల్లో.. జిజ్ఞాస, అభిరుచి, లోతుగా శోధించే గుణం సహజంగానే అబ్బుతాయి. తల్లిదండ్రులుగా మనం వాటిని గుర్తించి ప్రోత్సహించగలిగితే వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇందుకు అనువైన ప్రపంచాన్ని తిరుపతిలోని సైన్స్ సెంటర్ పరిచయం చేస్తోంది. చిన్నారులతోపాటు విద్యార్థుల మలి అడుగు బలంగా పడేలా అక్కడి అధికారులు సహకరిస్తున్నారు. పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తునారు.

**363 రోజులూ తెరిచేలా..** సైన్స్ సెంటర్ వారంలో అన్ని రోజులూ సందర్శకుల కోసం తెరిచే ఉంటుంది. వినాయకచవితి, దీపావళి పండగలకు మాత్రమే సెలవు ఉంటుంది.

**చేరుకునేది ఇలా..**

ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి అలిపిరి మీదుగా సుమారు 7 కి.మీ. దూరంలో తిరుపతి సైన్స్ సెంటర్ ఉంటుంది. అలిపిరి నుంచి జూపార్కు మార్గంలో కిలోమీటరు వెళ్తే సైన్స్ సెంటర్‌ను చేరుకోవచ్చు. చెర్లోపల్లి క్రాస్ నుంచి సుమారు 8 కి.మీ. ఉంటుంది. లక్ష్యాలు ఇలా.. మూఢనమ్మకాలకు స్వస్తిపలికి వైజ్ఞానిక అంశాలతో నిజాలు తెలుసుకునేలా మార్గనిర్దేశనం.

విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా మారేందుకు ప్రేరణ కల్పించడం.

పాఠశాల దశ నుంచే పరిశోధనల వైపు ప్రోత్సహించడం.

**ప్రత్యేక గ్యాలరీలు**

ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, ఖగోళశాస్త్రం కలబోతగా సైన్స్ సెంటర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి.

విశ్వాంతరాలు, అంతరిక్ష రహస్యాలు, నక్షత్ర మండళ్లు, పాలపుంతలు, గ్రహాల గమనాన్ని కళ్లముందుకు తీసుకువచ్చే 3డీ డిజిటల్ ప్లానిటోరియం.

ఆయా సబ్జెక్టుల్లో పరిశోధనలు చేసేందుకు, ఆవిష్కరణల రూపకల్పనకు ఇన్నోవేషన్ సెంటర్. 8 వేసవితోపాటు సంక్రాంతి, దసరా సెలవుల్లో సైన్స్, ఖగోళశాస్త్రం, రోబోల తయారీ, డ్రోన్ల రూపకల్పన, రాకెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ.



మానవశరీర నిర్మాణ రహస్యాలు, శాటిలైట్ వ్యవస్థపై అవగాహన పెంచుకునేలా గ్యాలరీలు. 8 డైనోసార్స్ కాలంలోని జీవజాతుల గురించి వివరించే ప్రీ హిస్టారిక్ పార్కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కేంద్రం వేళలు :

ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు. మిగిలిన రోజుల్లో అరగంట ముందే మూసివేస్తారు.

సందర్శకుల రాక

వారాంతాల్లో : 3000

సాధారణ రోజుల్లో : 1000

ప్రవేశ రుసుం..

సాధారణ సందర్శకులకు రూ.35. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు, బీపీఎల్ కుటుంబాలకు రూ.5., పాఠశాల, కళాశాలల నుంచి బృందాలుగా వచ్చే విద్యార్థులకు రూ.20 నిర్ణయించారు.

3డీ ఫిలిం షో, ప్లానిటోరియం, సైన్స్ షోకు ప్రత్యేక రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

## దారి దోపిడీ

కర్నూలు: కర్నూలు నగర శివారులో గత నెల 16వ తేదీన నిర్వహించిన ప్రధాని సభకు వెచ్చించి నిధుల్లో భారీగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. 450 ఎకరాల్లో సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అవసరం లేకపోయినా రోడ్లు వేశారు. వాటిలో ఎక్కడా నాణ్యత పాటించలేదు. ఆర్అండ్‌బీ అధికారులే రూ.18.17 కోట్లు వెచ్చించారు.

**తరలిపోతున్న వెట్‌మిక్స్**

రహదారుల నిర్మాణానికి వినియోగించిన వెట్‌మిక్స్ తవ్వేస్తున్నారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ పరిమాణం ధర రూ.3వేల వరకు పలుకుతున్నట్లు సమాచారం. నన్నూరు టోల్‌గేటు సమీపంలో ఉన్న కొన్ని వెట్‌మిక్స్ రహదారులను తవ్వేసి కంకర మొత్తాన్ని పక్కనే కుప్పలుగా పోశారు.



**మొక్కలు మాయం...**

ఏపుగా పెరిగిన మొక్కలను తీసుకొచ్చి వందలాది మంది సిబ్బందితో నాటించారు. ఆయా మొక్కల్లో ప్రస్తుతం పదిశాతం మొక్కలు కూడా అక్కడ లేవు.

**కుంగిన మార్గం**

జాతీయ రహదారి నుంచి సభా వేదిక సమీపం వరకు నిర్మించిన నాలుగు వరుసల రహదారి కుంగింది. రహదారుల నిర్మాణంతో 'మార్గం' సుగమం అవుతుందని భావించాం.. నెలరోజులకే చెదిరిపోయాయని" స్థానికులు పేర్కొంటున్నారు.కొన్నిచోట్ల చిప్స్ పోసి వదిలేశారు.. కింద వెట్‌మిక్స్ పోయకపోవడం, తారు పోసి రోడ్డు రోలర్‌తో తొక్కించక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. లేఅవుట్‌కు చెందిన కొందరితో కుమ్మక్కై కొన్నిచోట్ల మాత్రం మంచిగా రహదారులు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలను వదిలేశారు.

## సుంకేసులకు గండం

కర్నూలు : రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకమైన సుంకేసుల జలాశయం గేట్ల లీకేజీలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం 300- 400 క్యూసెక్కుల మేర వృథా అవుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం జలాశయాల నిర్వహణకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దెబ్బతిన్న గేట్ల ఇనుపతాళ్లు, రబ్బరు సీళ్లను మార్చలేకపోయారు. గ్రీజు పూసేందుకు కూడా కాసుల కొరత వేధించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా లీకేజీలను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు చేపట్టారు.

**ఆగమేఘాలపై పనులు**

గేట్ల లీకేజీలను అరికట్టకపోతే 3 నెలల్లో సుంకేసుల జలాశయం ఖాళీ అయ్యే ప్రమాదముందని నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఆగమేఘాల మీద మరమ్మతులు ప్రారంభించారు. 9 గేట్ల నుంచి నిత్యం 400 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతున్నట్లు తేల్చారు. ప్రస్తుతం సుంకేసులకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో లీకేజీల ద్వారా నీరుపోతున్నా జలాశయంలో 1.230 టీఎంసీల నిల్వ కొనసాగుతోంది.

కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ఈ



జలాశయం కీలకపాత్ర పోషిస్తోంది. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టారు.

**రూ.65 లక్షలతో..** సుంకేసుల ఆనకట్టకు 30 గేట్లు ఏర్పాటు చేశారు. దాదాపు అన్నింటినుంచి నీరు లీకవుతోంది. 1, 11, 13, 14, 16, 18, 19, 26, 28 గేట్ల నుంచి భారీగా వృథా అవుతోంది. అన్ని గేట్లకు పూర్తిస్థాయిలో రబ్బర్ సీళ్లు అమర్చి ఆధునికీకరించేందుకు రూ.65 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులు వెచ్చిస్తున్నారు. తుంగభద్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేసుకుని, గేట్లకు మరమ్మతులు ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తిచేసి లీకేజీలను అరికడతామని కేసీ కాలువ ఈఈ ప్రతాప్ తెలిపారు.

## పల్లె ప్రగతికి బాటలు

కర్నూలు : గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు రోడ్ల పునర్నిర్మాణానికి నాబార్డు నిధులు విడుదల చేసింది. 2025- 26కుగాను కర్నూలు జిల్లాలో రూ.17.13 కోట్ల వ్యయంతో 13 రహదారులను 43 కి.మీ మేర పునర్నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇప్పటికే పలుచోట్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

**జనవరికి పూర్తి చేయాలని..**

నాబార్డు నిధులతో చేపట్టిన రహదారుల పనుల్లో ఇప్పటికే రెండు పూర్తయ్యాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు ఎస్సీకాలనీలో రూ.40 లక్షల విలువతో కి.మీ మేర ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండల పరిధిలోని వెల్దుర్తి- కోడుమూరు రోడ్డును టి.గోకులపాడు వరకు 3 కి.మీ మేర రూ.150 లక్షల వ్యయంతో నిర్మించారు.మరో 11 రహదారుల పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి నాణ్యత విభాగం తనిఖీలు నిర్వహిస్తోంది.ఎమ్మిగనూరు నుంచి సోగనూరు వరకు రూ.2 కోట్ల వ్యయంతో 4.80 కి.మీ రహదారిని సిద్ధం చేస్తున్నారు.

కోడుమూరు నియోజకవర్గం సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి వరకు రూ.180 లక్షల వ్యయంతో 2.80 కి.మీ రహదారి నిర్మిస్తున్నారు.

ఆదోని పట్టణం నుంచి బసాపురం వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

# మార్కెట్ స్థలం మాయం

నంద్యాల: జిల్లా కేంద్రంలో నూనెపల్లి మార్కెట్లో ఖాళీ స్థలంపై అక్రమార్కులు కన్నేశారు. మూడెకరాలు తమదంటూ కొందరు న్యాయస్థానం మెట్లెక్కారు. దీని విలువ రూ.200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. లేదు ఆ స్థలం మార్కెటింగ్ శాఖకు సంబంధించిందని అధికారులు కోర్టుకు వెళ్లారు.. ఇంకా పదెకరాలకుపైగా స్థలం ఖాళీగా ఉంది.. ఇది ఆక్రమణకు గురికాకముందే అధికారులు అప్రమత్తం కావాల్సినవసరం ఉంది.

**ఎకరా రూ.25 కోట్లు పలుకుతోంది**

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రైతు నగరం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఆ స్థలానికి విపరీతమైన గిరాకీ ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.25 కోట్లు పలుకుతోంది. ఈ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించుకొంటే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ఖాళీ స్థలాన్ని అద్దె ప్రాతిపదికన ఇస్తే తాము ఉపయోగించుకుంటామని ప్రభుత్వ శాఖల అధికారులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖాళీ స్థలం వినియోగంపై దృష్టి పెట్టింది. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండేలా గోదాములు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని మార్కెట్ కమిటీ ప్రతిపాదించింది.



**ఏళ్ల కిందట 8 ఎకరాల్లో**

దశాబ్దాల కిందట ఎనిమిదెకరాల విస్తీర్ణంలో నూనెపల్లి మార్కెట్ యార్డు ఏర్పాటు చేశారు. పది భారీ గోదాములు, పరిపాలన భవనం నిర్మించారు. భారీగా దిగుబడులు వస్తుండటం.. స్థల సమస్య నేపథ్యంలో టెక్కె ప్రాంతంలో కొత్తది నిర్మించారు. పాత మార్కెట్ యార్డు స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. 20ఏళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. భవనాల కిటికీలు, తలుపులను చోరీ చేశారు. గోదాముల నిర్వహణ గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కేవలం అరెకరం స్థలంలో మాత్రమే షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అందులో పది దుకాణాలుండగా నేటికీ ఆరు ఖాళీగానే ఉన్నాయి.

# స్థలం కోసం సిగపట్లు!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నడిబొడ్డున కీలకమైన వ్యాపార కూడలిలో ఉన్న స్థలమది. విలువ రూ.3 కోట్లు పైమాటే. ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో దాని చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. సమస్య సంక్లిష్టంగా మారుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

**ఎవరికి వారే తమదంటూ...**

వై.పాలెం ఆర్టీసీ బస్టాండ్ పక్కనే సుమారు పన్నెండు సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉండేది. మలేరియా కార్యాలయం, ఆరోగ్య ఉప కేంద్రం ఇక్కడే నడిచేవి. గత వైకాపా ప్రభుత్వం బస్టాండ్ విస్తరణ పేరిట ఇక్కడి కట్టడాలను కూల్చేసింది. తరువాత ఎలాంటి పనులు చేపట్టలేదు. సంరక్షణ చర్యలు సైతం లేక ఖాళీగా మారిన స్థలంపై కొందరి కళ్లు పడ్డాయి. అప్పట్లోనే ఇందులోని అయిదు సెంట్లు గిరిజన భవన్‌కు కేటాయించారని బోర్డు పెట్టారు. మరో కుల సంఘం వారూ బోర్డు పాతారు. కూటమి ప్రభుతం వచ్చాక దీనిని తొలగించారు. మరోవైపు ఆ స్థలం అప్పటి మంత్రి మహిళా మార్ట్ కోసం కేటాయించారని వెలుగు అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు డీఆర్‌డీఏ పీడీ నారాయణ సైతం ఇటీవల పరిశీలించి



వెళ్లారు. మరోవైపు అది పంచాయతీకి చెందినదని... పంచాయతీ వాహనాలను అక్కడ నిలుపుతున్నారు. ఇదిలా ఉంటే... తమకు కేటాయించాలంటూ ఓ సంఘం వారు ఓ నాయకుడి అండతో కొద్ది రోజుల క్రితం తహసీల్దారుకు అర్జీ అందజేశారు. స్థలం తమ శాఖదేనని అవసరమైతే కోర్టుకు వెళ్తామని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే ఎన్జీవో నాయకుడు చెబుతున్నారు.

**రెవెన్యూ అధికారుల చోద్యం...**

స్థలం చుట్టూ ఇన్ని వివాదాలు, రాజకీయాలు నడుస్తున్నా... ఎవరికి వారు తమదంటే తమదని సిగపట్లు పట్టుకుంటున్నా... సమస్య పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం ఇటుగా కన్నెత్తి చూడడం లేదు. పరిస్థితి మరింత జటిలం కాకముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కార్యదర్శి రామసుబ్బయ్యను సంప్రదించగా... సంబంధిత దస్త్రాలు పరిశీలించి వివరాలు తెలియజేస్తామన్నారు.

# గ్రానైట్ కళ.. మసకబారుతోంది..!

చీమకుర్తి : గ్రానైట్ పరిశ్రమకు ప్రకాశం జిల్లా పెట్టింది పేరు. దేశ విదేశాలకు సైతం ఇక్కడనుంచే గ్రానైట్ రాయి వెళ్తోంది. ప్రభుత్వానికి విదేశీ ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. అలాంటిది ఇటీవలి కాలంలో యజమాన్యాలు సమ్మె చేయడం, కార్మికులు వలసలు వంటి కారణాలతో ఫ్యాక్టరీల్లో కార్యకలాపాలు నిలిచి గ్రానైట్ పరిశ్రమ కళ తప్పుతోంది. ఆయా పరిశ్రమల్లో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల్లో దాదాపుగా 90 శాతం మంది తమ స్వస్థలాలకు తరలి పోయారు.

**ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో చిక్కులు మొదలు**

అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రానైట్ తదితర చిన్న తరహా ఖనిజాల సీనరేజి వసూళ్లను ప్రైవేటు సంస్థ ఏఎంఆర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో ఫ్యాక్టరీల యజమానులు ఎండీఎల్ కోసం ఒక్కో బ్లేడుకు చెల్లిస్తున్న మొత్తాన్ని సుమారుగా 30శాతం వరకు పెంచారు. జీఎస్టీతో కలిపి ఒక్కో బ్లేడుకు రూ.40 వేలు అవుతుండగా దీనిపై అదనపు మొత్తాలను చెల్లించాలని ప్రైవేటు సంస్థ వారు అడుగుతున్నారంటూ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఫ్యాక్టరీ యజమానులు సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో పరిశ్రమల యజమానులు ఈనెల 11న జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి పరిశ్రమను కాపాడే దిశగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యం వేలాది మంది కార్మికులతో సందడిగా ఉండే మర్రిచెట్లపాలెం కూడలి ప్రస్తుతం బోసి పోయి కనిపిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారుగా లక్ష మందిపై ప్రభావం చూపుతోంది.

# మానవాళికి మహోపకారం!!



విశాఖపట్నం: ఒకప్పుడు నగర శివారులో ఎలాంటి జనసంచారం లేని ప్రాంతం. ఇప్పుడు దేశంలో వైద్య ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా మారింది. ప్రపంచంలోని ఎన్నో దేశాలకు వైద్య ఉపకరణాలు ఎగుమతి చేస్తోంది. వందలాది సంస్థలు, అక్కడ తయారయ్యే పరికరాలతో తక్కువ కాలంలోనే దేశ, విదేశాల్లో గుర్తింపు పొందాయి. అదే విశాఖలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్). విద్యార్థులు, పరిశోధకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పిస్తోంది. ప్రపంచస్థాయి పరిశోధన, శిక్షణ కోసం నెలకొల్పిన 'మెడ్‌టెక్ యూనివర్సిటీ'ని త్వరలోనే ప్రారంభించ నున్నారు.

**సదుపాయాలు**

ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రయోగశాలలు, పరీక్ష కేంద్రాలు, త్రీడీ ప్రింటింగ్, బయోమెటీరియల్ టెస్టింగ్, కేంద్రాలు, రీజెనరేటివ్, మెడికల్ ఫెసిలిటీ, స్టెమ్‌సెల్ కల్చర్ ఫెసిలిటీ తదితరాలు.

**అందుబాటులో 'పీజీ' కోర్సులు..**

మెడ్‌టెక్‌కు పెరుగుతున్న డిమాండ్ మేరకు ఆరు నెలల వ్యవధితో పీజీ సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. అక్కడి ఇండియన్ బయోమెడికల్ స్కిల్ కన్సార్టియమ్ (ఐబీఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోర్సులకు భారతీయులతోపాటు విదేశీయులూ దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ కోర్సుల ద్వారా వివిధ పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలకు సన్నద్ధం చేస్తున్నారు.

**'అంకుర సంస్థ'లకు ఆసరా**

అత్యాధునిక సౌకర్యాలతో కూడిన లక్ష చదరపు అడుగుల స్టార్టప్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నీతిఆయోగ్‌కు చెందిన 'మెడీ వ్యాలీ', కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖకు చెందిన 'బయో వ్యాలీ' పేరిట రెండు ఇంక్యుబేటర్లు ఏర్పాటుచేశారు. అంకుర సంస్థలకు ఆర్థిక సలహాలు, నిధులు సమకూరేందుకు సహకరిస్తున్నారు. వ్యక్తిగత ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇన్నోవేషన్ పాస్‌పోర్టు (ఐ-పాస్‌పోర్టు)లు జారీ చేస్తోంది. దీని ద్వారా అంకుర సంస్థలు అక్కడి ప్లగ్‌అండ్‌ప్లే సౌకర్యాలు, ప్రపంచ స్థాయి పరీక్షల కేంద్రాలు, ఫ్యాబ్రికేషన్ ల్యాబ్‌లు, పూర్తి ఎకోసిస్టమ్‌ను వినియోగించుకోవచ్చు.

ప్రారంభం: 2018
విస్తీర్ణం: 275 ఎకరాలు
సంస్థలు: 150కి పైగా
టర్నోవర్: రూ.10 వేల కోట్లకు పైగా..
ఎగుమతులు: 80 దేశాలకు
ఉత్పత్తులు: క్యాన్సర్ నిర్ధారణలో వినియోగించే ఐసోటోప్‌లు, ఎక్స్‌రే, ఎంఆర్ఐ, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, క్యాథ్‌ల్యాబ్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు తదితర 400కు పైగా.

**దివ్యాంగులకు భరోసా..**

మెడ్‌టెక్ జోన్‌లోని ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్‌లో దివ్యాంగుల కోసం కృత్రిమ అవయవాలు రూపొందిస్తున్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో వేగంగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్నవాటితో పోలిస్తే ఇవి తేలికగా, మరింత ఉపయుక్తంగా ఉంటున్నాయి. వీటిని లాభాపేక్ష లేకుండా తయారీ ధరకే అందిస్తున్నారు. యానిమల్ రీహాబిలిటేషన్ సెంటర్ సహకారంతో పెంపుడు జంతువులకూ ఈ తరహా సేవలు అందిస్తున్నారు. ఇటీవల ఓ శునకం, మరో లేగదూడ సులభంగా నడిచే ఏర్పాటు చేశారు.

**విద్యార్థులకు అవగాహన**

పరిశ్రమల సందర్శనలో భాగంగా విద్యార్థులకు అత్యాధునిక మెడ్‌టెక్ ఎకోసిస్టమ్, ఉత్పత్తులు, పరిశోధనలు, ఆవిష్కరణలపై అవగాహన కల్పిస్తున్నారు. మెడ్‌టెక్ రంగంలో ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. అత్యాధునిక ల్యాబ్‌లు, సౌకర్యాలను విద్యార్థులు సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని 154కు పైగా కళాశాలల యాజమాన్యాలు మెడ్‌టెక్ జోన్‌తో ఒప్పందం చేసుకున్నాయి.

# చీకటి దందా.. తెరలేపారంతా!



అనకాపల్లి : ఉచిత ఇసుక విధానానికి జిల్లాలో అడుగడుగనా తూట్లుపడుతున్నాయి. నిన్న, మొన్నటివరకు గెడ్డలు, నదులను ఇష్టారాజ్యంగా తవ్వేసిన అక్రమార్కులు ఖాళీ స్థలాలు, తోటల్లో నిల్వ చేశారు. ఇప్పుడు విక్రయాలు చేస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు చూస్తూ వెళ్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలేదు.

జిల్లాలో అధికారికంగా 7 ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇప్పటివరకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేశారు. ఇందులో టన్ను రూ. 720 పడుతుంది. ఒక ట్రాక్టర్‌లో మూడు టన్నులకు పైగా పడుతుంది. రవాణా ఛార్జితో కలిపి సుమారు రూ. 3 వేల వరకు ఖర్చవుతుంది. అదే అక్రమార్కులు ట్రాక్టర్ లోడు రూ. 2 వేలకు విక్రయిస్తున్నారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడతోపాటు విశాఖ నగరంలోని గాజువాక, కూర్మన్నపాలెంలో నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో అక్కడకు నేరుగా పంపిస్తున్నారు.

చోడవరం మండలం గవరవరం గ్రామంలో బహిరంగంగా ఇసుక వేలంపాట నిర్వహించారు. ఇందులో గ్రామాభివృద్ధి కోసం ఏడాదికి రూ. 7.41లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శారదానదిలో భారీగా ఇసుక మేట వేసింది. దీంతో నదిలో ఇసుక తవ్వి టైరుబళ్లతోపాటు ట్రాక్టర్లు, లారీలకు అమ్మేందుకు ఒక ధరను నిర్ణయించనున్నట్లు తెలిసింది. ఒకటి, రెండురోజుల్లో తవ్వకాలు ప్రారంభించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై తహసీల్దారు రామారావు వద్ద ప్రస్తావించగా అక్రమ తవ్వకాలు చేపట్టి ఇసుక విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**

అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేయడం నేరం. జిల్లాలో స్టాక్ పాయింట్ల ద్వారా వర్షాల సమయంలోనూ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ఎక్కడైనా చేలల్లో, తోటల్లో అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించా. అక్రమ రవాణా చేస్తే.. వినియోగించిన వాహనాలు సీజ్ చేస్తాం.
శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

# కొనింది కొంత.. కొట్టేసేది కొండంత



తిరుపతి: తోడేళ్లకు తోడబుట్టినట్లు అక్రమార్కులు తెగబడిపోతున్నారు. గ్రావెల్, మట్టి రేయింబవళ్లు తవ్వుతూ దందాను అంతకంతకూ విస్తరిస్తున్నారు. ఇదంతా ఎక్కడో కాదు.. కలెక్టరేట్‌కు పది కి.మీ. దూరంలో ఉన్న రామచంద్రాపురంలోనే.. పైగా హరిత ట్రైబ్యునల్ స్టే ఇచ్చినా లెక్క చేయడం లేదని.. అధికారులకు మామూళు అందుతుండటంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా జరుగుతోంది నెత్తకుప్పం రెవెన్యూ గ్రామానికి చెందిన ఎల్వీపురం (కట్లకణం) సమీపంలోని గుట్ట పోరంబోకు స్థలంలో యథేచ్ఛగా గ్రావెల్ రవాణాకు పాల్పడుతున్నారు. సదరు భూమిపై గతంలో హరిత ట్రైబ్యునల్ స్టే ఇచ్చినా.. ఇష్టానుసారం తవ్వేసి.. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తోంది. ఇటీవల పిల్లారికోన ప్రాంతంలోనూ ఇదే జరిగింది. ఆక్రమణే అంతా..సి.రామాపురంలో అక్కగార్ల ఆలయానికి ఎదురుగా ఉన్న కొండను... వైకాపా నేతలు కొల్లగొట్టి ప్లాట్లుగా విక్రయించారు. కూటమిలో చేరి అదే దందాకు తెరలేపారు. కొనింది రెండెకరాలు కాగా.. చుట్టుపక్కల మరో మూడెకరాల మేరకు.. కొండంతా కరిగించి గ్రావెల్ తరలిస్తున్నారు.. ప్లాట్లకు నీళ్లు.. కరెంటు ఇచ్చేలా చేసి అధిక ధరలకు సొమ్ము చేసుకుంటున్నారు. పరిశీలించి నిలిపేయిస్తాం.. రామచంద్రాపురం మండలంలో అక్రమాలు, ఆక్రమణలు పరిశీలించి నిలిపేయిస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వర్, కలెక్టర్

## నెయ్యి దీపం.. కల్తీ పాపం.. శ్రీకాళహస్తిలో యథేచ్ఛగా విక్రయాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిధిలోని పురాణ ప్రాశస్త్యంగల ఉపాలయాలు మసిబారుతున్నాయి. కార్తిక మాసమే కాకుండా ఇతర రోజుల్లో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగిస్తున్నారు. అయితే పలు కారణాలతో ఆలయ పరిసరాలు, గోడలు మసిబారుతున్నాయి. భిక్షాల గాలిగోపురం, రంగుల గోపురం, శివయ్య గోపురం సమీపంలో దుకాణదారులు కార్తిక మాసం సందర్భంగా తక్కువ పెట్టుబడితో సిద్ధమయ్యే దీపాలు ఎంచక్కా అమ్మేస్తున్నారు. అందులోనూ 21 వత్తుల నుంచి లక్ష వత్తుల వరకు సిద్ధం చేసి రూ.100-500 వరకు విక్రయిస్తూ మోసగిస్తున్నారు. కల్తీ విషయం తెలియక భక్తులు అధిక ధరలకు కొనేసి వెలిగిస్తున్నారు. కళుగప్పి ప్రవేశం దీపాలు మహద్వారం నుంచి ప్రధాన ఆలయంలోకి అనుమతించడం లేదు. అయినా కొందరు చాకచక్యంగా తీసుకెళ్లి వెలిగించేస్తున్నారు.

# కమీషన్ల 'కాటా'.. మామూళ్ల వేట

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సరకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే వరకు అడుగడుగునా మోసపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు దోపిడీలో పాలుపంచుకుంటున్నారు.

**పీడిస్తున్న హమాలీలు**

ఒక సంచిని వాహనం నుంచి కిందకు దింపినందుకు రైతులు హమాలీ ఛార్జీ రూ.5.04 చెల్లించాలి. లైసెన్స్‌డ్ హమాలీలు వాహనం నుంచి సరకు కిందకు దింపాలి. కానీ మార్కెట్‌లో లైసెన్స్‌డ్ హమాలీలకు బినామీలుగా చలామణి అవుతున కార్మికులు సరకును కిందకు దింపుతున్నారు. ఛార్జీలకు అదనంగా డ్రైవర్ మామూళ్లు, హమాలీలు రూ.300 నుంచి రూ.500 వరకు, అదే లారీలో సరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు.

**రూ.2 కోట్లకుపైగా వసూలు**

విపణికి నిత్యం చిన్న, పెద్ద వాహనాలు 500 వరకు వస్తుంటాయి. ప్రస్తుతం ఉల్లి వాహనాలే 300 వరకు ఉన్నాయి. మామూళ్ల పేరుతో



రైతుల నుంచి వసూలు చేసే అదనపు మొత్తమే రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. సీజన్‌లో 6 నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు రైతుల నుంచి పిండుకుంటున్నారు.

**పచ్చి సరకు పేరుతో..**

క్వింటాకు రూ.2 చొప్పున రైతులు కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఉల్లి పంటకు మాత్రం క్వింటా రూ.4 చొప్పున కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

ఉల్లి పచ్చి సరకని గతంలో మార్కెట్ కమిటీ ఈ మేరకు ఛార్జీలను నిర్ణయించింది. ఈ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తూకాల్లోనూ మోసాలు**

మార్కెట్ యార్డులో తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ యంత్రాలతో అనుసంధానం చేయడం లేదు. ఫలితంగా మోసాలు జరుగుతున్నాయి. కొందరు కమీషన్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో ముందస్తుగానే క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు మైనస్‌లో పెట్టేస్తున్నారు.

బయట తూకం వేసే క్రమంలో అంతా సరిగానే ఉన్నట్లు కనిపిస్తుండటంతో రైతులు మోసాలను పసిగట్టలేకపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ పరికరాలను అనుసంధానం చేస్తే ఈ-నామ్‌లో కచ్చితమైన తూకం ఉంటుంది. మార్కెట్‌లో మాత్రం ఇది అమలు కావడం లేదు.

**ఈ-పోస్.. ఉష్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ఈ-పోస్ యంత్రాలను సమకూర్చుకోవడంపై అధికారులు దృష్టిపెట్టడం లేదు. రూ.2- 3 లక్షలు వెచ్చిస్తే పాడైన ఈ-పోస్ యంత్రాలకు మరమ్మతులు చేయించొచ్చు. లేదా కొత్తవి కొనుగోలు చేయొచ్చు.

ఈ-నామ్ అమలైనప్పటి నుంచి ఇక్కడ ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసిన దాఖలాలు లేవు. ఇవి అందుబాటులో ఉంటే మార్కెట్ కమిటీ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారుల దోపిడీకి అవకాశం ఉండదు. ఇవి లేకుంటేనే రోజువారీగా ముడుపులు ముడుతుంటాయి. అందుకే ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసే పద్ధతిని పక్కన పెట్టేశారు.

# గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో 'దారి'ణంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపాటు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్లు తదితర పనులకు వినియోగించుకోవాలి. గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళ్తుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి. పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# కదలని వరద.. వదలని బురద

పత్తికొండ : గుంతకల్లు–గుంటూరు రైల్వే లైను వెంట ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్‌సీ గేట్లు తొలగించారు. వాటి స్థానంలో అండర్ పాస్‌లు నిర్మించారు. గుత్తేదారులు నిబంధనలు పాటించలేదు. వరద నీరు వెళ్లడానికి కాల్వలు సరిగా నిర్మించలేదు. దీంతో పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది.. ఏటా ఎనిమిది నెలలపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. విధిలేక రైతులు వరద నీటిలోనే వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

మద్దికెర– చిప్పగిరి గ్రామాల మధ్య రైతులు పొలాలకు వెళ్లేందుకు రూ.2 కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించారు. చిప్పగిరి, కుందనగుర్తి, ఆలూరు, నేమకల్లు తదితర గ్రామాలకు దగ్గరి దారి కావడంతో వెళుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది.

**ఎక్కడ ఎలా ఉందంటే**

చిప్పగిరి మండలం గుమ్మనూరు–డేగులహాల్ గ్రామాల మధ్య అండర్ పాస్ (లోలెవల్ వంతెన) నిర్మించారు.. పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది..

మద్దికెర వద్ద రెండు అడుగుల ఎత్తులో నిర్మించడంతో నీరు వెళ్లడం లేదు.. మద్దికెర వద్ద రెండుచోట్ల, అగ్రహారం వద్ద 2, యడవలి, పెరవలి, హంప తదితర గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

మద్దికెర–చిప్పగిరి ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెనలో వర్షం కురిసిన సమయంలో 4 మీటర్ల మేర నీరు నిలుస్తోంది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లే అవకాశమే లేకుండా పోయింది.

80 కి.మీ. రూ.100 కోట్లు

ఒక్కోదానికి పొడవు, వెడల్పు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు వెచ్చించారు. మొత్తం నిర్మాణాలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. మద్దికెర– డోన్ మధ్య ఐవో డబ్ల్యూ, ఐవోడబ్ల్యూ పరిధిలో 25 శాశ్వత అండర్‌పాస్‌లున్నాయి. 80 కి.మీ. మేర రైల్వే ట్రాక్



వెంట నిర్మించిన భూగర్భ వంతెనల్లో నీరు నిలుస్తోంది.

అండర్ పాస్‌లు 6 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు చొప్పున నిర్మించారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా సమాంతరంగా కాల్వలు తవ్వాలి. వరద నీరు ప్రధాన కాల్వ వరకు వెళ్లేలా మార్గం సుగమం చేయాలి. చాలాచోట్ల కొంత వరకు తవ్వి వదిలేశారు.. 20–30 మీటర్ల వరకు సమాంతర కాల్వ తవ్వి అక్కడ చిన్నపాటి గుంత తీశారు. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

**వంతెన దాటాలంటే కష్టమే**

కిష్టన్న, రైతు, మద్దికెర

నాకున్న మూడెకరాల పొలంలో వాము పంట సాగు చేశా. 20 రోజులుగా పొలానికి వెళ్లే మార్గంలోని రైల్వే వంతెనలో నీరు నిలుస్తోంది. అండర్‌పాస్‌లో నీరు తగ్గిందని వెళ్తే ద్విచక్ర వాహనం నిలిచిపోయింది. సైలెన్సర్‌లోకి నీరు చేరడంతో బండి స్టార్ట్ కావడం లేదు. దీంతో వెనక్కు తోసుకుంటూ వచ్చా. వేలాది మంది రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

# వసతి పర్యవే'క్షీణం'

కర్నూలు : డోన్ బాలుర కళాశాల వసతిగృహంలో ఈనెల 7న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వసతిగృహ అధికారిణి అక్కడ లేరు. ఆమె గతేడాది వరకు ప్రీమెట్రిక్ వసతిగృహానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ రెగ్యులర్ అధికారిని నియమించారు. ప్రస్తుతం చూస్తున్నది ఒక హాస్టల్ బాధ్యతలే అయినాసరే సరిగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

బీసీ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52 వసతి గృహాల్లో 9,729 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 38 చోట్ల సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు వసతిగృహాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని నిధులు బొక్కేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి**

నిబంధనల ప్రకారం సమీపంలోని వసతిగృహ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతిగృహ అధికారికీ ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించకూడదు. వసతిగృహ అధికారులు రెగ్యులర్‌గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌లో సాయంత్రం వేళ ఎఫ్ఆర్ఎస్ వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు. 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతిగృహాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారుతోంది. అంతదూరం వెళ్లలేక పనిచేసే సిబ్బందిపైనే నిర్వహణ భారం మోపి చేతులు దులిపేసుకుంటున్నారు. విద్యార్థులకు సరైన మెనూ అమలుకావడం లేదు.


**వసూళ్ల పర్వం**

ఆలూరు కళాశాల వసతిగృహంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వసూలు చేశారంటూ తహసీల్దారుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. కర్నూలులోని బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పనిచేస్తున్న రాజేశ్వరి అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆరు నెలల తర్వాత నందికొట్కూరు బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పోస్టింగ్ ఇచ్చారు. కొంత కాలానికే ఆమెకు బ్రాహ్మణకొట్కూరు ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు.

ఆదోని కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేస్తున్న అజీంకు మంత్రాలయం ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆదోని నుంచి మంత్రాలయానికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం వెళ్లి పర్యవేక్షించాలంటే కష్టమైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

పత్తికొండ కళాశాల వసతిగృహ అధికారికి మద్దికెర ప్రీమెట్రిక్ వసతిగృహ అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన కర్నూలు కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండయ్యారు. ఇలాంటి వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకూడదన్న నిబంధనలు చెబుతున్నాయి.

# పల్లెముంగిట నేత్రోదయం!




మడకశిర : జిల్లాలోనే అత్యంత మారుమూల ప్రాంతమైన నీలకంఠాపురంలో ప్రసిద్ధిగాంచిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేయడం పేద ప్రజలకు వరంగా మారింది. కంటి జబ్బులకు ఉచిత చికిత్స, శస్త్రచికిత్స అందించేందుకు శ్రీకారం చుట్టింది.

**రఘువీరారెడ్డి కుటుంబీకుల చొరవ**

నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన కంటి చికిత్సలు అందించి వారి కుటుంబాల్లో వెలుగులు చూడాలన్న సంకల్పంతో మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి కుటుంబీకులు ఎల్వీ ప్రసాద్ యాజమాన్యంతో సంప్రదించి నీలకంఠాపురంలో ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేశారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని పరికరాలు సమకూర్చారు. కుటుంబీకులైన శాంత జయరామ్ 2 ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వగా రూ.6 కోట్లు ఖర్చుచేసి అన్ని హంగులతో ఆసుపత్రిని నిర్మించారు. ఇందులో ఎల్వీప్రసాద్ యాజమాన్యం నియమించిన వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

**25వ శాఖ ప్రారంభం**

నీలకంఠాపురంలోని ఓ భవనంలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభించి మూడేళ్లలో 14వేల మందికి ఉచితంగా కంటి వైద్య చికిత్సలు అందించారు. ఎంతో నమ్మకం ఏర్పడ్డాక నూతన భవనాన్ని నిర్మించారు. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిశాలలో 24 శాఖలు ఉండగా 25వది నీలకంఠాపురంలో అందుబాటులోకి వచ్చింది.

**లక్ష్యం.. 5 లక్షల మంది**

శ్రీసత్యసాయి జిల్లాతో పాటు కర్ణాటకలోని మధుగిరి, కొరటగెర, శిర, కళ్యాణదుర్గం, పెనుకొండ, హిందూపురం తదితర ప్రాంతాల్లో 5 లక్షల మందికి కంటి వైద్య చికిత్సలు అందించి కంటి చూపు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో లక్ష్యాన్ని సాధిస్తామని ఎల్వీప్రసాద్ యాజమాన్యం పేర్కొంటోంది.

**80 శాతం ఇక్కడే పరిష్కారం**

అధునాతన చికిత్సలు అందించి ఇక్కడే 80 శాతం కంటి సమస్య పరిష్కరించేదిశగా ఆసుపత్రి పనిచేస్తోంది. 20 శాతం అత్యంత క్లిష్టతరమైతే హైదరాబాద్‌లో కంటి వైద్యనిపుణులను సంప్రదించి చికిత్సలందించనున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి, అంగవైకల్యంతో బాధపడేవారికి ఇళ్ల వద్దకే టెక్నీషియన్లతో కిట్లను తీసుకువెళ్లి పరీక్షించి వైద్యుల సలహాలు, సూచనలతో చికిత్సలందించనున్నారు.

# శుద్ధజలం సరఫరాకు అడుగులు



గుంతకల్లు : గుంతకల్లు ప్రజలకు శుద్ధజలం అందించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇది వరకు శుభ్రమైన నీటిని అందించాలని మొదటి విడత అమృత్ పథకం కింద గుంతకల్లులో ప్రారంభించిన శుద్ధజల ప్లాంట్ నిర్మాణాన్ని అధికారులు అటకెక్కించారు. 2018లో ఎస్ఎస్ ట్యాంకుల వద్ద ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆయా పనులు ఐదేళ్ల కిందట ఆగిపోయాయి. అధికారులు, గుత్తేదారుకు మధ్య విభేదాలు తలెత్తడంతో పనులు పునాదులకు పరిమితమయ్యాయి. తాజాగా ఆగిపోయిన పథకంతో అవసరం లేకుండా కొత్త ప్లాంట్‌ను నిర్మించాలని నిర్ణయించారు.

**టెండర్ల ప్రక్రియ మొదలు**


ఎస్ఎస్ ట్యాంకు వద్ద అమృత్ పథకం కింద నిర్మించనున్న శుద్ధజల పథకానికి అనుసంధానంగా దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలు, జగనన్న కాలనీలకు శుభ్రమైన నీటిని అందించాలని అధికారులు నిర్ణయించారు. శుద్ధజల కేంద్రం నుంచి కాలనీల వరకు పైప్‌లైన్లను ఏర్పాటు, కాలనీల్లో అంతర్గత పైప్‌లైన్ల నిర్మాణం, ఉపరితల ట్యాంకు నిర్మాణం పనులను అమృత్ పథకం కింద రూ. 18 కోట్లతో నీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా పనులను ప్రారంభించాలని తీర్మానించారు.

**పనుల పూర్తికి కార్యాచరణ**

ఎస్ఎస్ ట్యాంకుల నుంచి వచ్చే నీటిని శుభ్రం చేసేందుకు రెండో విడత అమృత్ పథకం కింద రూ.23 కోట్లతో కొత్త శుద్ధజల పథకాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించడంతో ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం వారు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ప్లాంట్ పనులు రెండేళ్లల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్లాంట్ పూర్తయితే పట్టణ ప్రజలకు అధికారులు శుభ్రమైన నీటిని అందించడానికి వెసులుబాటు కలుగుతుంది.

**ప్రక్రియ ప్రారంభమైంది** శుద్ధజల ప్లాంట్‌ను, తాగునీటి పథకం ఏర్పాటు చేసే పనులను రెండో విడత అమృత్ పథకం కింద ప్రారంభమవుతున్నాయి. ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం వారు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. పాత శుద్ధజల పథకం అంశం వివాదంలో పడింది. ప్రజల అవసరాలను తీర్చే బాధ్యత మున్సిపాలిటీపై ఉండడంతో కొత్త ప్లాంట్‌ను నిర్మించడం జరుగుతోంది. ఆ పనులు పూర్తయితే పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇంతియాజ్, మున్సిపల్ ఈఈ

# తీర్థాలేమాయె నారసింహా!



కదిరి : స్వయంభువుగా వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికున్న 13 పవిత్ర తీర్థాలు ఒక్కొక్కటి మాయమవుతున్నాయి. ఆక్రమణల కారణంగా కొన్ని, ఆదరణ కొరవడి అధ్వానంగా మారి మరికొన్ని కనుమరుగు అవుతున్నాయి. తీర్థాలను సంరక్షిస్తేనే ఆధ్యాత్మిక శోభ పది కాలాలు విరాజిల్లుతుంది.

1. అర్జున తీర్థం

ఆలయానికి నైరుతి దిక్కున ఉంది. వర్షాభావంతో ప్రవాహాలు కనుమరుగయ్యాయి. పట్టణం విస్తరించి ఏరు కుంచించుకు పోయి తీర్థం మాయమైంది.

2. నాగుల..

ఆలయానికి ఉత్తరం వైపున 2 కి.మీ దూరంలో ఉంది. పూర్వం పాదచారులు, భక్తులు స్నానాలు చేసి గట్టుపై ఉన్న నాగులను పూజించి, ఖాద్రీశుని దర్శించుకునేవారు. ఆ ప్రాంతంలో నిర్మాణాలు మొదలవటంతో రూపు కోల్పోయింది.

3. గజేంద్ర

ఆలయం ఉత్తరం వైపు గజేంద్ర తీర్థం ఉండేది. ఆ ప్రాంతాన్ని పాత కోనేరు వీధిగా పిలుస్తారు. ప్రస్తుతం ఆ పరిసరాల్లో అధిక సంఖ్యలో భవనాలు వెలిశాయి. దీంతో తీర్థం ఆనవాళ్లు లేవు.

4. ఆళ్వారుల

ఆలయంలోని వేయికాళ్ల మండపం వద్ద ఉండేది. ఈ తీర్థాన్ని ఆళ్వారులు జపం, తపస్సులకు ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయింది.

5. అచ్యుత

ఆలయ మహాద్వారానికి ఎదురుగా రథం నిలిపిన చోటులో తూర్పున ఉన్న ఈ తీర్థం ఆక్రమణకు గురైనట్లు దేవాదాయశాఖ గుర్తించింది. తరువాత ఎలాంటి చర్యల్లేక పూడిపోయింది.

6. స్వర్ణ

యాగశాలకు తూర్పున ఉండేది. దీన్ని బంగారు తీర్థమని పిలిచేవారు. ఇందులోని నీటిని పూజాకార్యక్రమాలకు వినియోగించేవారు. కాలక్రమంలో ఇది కనుమరుగవడంతో భక్తులు బాధపడుతున్నారు.

# సర్వజనం విన్నవిస్తోంది.. ఎయిమ్స్ తరహా సేవలకు!

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యకళాశాలను ఎయిమ్స్ స్థాయిలో తీర్చిదిద్ది స్వయం ప్రతిపత్తి గల తుంగభద్ర మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని.. రాష్ట్ర విభజన అనంతరం 2015లో ప్రతిపాదించారు.. ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడలేదు.. ఏడు దశాబ్దాలుగా రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది.. ఏటా సుమారు పది లక్షల మంది ఓపీ, లక్ష మందికిపైగా ఐపీ సేవలు అందిస్తూ రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకొని తుంగభద్ర మెడికల్ ఇన్‌స్టిట్యూట్ అంశాన్ని ఈనెల 16న నగరాకొస్తున్న ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా వాసులు విన్నవిస్తున్నారు.

**అసంపూర్తిగా అభివృద్ధి పనులు**

సర్వజన వైద్యశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి, ఆధునికీకరణ పనులు, మరమ్మతులు ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. 2022లో నాడు–నేడు కింద చేపట్టిన ఓపీడీ బ్లాక్ నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయింది. సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన దీనికి



గత ప్రభుత్వం సరిపడా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టకపోవడంతో పురోగతి కరవైంది. దీంతో వివిధ వార్డుల్లో సరిపడా గదులు, పడకలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీడీ బ్లాక్ పూర్తయితే సుమారు 650 పడకలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయి.

**వైద్య పరీక్షలు ఖరీదే**

బోధనాసుపత్రికి అనుబంధంగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అందుబాటులోకి వచ్చి ఏడాది గడిచినా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. ఇక్కడ వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు కరవయ్యాయి. దీంతో సర్వజన వైద్యశాల లేదా ప్రైవేటుగా పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ చేరిన పేదలు ఖరీదైన వైద్య పరీక్షలను ప్రైవేటు చేయించుకునేందుకు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**మెట్రో నగరాలకెళ్తేనే మెరుగైన వైద్యం**

వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికీ గ్యాస్ట్రో సర్జికల్ విభాగం, కార్డియో థొరాసిక్ విభాగంలో డీఎంసీట్లు లేవు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రత్యేక విభాగం, పీడియాట్రిక్, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జరీ ప్రత్యేక ఐసీయూ వంటి విభాగాలతో పాటు కొన్ని యూనిట్లలో మొక్కుబడి సేవలు అందుతున్నాయి. ఇప్పటికీ కర్నూలు వైద్య కళాశాలలో కొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు ప్రొఫెసర్లు లేక ఇన్‌ఛార్జులతో నడుస్తున్నాయి.

సర్జికల్ గ్యాస్ట్రో, పీడియాట్రిక్ కార్డియో సర్జరీ, కొన్ని క్యాన్సర్ సర్జరీలు క్రిటికల్ కేర్‌కు సంబంధించిన కొన్ని జబ్బులకు వైద్యసేవల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వజన వైద్యశాలలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నా దీనికి గుర్తింపు లేకపోవడంతో ప్రత్యేకంగా వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. దీనికి గుర్తింపు లభిస్తే ప్రత్యేక వైద్యులు, సిబ్బంది అందుబాటులోకి వస్తారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడేందుకు వీలవుతుంది.


# తామ్ర శాసనాలు.. చరిత్రకు ఆనవాళ్లు

నంద్యాల : శ్రీశైలం ఆలయ చరిత్రను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తెలియజేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన మల్లన్న ఆలయం గొప్పదనానికి దర్పణం పట్టే తామ్ర శాసనాలను ప్రధాని స్వయంగా వీక్షించనున్నారు. ప్రాచీనకాలం నాటి పంచ మఠాలను పునరుద్ధరించేందుకు కొన్నేళ్ల కిందట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఘంటామఠం జీర్ణోద్ధరణ పనులు చేస్తుండగా 53 తామ్ర శాసనాలు బయటపడ్డాయి. వీటిల్లోని విషయాలను ప్రధానికి వివరించనున్నారు.

**ఇలా చేస్తే..** శతాబ్దాల నాటి చరిత్రను భక్తులు తెలుసుకునేందుకు శ్రీశైలంలో పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేయాలని చాలాకాలం నుంచి ప్రతిపాదన ఉంది. నిధుల కొరతతో మ్యూజియం ఏర్పాటుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రాచీనకాలం నాటి నిర్మాణాలు, విగ్రహాలను భక్తులు వీక్షించేందుకు అవకాశం లేకుండా పోయింది. పంచమఠాల నిర్మాణ సమయంలో రుద్రాక్ష మఠంలోని సొరంగంలో వందల ఏళ్ల నాటి వస్తువులు బయటపడ్డాయి. శ్రీశైలం, దాని పరిసరాల్లో లభించిన తామ్ర, శిలా శాసనాలతో మ్యూజియం ఏర్పాటుచేస్తే భావితరాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

**ఆసక్తికర అంశాలెన్నో..**

శ్రీశైలంలో దొరికిన తామ్ర శాసనాలను పురావస్తు శాఖ అధికారులు అధ్యయనం చేసినప్పుడు పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఇక్ష్వాకులు, శాలంకాయనులు, ఆనందగోత్రులు, విష్ణుకుండినులు శ్రీపర్వతాన్ని పూజించిన దాఖలాలున్నాయి. చాళుక్యులు, రెడ్డి రాజులు,



రేచెర్ల వంశీయులు, కాకతీయ, విజయనగర రాజులు, గజపతులు తదితరులు శ్రీశైలం ఆలయాన్ని దర్శించుకున్నట్లు ఆయా శాసనాల్లో ఉన్న వివరాల ఆధారంగా స్పష్టమైంది. కర్నూలు నవాబు ఇబ్రహీంఖాన్ సైతం శ్రీశైలానికి విరివిగా దానాలు చేశారు. కొందరు ముస్లిం రాజులు శ్రీశైల అగ్రహారాలన్నింటినీ స్వాధీనం చేసుకుని స్వామివారికి కైంకర్యాలు జరగకుండా అడ్డుకున్నట్లు కొన్ని తామ్ర శాసనాల్లో బయటపడింది. 1421లో రేచర్ల రాజైన లింగమనాయకుడు వారిపై పోరాడి ఆయా అగ్రహారాలను తిరిగి స్వాధీనం చేసుకుని స్వామివారి కైంకర్యాలు పునరుద్ధరించారు.

**సమగ్ర వివరాలతో పుస్తకం రాశా**

–మునిరత్నంరెడ్డి, సంచాలకులు, భారత పురావస్తు శాఖ

శ్రీశైలంలో లభించిన తామ్ర శాసనాల వివరాల ఆధారంగా 'శ్రీశైల నూతన తామ్ర శాసనాలు' పేరుతో పుస్తకం రచించా. భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలంలో తామ్ర శాసనాల ప్రదర్శనతోపాటు ఆ పుస్తకాన్ని ఆవిష్కరిస్తాం. శ్రీశైలం ఆలయానికి సంబంధించిన తామ్ర, శిలా శాసనాలు, అందులోని వివరాలు ప్రజలకు తెలిసేలా మ్యూజియం ఏర్పాటుచేయాలని కేంద్రానికి ప్రతిపాదిస్తున్నాం.

## మతిపోగొట్టే శోభిత లుక్స్

టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేయకున్నా శోభితా ధూళిపాళ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఎందుకంటే శోభిత అక్కినేని వారి ఇంటి కోడలు అనే విషయం తెల్సిందే. నాగ చైతన్యను వివాహం చేసుకున్న తర్వాత, చేసుకోక ముందు కూడా శోభితా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. బాలీవుడ్‌లో ఈమెకు మంచి ఆఫర్లు లభించాయి, తద్వారా ఇప్పటికే బాలీవుడ్‌లో గుర్తింపు ఉన్న హీరోయిన్స్ జాబితాలో చేరింది. అంతే కాకుండా ఇతర భాషల్లో కూడా ఈమె సినిమాలు చేసిన కారణంగా అన్ని చోట్ల మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ఇతర భాషల్లో ఎక్కువగా శోభితా కనిపించడం తెలుగు వారికి గర్వించదగ్గ విషయం అనడంలో సందేహం లేదు. నాగ చైతన్యతో వివాహం తర్వాత కూడా శోభిత వరుస ప్రాజెక్ట్‌లు కమిట్ అవుతూనే ఉంది.

**నాగ చైతన్యతో పెళ్లి తర్వాత శోభిత దూళిపాళ...** తెలుగులో నాగ చైతన్యతో కలిసి శోభిత ఒక సినిమా చేయాలని అక్కినేని ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి అలాంటి చర్చలు ఏమీ లేవు. కానీ



భవిష్యత్తులో చేయాలని అనుకుంటున్నట్లుగా మాత్రం వార్తలు వస్తున్నాయి. ఆ విషయాన్ని వారు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. గత ఏడాది కాలంగా కొత్త సినిమాలతో రాని శోభిత వచ్చే ఏడాదిలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఒక హిందీ సినిమా, ఒక వెబ్ సిరీస్ లో ఈమె నటిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఇక రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో శోభిత తన అందమైన ఫోటోలు, ఫ్యామిలీ ఫోటోలు, సినిమాలకు సంబంధించిన విషయాలను షేర్ చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో శోభిత ఫోటోలు వైరల్...** బ్లాక్ టాప్‌తో పాటు, బ్లూ జీన్స్ ధరించిన శోభిత అల్ట్రా స్టైలిష్ గా కనిపిస్తోంది. అందాల ఆరబోత చేసినప్పటి కంటే ఇప్పుడు మరింత అందంగా ఈమె కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మతి పోగొడుతున్న ఈ ఫోటోలు ఆమె అందం గురించి మరోసారి చర్చ జరిగేలా చేశాయి అనడంలో సందేహం లేదు. తెలుగు అమ్మాయి అయినప్పటికీ ముంబై ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందం విషయంలో, అన్ని విషయాల్లోనూ శోభిత ముందు ఉంటుంది. అందుకే బాలీవుడ్‌లో ఏకంగా ముంబై ముద్దుగుమ్మలకు పోటీగా నిలుస్తుందని ఆమె అభిమానులు అంటున్నారు. ఈమె అందంకు తగ్గట్లుగా టాలీవుడ్‌లో, కోలీవుడ్‌లో ఆఫర్‌లు రావడం లేదు అంటూ అభిమానులు కొందరు సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సూర్య సినిమా రీ రిలీజ్.. డైరెక్టర్ కి ప్లస్ అవుతుందా..?

కోలీవుడ్ స్టార్ సూర్య నటించిన ఒక సినిమా రీ రిలీజ్ హంగామా మొదలైంది. ఐతే 11 ఏళ్ల క్రితం రిలీజైన ఈ సినిమా అప్పట్లో పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు. ఐతే ఆ తర్వాత మాత్రం ఆ సినిమా గురించి డిస్కస్ చేస్తూ వచ్చారు. 11 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్ చేస్తున్నారు. ఆ సినిమా డైరెక్టర్ కూడా అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ రీ రిలీజ్ పై ఆసక్తిగా ఉన్నాడు. ఇంతకీ ఏ సినిమా గురించి ఇదంతా అంటే.. సూర్య, లింగుసామి కాంబినేషన్ లో వచ్చిన అంజాన్ సినిమా గురించే అన్నమాట.

**తమిళ్ తో పాటు తెలుగులో కూడా..** అంజాన్ 2014లో రిలీజైన ఈ సినిమాలో సూర్య డ్యూయల్ రోల్ చేయగా సినిమాలో హీరోయిన్ గా సమంత నటించింది. ఈ సినిమాను తెలుగులో సికిందర్ అనే టైటిల్ తో రిలీజ్ చేశారు. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా ఈ సినిమాను ప్రేక్షకులు పట్టించుకోలేదు. అప్పట్లో సూర్య మంచి ఫాం లో ఉండగా అతని ఫాం కి ఈ సినిమా బ్రేక్ వేసినట్టు అయ్యింది. సూర్య సినిమా రీ రిలీజ్ టైంలో డైరెక్టర్ లింగుసామి ఆ సినిమా



రిలీజ్ టైంలో కొన్ని కారణాల వల్ల ఎడిటింగ్ సరిగా చేయలేదని.. ఐతే ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ సినిమా రీ రిలీజ్ కోసం ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమ ఆకట్టుకుందని అన్నారు.

లింగుసామి అంజాన్ అదే సికిందర్ సినిమా రీ రిలీజ్ ని తనకి ప్లస్ అయ్యేలా చేసుకోవాలని చూస్తున్నారు. రామ్ తో ది వారియర్ తర్వాత 3 ఏళ్లుగా లింగుసామికి మరో మూవీ ఛాన్స్ రాలేదు.

**లింగుసామి యాక్షన్ సినిమాలు..** పాతికేళ్ల కెరీర్ లో 10 సినిమాలు మాత్రమే చేసిన లింగుసామి తిరిగి స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. అప్పట్లో తెలుగు స్టార్స్ తో లింగుసామి కథాచర్చలు అంటూ హడావిడి చేశారు కానీ ఆయన ఫాంలో లేరని తెలిసి సైలెంట్ అయ్యారు. లింగుసామి యాక్షన్ సినిమాలను తెలుగు ఆడియన్స్ కూడా బాగా ఎంజాయ్ చేశారు. ఆవారా సినిమా తెలుగులో సక్సెస్ అయ్యింది. పందెంకోడి సూపర్ హిట్ అయ్యింది. ఐతే మళ్లీ పందెం కోడి లాంటి సినిమా తీసిన లింగుసామిని చూడాలని ఆడియన్స్ కోరుతున్నారు. రామ్ తో ది వారియర్ అటెంప్ట్ కూడా నిరాశపరచడంతో లింగుసామికి ఛాన్స్ లు లేకుండా అయ్యాయి. అంజాన్ సినిమా రీ రిలీజ్ లింగుసామికి ఏమైనా కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి. లింగుసామి కూడా అంజాన్ రీ రిలీజ్ టైం లో యాక్టివ్ గా ఉండటం వల్ల తనకు ఎంతోకొంత హెల్ప్ అవుతుందని భావిస్తున్నారు.





## అఖండ 2 నయా టీజర్: బాలయ్య 'ఉగ్రరూపం' చూశారా!




నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలిస్తే స్క్రీన్ మీద ఎలాంటి విధ్వంసం ఉంటుందో 'అఖండ 2' కొత్త టీజర్ శాంపిల్ చూపించింది. ఇన్నాళ్లు వెయిట్ చేసిన ఫ్యాన్స్ కు పూనకాలు తెప్పించేలా మేకర్స్ ఒక హై వోల్టేజ్ విజువల్ ట్రీట్ ఇచ్చారు. "తాండవం" అనే టైటిల్ కు న్యాయం చేస్తూ, బాలయ్య అఘోరా గెటప్ లో చూపించిన ఉగ్రరూపం చూస్తుంటే బాక్సాఫీస్ రికార్డులు గల్లంతు అవ్వడం ఖాయం అనిపిస్తోంది. టీజర్ ఆరంభమే ఒక పవర్ ఫుల్ డైలాగ్ తో మొదలైంది. "భారత్ ని కొట్టాలంటే అక్కడి మూలాలను అడ్డం పెట్టుకునే కొట్టాలి" అంటూ వచ్చే వాయిస్ ఓవర్ సినిమాలోని సీరియస్ నెస్ ను ఎలివేట్ చేసింది. దానికి తోడు కుంభమేళా విజువల్స్, లక్షలాది మంది సాధువుల మధ్య బాలయ్య నడుస్తుంటే.. స్క్రీన్ మొత్తం ఒక డివైన్ వైబ్రేషన్ తో నిండిపోయింది. ఇది కేవలం సినిమా కాదు, ఒక మాస్ జాతర అని క్లియర్ గా అర్థమవుతోంది. ముఖ్యంగా బాలయ్య ఎంట్రీ షాట్స్ నెవర్ బిఫోర్ అనేలా ఉన్నాయి. నీళ్లలో నుంచి త్రిశూలం పట్టుకుని పైకి లేవడం, అగ్నిగుండం నుంచి నడుచుకుంటూ రావడం చూస్తుంటే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. తమన్ ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ విజువల్స్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. "శివమ్.. శివమ్.." అంటూ సాగే ఆ సౌండ్ డిజైన్ థియేటర్లో సీట్లు దద్దరిల్లేలా ఉంది. ఈసారి బోయపాటి స్కేల్ పెంచినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. హిమాలయాలు, మిలిటరీ బేస్, టెర్రరిస్టుల గ్యాంగ్.. ఇలా కథను చాలా విశాలంగా చూపించారు. బాలయ్య చెప్పిన డైలాగ్ "కొండల్లో తొండలు పట్టుకుని తిని బ్రతికే మీరెక్కడ.. ప్రతి కొండని క్షేత్రంగా మార్చి పూజించే మేమెక్కడ" అనేది ఫ్యాన్స్ చేత విజిల్స్ వేయించేలా ఉంది. యాక్షన్ ఎపిసోడ్స్ లో బాలయ్య ఎనర్జీకి హద్దుల్లేవు. గాల్లోకి లేచి విలన్లను నరకడం, త్రిశూలంతో విలన్లను విసిరికొట్టడం వంటి షాట్స్ మాస్ ఆడియన్స్ కు ఫుల్ మీల్స్ లాంటివి. మొదటి అఖండ కంటే ఇందులో వయొలెన్స్, ఇంటెన్సిటీ డబుల్ అయినట్లు అర్థమవుతోంది. ధర్మాన్ని రక్షించడానికి వచ్చే శివుడి ఉగ్రరూపంలా బాలయ్య కనిపిస్తున్నారు. ?మొత్తానికి డిసెంబర్ 5న థియేటర్లలో అసలు సిసలైన 'తాండవం' చూడబోతున్నాం అని చెబుతున్నారు. మాస్ గాడ్ బాలయ్య, మాస్ డైరెక్టర్ బోయపాటి కలిసి వండిన ఈ విజువల్ వండర్.. ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.

## 'దంగల్' రికార్డులను టార్గెట్ చేసారా?




భారతీయ చిత్ర పరిశ్రమలో భారీ వసూళ్లు సాధించిన చిత్రమేది? అంటే అందరికీ గుర్తొచ్చేది దంగల్. అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో నితీష్ తివారీ తెరకెక్కించిన చిత్రం ఏకంగా 2000 కోట్ల వసూళ్లతో సరికొత్త రికార్డు సృష్టించింది. అదీ ఒకే భాగంగా రిలీజ్ అయి అన్ని కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇండియాలో వసూళ్ల కంటే? చైనా మార్కెట్ నుంచే 1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇండియన్ మార్కెట్ నుంచి సాధించింది కేవలం 700 కోట్లు మాత్రమే. రెజ్లింగ్ నేథ్యంలో తెరకెక్కిన సినిమా కావడంతో చైనా ప్రేక్షకులు ఆ చిత్రానికి బ్రహ్మరథం పట్టారు.

**రికార్డులు తిరగ రాసేలా:** ఇండియన్ బాక్సాఫీస్ లెక్కల పరంగా చూస్తే బాహుబలి, పుష్ప లాంటి చిత్రాలు భారీ వసూళ్లు సాధించిన చిత్రాలుగా కనిపిస్తున్నాయి. వాటి సంగతి పక్కన బెడితే? 2000 కోట్ల రికార్డును తిరగరాసేది మళ్లీ నితీష్ తివారీనేనా అంటే? అవుననే అనాలి. ప్రస్తుతం రణబీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో ఇతిహాసం రామాయణాన్ని రెండు భాగాలు గా తివారీ తెరకెక్కిస్తోన్న సంగి తెలిసిందే. ఈ సినిమా వందల కోట్లలో ఉంది. ఇప్పటికే మొదటి భాగం రామాయణం షూటింగ్ పూర్తయింది. వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా తొలి భాగం రిలీజ్ కానుంది.

**హాలీవుడ్ లో భారతీయ కథలు:** మొదటి భాగానికి సంబంధించి పోస్ట్ ప్రడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ కథ కూడా విజువల్ ట్రీట్ గా హైలైట్ అవుతుందని నితీష్ చెప్పుకొచ్చాడు. రెండు సంవత్సరాల కష్టం రిలీజ్ అవుతుందని..తనకి కూడా లోలోపల టెన్షన్ ఉందన్నాడు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ స్టామినా ఎంత? 2000 కోట్ల వసూళ్లు రాబట్టే సత్తా ఉందా? అంటే అందుకు అవకాశాలు కనిసిస్తున్నాయి. రామాయణం అంటే భారత్ లోనే కాదు ప్రపంచ దేశాల్లోనూ ఎంతో క్రేజ్ ఉంది. భారతీయ చారిత్రాత్మక అంశాలను ఆధారంగా చేసుకునే హాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు.

**మోదీ పర్యటనలు కలిసొచ్చేలా:** అవతార్ కథలకు స్పూర్తి భారతీయ పుస్తకాలే. భాగవతం, మహాభారతం వంటి వాటికి ప్రపంచ దేశాల్లో ఎంతోప్రత్యే కత ఉంది. అందులోనూ రాముడు..సీత..అంజనేయుడు..లంకేశ్వరుడు కథ అంటే? ఎంతో ఆసక్తిగానూ ఉంటుంది. ఆ కథకు విజువల్ ట్రీట్ ఇస్తోన్న చిత్రం కావడంతో? ప్రపంచ దేశాల్లో రామాయణం భారీ ఎత్తున రిలీజ్ ప్లానింగ్ రెడీ అవుతోంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే దేశాల్లో ప్రత్యేకంగా రిలీజ్ చేయనున్నారు. మోదీ అధికారంలోకి రావడంతో భారతీయ హిందు సంప్రదాయాలు మరింత విశ్వవ్యాప్తమయ్యాయి. అది కూడా ఈ సినిమాకు ప్రధానంగా కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మరి ఈ అంచనాలను రామాయణం అందుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.

## గ్లామర్‌లోనే కాదు అభినయంలోను భాగ్యశ్రీ ది గ్రేట్

ఎవరికైనా ఒక టైమ్ రావాలి. అలాంటి టైమ్ కలిసొచ్చింది భాగ్యశ్రీకి. కేవలం గ్లామరస్ పాత్రల్లోనే కాదు, నటించేందుకు అవకాశం ఉన్న పాత్రలు ఆఫర్ చేస్తే, తాను కూడా తగ్గేదేలే అని ఇటీవల నిరూపిస్తోంది. ఇంతకుముందు దుల్కర్ సల్మాన్ కాంత సినిమాలో అద్భుత అభినయంతో ఆకట్టుకున్న భాగ్యశ్రీ ఇప్పుడు రామ్ సరసన నటించిన ఆంధ్రా కింగ్ తాలూకాలోను తనదైన అద్భుత ప్రదర్శనతో రక్తి కట్టించింది.

**గ్లామర్ ని మించి అభినయం..** భాగ్యశ్రీ బోర్సే గ్లామర్ డాళ్ ఇమేజ్ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లే. కాంతలో అదరగొట్టిన ఆమె..ఆంధ్ర కింగ్ తాలూకాలోనూ ఆకట్టుకుంది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. అందంతో పాటు అభినయంతోనూ భాగ్యశ్రీ మెప్పించింది. సినిమాలోని కీలక సన్నివేశాలలో తన అభినయానికి క్రిటిక్స్ మంచి మార్కులే వేసారు. ముఖ్యంగా భాగ్యశ్రీ గ్లామర్ డాళ్ అనుకుంటే, తనలోని నటిని ఈ సినిమాలో చూడొచ్చు! అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రామ్ ఇంతకుముందు ప్రీరిలీజ్ వేదికపై భాగ్య శ్రీ గురించి అంత



ఎమోషనల్ గా ఎందుకు మాట్లాడాడో ఈ సినిమా చూసిన తర్వాత ప్రజలకు అర్థమైంది. భాగ్యశ్రీ ఇంత గ్లామర్ డాళ్ లా ఉంది.. కానీ ఆడిషన్స్ లో తన అభినయం చూసి వెంటనే ఓకే చేసామని రామ్ చెప్పారు. దానికి తగ్గట్టే భాగ్యశ్రీ సినిమా ఆద్యంతం నటిగా రాణించింది. ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రానికి క్రిటిక్స్ యునానిమస్ గా అద్భుతమైన రేటింగులు ఇచ్చి ప్రోత్సహించారు.

**వరుస విజయాలతో దూకుడు..** ఇప్పుడు కాంత, ఆంధ్రా కింగ్ తాలూకా లాంటి విజయాలతో భాగ్యశ్రీ రేంజ్ అమాంతం పెరగనుంది. పారితోషికాన్ని చుక్కల్లోకి తీసుకెళ్లే కథానాయికల జాబితాలో భాగ్యశ్రీ కూడా చేరిపోనుంది. ఈ రెండు విజయాలతో భాగ్యశ్రీ ఫోటోషూట్ల పరంగాను దూకుడును ప్రదర్శిస్తోంది. తాజా ఫోటోషూట్ లో ఈ ముగ్ధమనోహరి అందచందాలు మరో లెవల్ లో ఎలివేట్ అయ్యాయి. సింపుల్ డిజైనర్ డ్రెస్ లో భాగ్యశ్రీ ఎంతో క్యూట్ గా లవ్వబుల్ గా కనిపిస్తూనే, తనలోని గ్లామర్ ని ఎలివేట్ చేసిన తీరుకు బోయ్స్ ముగ్ధులైపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

**ప్రతిభకు పట్టం:** టాలీవుడ్ లో అత్యంత వేగంగా ఎదిగేసిన కథానాయికల జాబితాలో సాయిపల్లవి, కియరా అద్వాణీ, రష్మిక మందన్న, శ్రీలీల పేర్లు మార్మోగుతున్నాయి. ప్రతిభకు ప్రజలు పట్టంగడగారనడానికి వీరంతా ఉదాహరణలు. ఇప్పుడు ఈ జాబితాలో భాగ్యశ్రీ పేరు కూడా చేరిపోనుందని అభిమానులు భావిస్తున్నారు. భాగ్యశ్రీ భవిష్యత్ ఉజ్వలంగా వెలిగిపోవాలని కూడా ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.

## 8 గంటల పనిదినం వెనక కష్టం చెప్పిన కీర్తి

ఈరోజుల్లో 8గంటల పనిదినం గురించి దేశవ్యాప్తంగా అన్ని సినీపరిశ్రమల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. దీపిక పదుకొనే కేవలం 8గం.ల పని దినం కారణంగా రెండు పెద్ద అవకాశాల్ని కోల్పోవడంతో ఈ చర్చకు మరికాస్త ప్రాధాన్యత పెరిగింది. అయితే ఎనిమిది గంటల పనిదినం లేదా 9-6 జాబ్ గురించి నటి కీర్తి సురేష్ ని ప్రశ్నిస్తే, తను ఇచ్చిన జవాబు నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి తాను 24గంటల షిఫ్ట్ పని చేస్తానని కీర్తి సురేష్ అన్నారు. 9-6 షిఫ్ట్... 9-9 షిఫ్ట్.. 9-2 షిఫ్ట్ కూడా తనకు అలవాటు అని తెలిపారు. నిజానికి నేను మహానటి షూటింగ్ చేసేప్పుడు ఒకేసారి ఐదు సినిమాలకు పని చేసాను. అజ్ఞాతవాసి, సామి 2, సర్కార్, పందెంకోడి 2 (సందకోడి2) , వీటితో పాటు మహానటి సినిమా చేసాను. చాలామందికి ఎనిమిది గంటల పని దినం అంటే అర్థం కావడం లేదు. దీని గురించి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. వాస్తవానికి 9కి మేకప్ తో ఆర్టిస్టు రెడీ అవ్వాలంటే 7గంటలకే సెట్లో ఉండాలి. ఆర్టిస్టు 6 గంటలకు బయల్దేరితేనే సెట్ కి రాగలడు. అలా రావాలంటే, 5 గంటలకు నిద్ర లేచి రెడీ అవ్వాలి. 6 గంటలకు ప్యాకప్ చెబితే, మేకప్ రిమూవ్ చేసి ప్రయాణించి ఇంటికి వెళ్లడానికి



అదనంగా మరో గంట పడుతుంది. 9-6 పని అంటే ఇంత ఉంటుంది.. అని కీర్తి డీటెయిలింగ్ ఇచ్చారు. ఇది కేవలం ఆర్టిస్టు వరకే, టెక్నీషియన్లు, లైట్ మెన్లు వీరంతా ఆర్టిస్టులు సెట్ కి రాకముందే అక్కడ ఉండాలి. ఆర్టిస్టులు వెళ్లిపోయిన తర్వాత సెటప్ మొత్తం సర్దుకోవడానికి చాలా సమయం పడుతుంది. అంటే వాళ్లు ఎంత అదనపు సమయం పని చేయాలో, ఎంతగా వేచి చూడాలో ఆలోచించండి! అని కీర్తి సురేష్ సినిమా కష్టాల గురించి మాట్లాడారు. మహానటి చిత్రీకరణ సమయంలో మరో నాలుగు సినిమాలతో తాను 24 బై 7 కాల్షీట్లను మ్యానేజ్ చేసానని తెలిపారు. సహజంగా మనిషికి 8గంటల నిద్ర అవసరం. కానీ మాకు అంత నిద్ర ఎక్కడ కుదురుతుంది. 5గంటలు నిదురపోవడం కూడా గగనం. సాయంత్రం 8గం.లకు ఇంటికి చేరితే ఆ తర్వాత ఒక గంట వర్కవుట్ల కోసం, అర్థగంట షవర్ కింద సరిపోతుంది. 11- 11.30 పీఎం మధ్య నిదురపోతే మళ్లీ 5గంటలకే నిద్ర లేవాలి అని ఆర్టిస్టు రోజువారీ సైకిల్ గురించి కీర్తి వర్ణించిన తీరు నిజంగా కళాకారుల కష్టానికి అద్దం పట్టింది. తెలుగు తమిళంలో 9-6 పని చేస్తారు కానీ, మలయాళం, హిందీలో 12గంటలు వర్క్ షెడ్యూల్ ఉంటుందని కూడా కీర్తి వెల్లడించారు. రివాల్వర్ రీటా విడుదల ప్రచారంలో బిజీగా ఉన్న కీర్తి ఈ విషయాలన్నిటినీ చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536